www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



గురువారం | 18-7-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 93 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం, తిథి: ద్వాదశి రా. 8.44 తదుపరి త్రయోదశి; నక్షత్రం: జ్యేష్ఠ తె. 3.25 తదుపరి మూల; వర్జ్యం: ఉ.8.51-10.28; దుర్ముహూర్తం: ఉ.10.12-11.03, మ.3.22-4.13; అమృతఘడియలు: సా.6.32-8.09; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 5.53; సూర్యాస్తమయం: 6.48 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

భారత సైన్యం 117

ఒలింపిక్ బృందాన్ని ప్రకటించిన క్రీడాశాఖ

బరిలో ఎనిమిది మంది తెలుగోళ్లు

న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొనే భారత క్రీడాకారుల బృందాన్ని కేంద్ర క్రీడా శాఖ ప్రకటించింది. ఇందులో 117 మంది అథ్లెట్లు, 140 మంది సహాయ సిబ్బంది ఉన్నారు. ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన దేశీయ అథ్లెట్లలో షాట్ పుటర్ అభా ఖతువా మినహా మిగిలిన వారందరూ పారిస్‌కు వెళ్తున్నారు. అభా గైర్హాజరుకు గల కారణాలు తెలియరాలేదు. పారిస్ ఒలింపిక్స్ ఈనెల 26 నుంచి వచ్చే నెల 11వ తేదీ వరకు జరగనున్నాయి. ఆరంభ వేడుకలను 26న నిర్వహించనున్నారు. 140 మంది సహాయ సిబ్బందికి అయ్యే ఖర్చులో ప్రభుత్వం 72 మందికి మాత్రమే భరిస్తోంది. మిగిలిన వారు సొంత ఖర్చులతో పారిస్ ప్రయాణించనున్నారు. అత్యధికంగా అథ్లెటిక్స్ నుంచి 29 మంది (18 పురుష, 11 మహిళ అథ్లెట్లు), షూటింగ్ 21 (11 మహిళ, 10 పురుష), హాకీ 19, టేబుల్ టెన్నిస్ 8, బ్యాడ్మింటన్ 7, రెజ్లింగ్ 6, ఆర్చరీ 6, బాక్సింగ్ 6, గోల్ఫ్ 4, టెన్నిస్ 3, స్విమ్మింగ్ 2, సెయిలింగ్ 2, ఈక్వెస్ట్రియన్, జూడో, రోయింగ్, వెయిట్ లిఫ్టింగ్ నుంచి ఒక్కరు చొప్పున భారత బృందంలో చోటు దక్కించుకున్నారు. టోక్యో ఒలింపిక్స్ బృందం (119)తో పోలిస్తే ఈసారి ఇద్దరు తగ్గారు. మాజీ షూటర్ గగన్ నారంగ్ ఈ బృందానికి చెఫ్ డి మిషన్‌గా వ్యవహరిస్తాడు. తెలుగు రాష్ట్రాల నుంచి షట్లర్లు సింధు, సాత్విక్, బాక్సర్ నిఖత్, షూటర్ ఇషా సింగ్, టీటీ ప్లేయర్ శ్రీజ, అథ్లెట్లు జ్యోతి యర్రాజీ, జ్యోతికశ్రీ, ఆర్చర్ ధీరజ్ పారిస్ క్రీడల బరిలో ఉన్నారు.

పారిస్ ఒలింపిక్స్ 8 రోజుల్లో

అమ్మ అండతో సాగి..
పారిస్‌వైపు అడుగేసి!



జ్యోతి యర్రాజి

ఒలింపిక్స్‌లో పతకమే లక్ష్యంగా జ్యోతి



తల్లితో జ్యోతి

జ్యోతి యర్రాజి.. దేశ అథ్లెటిక్స్‌లో ఓ సంచలనం. 100 మీటర్ల హర్డిల్స్‌లో రికార్డులు తిరగ రాయడం ఆమెకు మంచినీళ్ల ప్రాయం. బరిలోకి దిగిందంటే రికార్డు నెలకొల్పాల్సిందే అన్నట్టు ఉంటుంది ఆమె పరుగు. అనతికాలంలోనే తన ఈవెంట్‌లో భారత టాప్ అథ్లెట్‌గా పేరుపొందిన ఈ తెలుగమ్మాయి.. కొద్ది కాలంలోనే ఒలింపిక్స్‌కు సైతం క్వాలిఫై అయింది. వరల్డ్ ర్యాంకింగ్స్ కోటాలో పారిస్ బెర్త్ దక్కించుకున్న జ్యోతి ..విశ్వ క్రీడల 100 మీ. హర్డిల్స్‌లో తలపడనున్న తొలి భారత అథ్లెట్‌గా రికార్డు అందుకోనుంది. తాను ఎంచుకున్న రంగంలో ఇంతటి పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోవడం వెనుక జ్యోతి స్వయంకృషితోపాటు ఆమె తల్లి కుమారి పడ్డ కష్టం ఎంతో ఉంది. అందుకే..పోటీలకోసం 'స్టార్టింగ్ లేన్'లో నిలుచున్నపుడు తల్లి శ్రమ జ్యోతి మదిలో మెదులుతుంది. దాంతో ఆ పోటీలో గెలిచి తీరాలన్న కాంక్ష ఆమెలో రెండింతలవుతుంది. ఆ క్రమంలోనే జ్యోతి పరుగుకు పలు జాతీయ రికార్డులు దాసోహమయ్యాయి. విశాఖపట్నానికి చెందిన జ్యోతిది పేద కుటుంబం. క్రీడా రంగంపై ఆమెకు ఎంతో ఆసక్తి ఉన్నా..ఆ దిశగా అడుగులు వేసేందుకు కుటుంబ ఆర్థిక పరిస్థితి సహకరించని దుస్థితి. దాంతో కూతురు భవిష్యత్‌కోసం తాను మరింత శ్రమించాలని జ్యోతి తల్లి నిర్ణయించుకుంది. ఇళ్లలో పని చేయడంతోపాటు స్థానికంగా ఓ ఆసుపత్రిలో క్లీనర్‌గా డబుల్ షిఫ్ట్ చేసేది. తల్లి కష్టం..తన శ్రమ..వెరసి జ్యోతి ప్రయాణం ఇప్పుడు ఒలింపిక్స్ దాకా చేరింది. 'నా కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. అయినా, పరిస్థితులను తట్టుకొని ముందుకు సాగాల న్నది అమ్మ మాట. పతకం గెలవాలని పోటీలకు ముందు అమ్మ ఎప్పుడూ చెప్పేది కాదు. నీ పనిని నువ్వు చెయ్! ఫలితం ఎలా ఉన్నా స్వీకరించు' అని అమ్మ వెన్ను తట్టేదని జ్యోతి తెలిపింది. తన ఉన్నతిలో కోచ్ జేమ్స్ హిలీయర్ పాత్ర కూడా ఎనలేనిదని 100 మీ. హర్డిల్స్‌లో 12.78 సెకన్లతో జాతీయ రికార్డు నెలకొల్పిన జ్యోతి వెల్లడించింది.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

సాత్విక్ జోడీ కొట్టాలి పసిడి!

● డార్క్‌హార్స్‌గా లక్ష్యసేన్

● హ్యాట్రిక్ పతక వేటలో సింధు





గత మూడు ఒలింపిక్స్‌లో భారత్‌కు పతకాలను అందిస్తున్న విభాగం బ్యాడ్మింటన్. లండన్ క్రీడల్లో సైనా నెహ్వాల్ కాంస్యం అందుకోగా.. 'రియో'లో రజతంతో మెరిసిన పీవీ సింధు.. టోక్యోలో కంచు మోత మోగించింది. ఈసారి పారిస్ క్రీడల్లో డబుల్స్ టాప్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టిపై భారీ అంచనాలున్నాయి. ఇక, సింధు హ్యాట్రిక్ పతకంతో మెరవాలనుకుంటోంది.

ఒలింపిక్స్ బ్యాడ్మింటన్‌లో భారత్ ఇప్పటి వరకు మూడు పతకాలు సాధించింది. గత రెండు ఈవెంట్లలో సింధు రజతకాంస్యాలు దక్కించుకోగా.. 2012లో సైనా ఈ విభాగంలో తొలి పతకం అందించి చరిత్ర సృష్టించింది. ఈ క్రమంలో గత మూడు మెగా ఈవెంట్లలో పతకాలనందిస్తున్న మన షట్లర్లు.. ఇదే ఒరవడిని కొనసాగించాలని అభిమానులు కోరుకొంటున్నారు. పారిస్ క్రీడల్లో సింధు, హెచ్‌ఎస్ ప్రణయ్, లక్ష్యసేన్ సింగిల్స్‌లో బరిలోకి దిగనుండగా.. డబుల్స్‌లో సాత్విక్-చిరాగ్, అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో జోడీలు ఆడనున్నాయి.

అద్భుతాలు జరిగితేనే..

కామన్వెల్త్ క్రీడల్లో గాయపడిన సింధు.. ఆ తర్వాత రీఎంట్రీ ఇచ్చినా ఫామ్‌ను అందిపుచ్చుకోలేకపోయింది. ఒలింపిక్స్‌కు అర్హత సాధించినా.. గత కొంత కాలంగా ఆడుతున్న ప్రముఖ ఈవెంట్లలో ఒక్కటి కూడా నెగ్గలేదు. ఇక, పురుషుల సింగిల్స్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్, లక్ష్యసేన్ బరిలో ఉన్నారు. ఇటీవలి కాలంలో వీరి ప్రదర్శన కూడా చెప్పుకోదగ్గ స్థాయిలో లేదు. అయితే, తమదైన రోజు ఎంతటి గొప్ప ఆటగాడికైనా ఓటమి రుచిచూపగల సత్తా వీరికి ఉంది. వీరిలో లక్ష్యసేన్‌ను డార్క్‌హార్స్‌గా నిపుణులు పరిగణిస్తున్నారు. మహిళల డబుల్స్‌లో అశ్విని జంట చివరి నిమిషంలో ఒలింపిక్ బెర్త్‌ను ఖరారు చేసుకొంది. క్రాస్టోతో కలసి అశ్విని ఈ మధ్య కాలంలోనే ఆడడం ఆరంభించగా.. ఒక్క మేజర్ టోర్నీ కూడా గెలిచిన సందర్భాలు లేవు.







ఎంతో తేడా...

బ్యాడ్మింటన్‌లో ఏదైనా పతక ఆశలు ఉన్నాయంటే.. అది పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్-చిరాగ్ నుంచే. టోక్యో ఒలింపిక్స్‌లో సాత్విక్ ద్వయం గ్రూప్ దశలోనే నిష్క్రమించింది. అయితే, ఆ తర్వాతి నుంచి వారి కెరీర్ టాప్ గేర్‌లో దూసుకుపోయింది. 2022లో భారత్ తొలిసారి ప్రతిష్ఠాత్మక థామస్ కప్ గెలవడంలో సాయిరాజ్ జోడీ కీలకపాత్ర పోషించింది. కామన్వెల్త్ క్రీడల్లో స్వర్ణం, ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకంతో సాత్విక్, చిరాగ్ ప్రకంపనలు సృష్టించారు. ఫ్రెంచ్ ఓపెన్‌తో తొలి సూపర్-750 సిరీస్ టైటిల్‌ను సొంతం చేసుకొన్న సాత్విక్ జంట.. స్విస్ ఓపెన్, ఆసియా చాంపియన్‌సిష్‌లో కూడా సత్తాచాటింది. ఈ క్రమంలో ప్రతిష్ఠాత్మకమైన ఇండోనేసియా ఓపెన్ సూపర్-1000 సిరీస్ నెగ్గిన సాయిరాజ్-షెట్టి ద్వయం.. వరల్డ్ నెంబర్‌వన్ ర్యాంక్‌ను దక్కించుకొన్న భారత తొలి డబుల్స్ జోడీగా రికార్డులకెక్కింది. ఈ ఏడాది కూడా అదే జోరును కొనసాగిస్తూ నాలుగు టోర్నీల్లో ఫైనల్ చేరింది. మిగతా ఆటగాళ్లపై అంతంతమాత్రమే అంచనాలున్న నేపథ్యంలో.. పతక భారం మొత్తం సాత్విక్-చిరాగ్ జోడీపైనే.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

నాన్న కోసం..



జ్యోతికశ్రీ

మరో తెలుగు అథ్లెట్ 23 ఏళ్ల జ్యోతిక శ్రీ దండి కూడా ఒలింపిక్స్‌లో పోటీపడుతోంది. మహిళల 4-400 మీ. రిలే జట్టులో బరిలో దిగుతున్న జ్యోతిక శ్రీ చదువులో టాపర్. తణుకులో పదో తరగతి చదివిన ఆమె..97 శాతం మార్కులు సాధించింది. డాక్టర్ కావాలన్నది ఆమె చిన్ననాటి కల. కానీ జ్యోతిక శ్రీ తండ్రి శ్రీనివాసరావు బాడీ బిల్డర్. కుమార్తెను క్రీడాకారిణిని చేయాలని..ఆమె ఒలింపిక్స్‌లో ఆడితే చూడాలన్నది అతడి స్వప్నం. దాంతో తండ్రి ఆకాంక్షకు అనుగుణంగా అథ్లెటిక్స్ ఎంచుకున్న ఆమె..అతడి కలను నిజం చేస్తూ విశ్వక్రీడలకూ ఎంపికైంది. దాంతో శ్రీనివాసరావు ఆనందం అంతా ఇంతా..కాదు!

హాకీ సౌత్‌జోన్ విజేత ఆంధ్ర

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): సౌత్‌జోన్ జూనియర్ హాకీ టోర్నీలో ఆంధ్రప్రదేశ్ అమ్మాయిల జట్టు విజేతగా నిలిచింది. కాగా ఏపీ బాలుర జట్టు మూడో స్థానం దక్కించుకుంది. బుధవారం పులివెందులలో జరిగిన అమ్మాయిల ఫైనల్లో ఏపీ 5-0తో కర్ణాటకను ఓడించింది. బాలుర మూడో స్థానం పోరులో ఏపీ 5-0తో తెలంగాణపై నెగ్గింది.



జైస్వాల్ @ 6

దుబాయ్: జింబాబ్వేతో సిరీస్‌లో అదరగొట్టిన యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ కెరీర్ బెస్ట్ ఆరో ర్యాంక్‌ను సొంతం చేసుకొన్నాడు. బుధవారం విడుదల చేసిన ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్ జాబితాలో జైస్వాల్ 4 స్థానాలు ఎగబాకి ఆరో ర్యాంక్‌లో నిలిచాడు. గిల్ 36 స్థానాలు మెరుగుపరచుకొని 37వ ర్యాంక్ దక్కించుకొన్నాడు. సూర్యకుమార్ 2వ ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు. రుతురాజ్ 6 నుంచి 8వ ర్యాంక్‌కు పడిపోయాడు. బౌలింగ్ విభాగంలో అక్షర్ పటేల్ 13వ, ముకేష్ 46వ, వాషింగ్టన్ 73వ స్థానాల్లో ఉన్నారు. ఆల్‌రౌండర్లలో హార్దిక్ పాండ్యా 6వ ర్యాంక్‌లో నిలిచాడు.



హైదరాబాద్ జీసీసీ సెంటర్ విస్తరణ కోసం
రూ.3,600 కోట్ల పెట్టుబడులు
సనోఫీ హెల్త్‌కేర్ ఇండియా వెల్లడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సనోఫీ హెల్త్‌కేర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్‌లోని తమ గ్లోబల్ కెపాసిటీ సెంటర్ (జీసీసీ) విస్తరణ కోసం వచ్చే ఆరు సంవత్సరాల్లో 40 కోట్ల యూరోల (రూ.3,600 కోట్లు) పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించింది. బుధవారం నాడిక్కడ సనోఫీ హైదరాబాద్ హబ్‌ను తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డీ శ్రీధర్ బాబు, సనోఫీ బిజినెస్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ మెడెలిన్ రోష్ ప్రారంభించారు. అనంతరం మెడెలిన్ రోష్ విలేకరులతో మాట్లాడుతూ.. వచ్చే రెండేళ్ల కాలంలో జీసీసీని 2,600 మంది ఉద్యోగులు పని చేసేందుకు సౌకర్యవంతంగా ఉండేలా విస్తరించనున్నట్టు చెప్పారు. సనోఫీకి గల నాలుగు గ్లోబల్ హబ్‌లలో ఇదే అతి పెద్ద కేంద్రం అవుతుందని ఆమె అన్నారు. ప్రస్తుతం ఈ కేంద్రంలో 1,000 మంది పని చేస్తున్నట్టు ఆమె చెప్పారు. ఈ స్థాయి కేంద్రాన్ని నిర్వహించేందుకు వీలుగా ప్రతిభావంతులను నియమించుకోవడం, కొత్త సామర్థ్యాలు సమకూర్చుకోవడం, ఇతరత్రా అంశాలపై పెట్టుబడులు పెట్టనున్నట్లు చెప్పారు. 2019లో ప్రారంభమైన హైదరాబాద్ కేంద్రం ఒక మెడికల్ హబ్ స్థాయి నుంచి అత్యుత్తమ సేవలందించే ప్రపంచ కేంద్రంగా మారిందని చెప్పారు. ఈ కేంద్రంలో పని చేస్తున్న వారిలో 50 శాతం మంది ఫార్మా సైన్సెస్‌లో డాక్టరేట్లు, మాస్టర్స్ డిగ్రీ హోల్డర్లేనని, 20 శాతం మంది టెక్నాలజీ నిపుణులని చెప్పారు. ఈ కేంద్రంలో రోగ నిర్ధారణ నుంచి చికిత్స వరకు అన్నీ కృత్రిమ మేధ(ఏఐ) సహాయంతో చేస్తున్నట్టు కంపెనీ చీఫ్ డిజిటల్ ఆఫీసర్ ఎస్తాబ్ ఇమ్మాన్యుయేల్ ఫ్రెనెహర్డ్ తెలిపారు.

తెలంగాణ ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యం పెంపు

విభోర్ స్టీల్ ట్యూబ్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): విభోర్ స్టీల్ ట్యూబ్స్ లిమిటెడ్ (వీఎస్‌టీఎల్).. తెలంగాణలోని తన ప్లాంట్ తయారీ సామర్థ్యాన్ని రెట్టింపు చేసింది. మహబూబ్ నగర్ జిల్లా బాలానగర్‌లో ఉన్న ఈ ప్లాంట్ తయారీ సామర్థ్యం ప్రస్తుతం 24,000 టన్నులుండగా దాన్ని 48,000 టన్నులకు పెంచినట్టు తెలిపింది. క్రాష్ బారియెర్స్ ఉత్పత్తిని పెంచడం కోసం ఈ ప్లాంట్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన గాల్వనైజింగ్ ఐరన్ (జీఐ) యూనిట్‌ను కంపెనీ ప్రారంభించింది. ఈ ప్లాంట్ ఏర్పాటుకు రూ.2 కోట్ల పెట్టుబడులు పెట్టినట్లు కంపెనీ తెలిపింది. హరియాణా కేంద్రంగా ఉన్న వీఎస్‌టీఎల్‌కు తెలంగాణతో పాటు మహారాష్ట్రలోని రాయగఢ్‌లో మరో ప్లాంట్ కూడా ఉంది.

చిన్న షేరు.. భారీ లాభం



ఈ ఏడాదిలో బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 30% అప్

27 శాతం పెరిగిన స్మాల్‌క్యాప్ ఇండెక్స్

న్యూఢిల్లీ: స్టాక్ మార్కెట్లో బడా కంపెనీలతో పోలిస్తే చిన్న, మధ్య స్థాయి షేర్లే మదుపరులకు అధిక ప్రతిఫలాలు అందించాయి. దేశీయంగా ఆశాజనక ఆర్థికాంశాలతో పాటు ద్రవ్య ప్రవాహం పెరగడం ఇందుకు దోహదపడ్డాయి. ఈ ఏడాదిలో ఇప్పటివరకు (జూలై 16 నాటికి) బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 10,984.72 పాయింట్లు లేదా 29.81 శాతం వృద్ధి చెందగా.. స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 11,628.13 పాయింట్లు లేదా 27.24 శాతం పుంజుకుంది. ఇదే సమయంలో బీఎస్ఈ ప్రామాణిక సూచీ సెన్సెక్స్ 30 మాత్రం 8,476.29 పాయింట్లు లేదా 11.73 శాతం పెరిగింది. "సెన్సెక్స్ లిస్టెడ్ కంపెనీలతో పోలిస్తే మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ స్టాక్స్ మెరుగైన పనితీరు కనబర్చడానికి వీటిలోకి దేశీయంగా ద్రవ్య ప్రవాహం పెరగడమే ప్రధాన కారణం. మ్యూచువల్ ఫండ్స్, పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సర్వీసెస్ (పీఎంఎస్)తో పాటు ప్రత్యక్ష పెట్టుబడుల ద్వారా దేశీయ మదుపరుల సొమ్ము భారీగా వీటిలోకి వచ్చి చేరుతోంద"ని స్వస్తిక ఇన్వెస్ట్‌మార్ట్ లిమిటెడ్ ఎండీ సునీల్ న్యాతి అన్నారు.

ప్రస్తుతం మార్కెట్లో దీర్ఘకాలిక బుల్ ర్యాలీ కొనసాగుతోందని, ఈ సమయంలో చిన్న, మధ్య స్థాయి కంపెనీలు బ్లూచిప్‌లకు మించిన పనితీరు కనబరుస్తుంటాయని పేర్కొన్నారు. లార్జ్‌క్యాప్ షేర్లూ మంచి పనితీరు కనబర్చినప్పటికీ, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల (ఎఫ్ఐఐ) అమ్మకాల కారణంగా స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్‌ల కంటే వెనకబడ్డాయన్నారు. మార్కెట్లో చాలావరకు కంపెనీలు, ముఖ్యంగా చిన్న, మధ్య స్థాయి విభాగ షేర్లు ఇప్పటికే అధిక ధరల వద్ద ట్రేడవుతున్నాయన్న ఆందోళనలున్నాయి. అయినప్పటికీ లార్జ్‌క్యాప్ షేర్లు మరింత పుంజుకునే అవకాశాలున్నాయి. ఈ ఏడాది ప్రథమార్ధంలో భారీగా అమ్మకాలకు పాల్పడిన ఎఫ్ఐఐలు కూడా మళ్లీ కొనుగోళ్లు పెంచారని న్యాతి పేర్కొన్నారు.

దిద్దుబాటుకు చాన్స్

ఈ నెల 16న బీఎస్ఈ సెన్సెక్స్ 80,898.3 పాయింట్ల వద్ద, మిడ్‌క్యాప్ సూచీ 48,175.21 పాయింట్ల వద్ద సరికొత్త జీవితకాల గరిష్ఠాన్ని నమోదు చేశాయి. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ ఇండెక్స్ ఈ నెల 8న 54,617.75 వద్ద ఆల్‌టైం గరిష్ఠాన్ని రికార్డు చేసింది. దేశీయ ఆర్థిక వ్యవస్థ వేగంగా వృద్ధి చెందుతున్నందున చిన్న, మధ్య స్థాయి కంపెనీలు భవిష్యత్‌లో మరింత వృద్ధి చెందడానికి అవకాశాలుండటంతో ఈ విభాగ షేర్లకు గిరాకీ పెరిగిందని మాస్టర్ క్యాపిటల్ సర్వీసెస్ లిమిటెడ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అర్విందర్ సింగ్ నంద అన్నారు. సాధారణంగా మిడ్‌క్యాప్ సూచీలోని కంపెనీల షేర్ల మార్కెట్ విలువ బ్లూచిప్‌ల మార్కెట్ క్యాప్‌లో ఐదో వంతు ఉంటుంది. పదో వంతు విలువైన కంపెనీల షేర్లు స్మాల్‌క్యాప్ సూచీలో ఉంటాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ విభాగంలో కొంత బుడగ ఏర్పడిందని, దిద్దుబాటుకు అవకాశాలున్నాయని అభిప్రాయపడ్డారు. అయితే, మార్కెట్లోకి ద్రవ్య ప్రవాహం నిరాటంకంగా కొనసాగుతున్న నేపథ్యంలో కరెక్షన్ ఎప్పుడు చోటు చేసుకోవచ్చన్నది చెప్పడం సవాలేనని అన్నారు. విధానపరమైన మార్పులు లేదా కంపెనీల పనితీరు నిరాశాజనకంగా ఉంటే తప్ప దిద్దుబాటుకు తక్షణ ప్రేరేపణలేమీ లేవన్నారు.

ఎల్ఐసీ, ఎస్‌బీఐకి కలిసొచ్చిన 'ఇన్‌ఫ్రా'

గడిచిన ఏడాది కాలంలో ప్రభుత్వ రంగ దిగ్గజాలైన ఎల్ఐసీ, ఎస్‌బీఐ షేర్లు తమ ప్రత్యర్థి కంపెనీల కంటే మెరుగైన పనితీరు కనబర్చాయి. మౌలిక సదుపాయాలు సహా భారత భవిష్యత్ వృద్ధికి దోహదపడే రంగాలపై దృష్టి సారించడం ఈ రెండు కంపెనీలకు కలిసివచ్చింది. ఎల్ఐసీ ఇన్‌ఫ్రా సహా ఇతర వృద్ధి కారక రంగాల్లో పెట్టుబడులు పెట్టగా.. ప్రైవేట్ రంగానికి చెందిన హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ మాత్రం టెక్నాలజీ, కన్స్యూమర్, బీఎఫ్ఎస్ఐ రంగాలపై దృష్టిసారించాయి. 2023 జూలై 18న రూ.620 స్థాయిలో ఉన్న ఎల్ఐసీ షేరు గడిచిన ఏడాది కాలంలో 79 శాతం వృద్ధి చెంది 2024 జూలై 16న రూ.1,109.15 వద్ద ముగిసింది. కాగా, ఇదే కాలానికి హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ షేరు రుణాత్మక వృద్ధిని నమోదు చేయగా.. ఐసీఐసీఐ ప్రు లైఫ్ 12 శాతం వృద్ధిని కనబర్చింది. ఎస్‌బీఐ లైఫ్ షేరు 23 శాతం పెరిగింది. ఇక ఎస్‌బీఐ విషయానికొస్తే, గడిచిన ఏడాది కాలంలో బ్యాంక్ షేరు రూ.592 నుంచి రూ.880.95కు చేరుకుంది. అంటే, 48 శాతం వృద్ధిని కనబరిచింది. ఇదే సమయంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కోటక్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు మైనస్ 3 శాతం నుంచి 24 శాతం శ్రేణిలో వృద్ధి చెందాయి.

బిజినెస్

కోల్డ్ ఫ్యూజన్ టెక్నాలజీతో
స్వచ్ఛ ఇంధనం ఉత్పత్తి
హైదరాబాద్ స్టార్టప్ హైలెనర్ ఆవిష్కరణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన స్టార్టప్ హైలెనర్.. కోల్డ్ ఫ్యూజన్ టెక్నాలజీ ఉపయోగించి స్వచ్ఛ ఇంధనం ఉత్పత్తి చేసే ప్రక్రియను బుధవారం ప్రదర్శించింది. టీ హబ్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఈ టెక్నాలజీ ద్వారా 100 వాట్స్ విద్యుత్‌ను డివైస్‌లోకి పంపడం ద్వారా 150 వాట్స్‌తో సమానమైన విద్యుత్‌ను ఉత్పత్తి చేసింది. దీన్ని సమర్థవంతంగా వినియోగంలోకి తెచ్చినట్టయితే శిలాజ ఇంధనాలపై ఆధారనీయత తగ్గించుకోవచ్చని హైలెనర్ సీఈఓ సిద్ధార్థ దొరైరాజన్ తెలిపారు. ఈ టెక్నాలజీని మరింత మెరుగుపరచడం ద్వారా అదనంగా ఉత్పత్తి అయ్యే వేడిని రెండున్నర రెట్ల మేరకు పెంచవచ్చని దొరైరాజన్ చెప్పారు. అధిక వేడి అవసరం అయ్యే విభిన్న రంగాల్లో ఈ టెక్నాలజీని వినియోగించి తక్కువ విద్యుత్‌తో గరిష్ఠ వేడిని పొందవచ్చన్నారు. తమ లో ఎనర్జీ అణు రియాక్టర్ (లెనర్) టెక్నాలజీకి కేంద్రం నుంచి పేటెంట్ కూడా లభించినట్టు ఆయన తెలిపారు.

విమ్టా ల్యాబ్స్ ఆదాయం 82 కోట్లు


హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): విమ్టా ల్యాబ్స్.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో రూ.82.4 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.12.3 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆదాయం రూ.84.1 కోట్లుగా ఉండగా లాభం రూ.12.2 కోట్లుగా ఉంది. సమీక్షా కాలంలో అమ్మకాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో నిలకడైన పనితీరును కనబరిచినట్లు కంపెనీ ఎండీ హరిత వాసిరెడ్డి తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయ త్రైమాసికంలోనే కొత్త లైఫ్ సైన్సెస్ ప్లాంట్ విస్తరణ పనులు పూర్తికానున్నాయని పేర్కొన్నారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	75,000 ▲	68,750 ▲	100,500 ▲
ముంబై	73,339 ▲	67,179 ▲	92,014 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



18వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	555
వరంగల్	542	గోదావరి	555
చిత్తూరు	573	విశాఖపట్నం	575
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	105	విజయవాడ	112
వరంగల్	105	గుంటూరు	113
కరీంనగర్	105	ఒంగోలు	113
మహబూబ్‌నగర్	105	చిత్తూరు	119
కర్నూలు	105	నెల్లూరు	119
విశాఖపట్నం	104	అనంతపురం	112
గోదావరి	112		

ఆర్థిక సేవల రంగంలో 18 లక్షల ఉద్యోగాలు ఖాళీ

అహ్మదాబాద్: దేశీయ ఆర్థిక సేవల రంగం ఉద్యోగుల కొరత సమస్యను ఎదుర్కొంటోందని ఫైనాన్షియల్ ప్లానింగ్ స్టాండర్డ్స్ బోర్డ్ (ఎఫ్‌పీఎస్‌బీ) ఇండియా సీఈఓ క్రిషన్ మిశ్రా అన్నారు. సరైన అభ్యర్థులు లభించక గత ఏడాది దాదాపు 18 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. "కేంద్ర ప్రభుత్వానికి చెందిన నేషనల్ కెరీర్ సర్వీస్ పోర్టల్ డేటా ప్రకారం.. గత ఏడాది ఆర్థిక సేవల రంగంలో కొత్తగా 46.86 లక్షల ఉద్యోగాలు సృష్టించబడగా.. అందులో 27.5 లక్షల ఉద్యోగాలు మాత్రమే భర్తీ అయ్యాయి. దీన్ని బట్టి చూస్తే, 18 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. ఈ ఉద్యోగాలు చేపట్టేందుకు సరైన అర్హత కలిగిన వారు లభించకపోవడమే ఇందుకు కారణ"మని పేర్కొన్నారు.

రియల్టీలోకి పీఈ పెట్టుబడులు
రూ. 25,000 కోట్లు
నైట్‌ఫ్రాంక్ ఇండియా వెల్లడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఈ ఏడాది ప్రథమార్ధంలో రియల్ ఎస్టేట్ రంగంలోకి ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) పెట్టుబడులు 15 శాతం వృద్ధి చెంది 300 కోట్ల డాలర్లుగా (రూ.25,200 కోట్లు) నమోదయ్యాయి. ప్రధానంగా వేర్‌హౌసింగ్ రంగంలోకి పెట్టుబడులు వెల్లువెత్తడం ఈ వృద్ధికి దోహదపడింది. ప్రాపర్టీ కన్సల్టెన్సీ నైట్ ఫ్రాంక్ ఇండియా తాజా నివేదికలో ఈ విషయం వెల్లడించింది. మొత్తం పీఈ పెట్టుబడుల్లో 52 శాతం వాటాతో వేర్‌హౌసింగ్ రంగం అగ్రగామిగా ఉండగా రెసిడెన్షియల్ విభాగం 29 శాతం, ఆఫీస్ విభాగం 20 శాతం వాటా సాధించాయి. 2018 నుంచి పీఈ పెట్టుబడుల ఆకర్షణలో వేర్‌హౌసింగ్ రంగం అగ్రస్థానంలో నిలుస్తూ వస్తోంది. ఆఫీస్, రిటైల్, రెసిడెన్షియల్ రంగాలు మూడూ ఉమ్మడిగా ఆకర్షించిన పెట్టుబడులకు సమానంగా పెట్టుబడులు ఆకర్షించింది.

హైదరాబాద్ రియల్టీలోకి రూ.3,000 కోట్లు: ఇదిలా ఉండగా హైదరాబాద్ రియల్టీ రంగంలోకి పీఈ పెట్టుబడులు ఈ ఏడాది ప్రథమార్ధంలో 12 శాతం పెరిగి 35.7 కోట్ల డాలర్లకు (రూ.2,998 కోట్లు) చేరాయి. అందులో కూడా 74 శాతం పెట్టుబడులు అంటే 26.5 కోట్ల డాలర్లు (రూ2,226 కోట్లు) ఆఫీస్ విభాగంలోకి రాగా మిగతా 9.2 కోట్ల డాలర్లు (రూ.772 కోట్లు) రెసిడెన్షియల్ రంగంలోకి వచ్చాయి.

ఎల్‌టీఐమైండ్‌ట్రీ లాభం రూ.1,135 కోట్లు

ముంబై: ఐటీ సర్వీసెస్ సంస్థ ఎల్‌టీఐమైండ్‌ట్రీ.. జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికంలో రూ.1,135 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంతో లాభం 1.5 శాతం తగ్గింది. కాగా త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం మాత్రం 5.1 శాతం వృద్ధి చెంది రూ.9,142.60 కోట్లకు చేరుకుందని కంపెనీ ఎండీ, సీఈఓ దేబాశిష్ ఛటర్జీ తెలిపారు. ఈ కాలంలో వీసా చార్జీలు, రవాణా వ్యయాలు ఎక్కువగా ఉండటం పనితీరును దెబ్బతీసిందని పేర్కొన్నారు. అయితే రానున్న త్రైమాసికాల్లో నిర్వహణాపరంగా పనితీరును మెరుగుపరుచుకోవటంపై ప్రధానంగా దృష్టి పెట్టనున్నట్లు ఆయన తెలిపారు. జూన్ త్రైమాసికంలో కొత్తగా 140 కోట్ల డాలర్ల డీల్స్‌ను కుదుర్చుకున్నట్లు ఛటర్జీ వెల్లడించారు.

1.400 మంది ఫ్రెషర్ల నియామకం: జూన్ త్రైమాసికంలో 1,400 మంది ఫ్రెషర్లను చేర్చుకున్నట్లు దేబాశిష్ ఛటర్జీ తెలిపారు. ఫ్రెషర్స్‌కు ఇచ్చిన మాటకు కట్టుబడి ఈ నియామకాలు చేసినట్లు ఆయన తెలిపారు. కాగా గడచిన ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన త్రైమాసికంతో పోల్చితే మొత్తం ఉద్యోగుల సంఖ్య 81,650 నుంచి 81,934కు పెరిగిందని, అయితే గత ఏడాది ఇదే కాలం (82,738)తో పోలిస్తే మాత్రం తగ్గిందని చెప్పారు.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 18-7-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 | సంచిక (Issue) : 93

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

హైదరాబాద్ సిటీ *

గడ్చిరోలిలో ఎన్‌కౌంటర్.. 12 మంది మావోయిస్టుల మృతి

మృతుల్లో తిప్పగడ్డ దళం ఇన్‌చార్జి ఆత్రం లక్ష్మణ్

ఏకే-47, ఎల్ఎంజీ తుపాకుల సీజ్

ఒక ఎస్సై, మరో జవానుకు తూటా గాయాలు

వారోత్సవాల ముందు నక్సల్స్‌కు భారీ ఎదురుదెబ్బ

ఈ ఏడాది ఇది పదో ఎన్‌కౌంటర్

ఏడు నెలల్లో 148 మంది నక్సల్స్ మృతి

10



కాల్పుల్లో గాయపడ్డ జవానును తరలిస్తున్న దృశ్యం

పండగలా మాఫీ

నేటి సాయంత్రంలోగా రైతుల ఖాతాల్లోకి రూ.7,000 కోట్లు

ప్రతి రైతుకూ రుణ విముక్తి.. గ్రామాల్లో సంబరాలు చేయండి: సీఎం రేవంత్

తొలి విడతలో నేడు రూ.లక్ష దాకా మాఫీ

నెలాఖరులోగా రూ.లక్షన్నర.. ఆగస్టులో 2లక్షల వరకు రుణాలన్నింటినీ మాఫీ చేసి తీరుతాం

కేసీఆర్‌లా మేము మభ్య పెట్టడం లేదు

రైతు రుణమాఫీపై రాహుల్ మాట ఇచ్చారు

ఆ హామీ నిలబెట్టుకున్నామని గొప్పగా చాటండి

దీనిపై జాతీయ స్థాయిలో చర్చ జరగాలి

పార్లమెంట్ భేటీల్లో ఎంపీలూ ప్రస్తావించాలి

కాంగ్రెస్ ముఖ్య నేతలకు సీఎం రేవంత్ నిర్దేశం

రేషన్ కార్డు లేనివారికీ మాఫీ వర్తింపు: భట్టి



ప్రజాభవన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

రుణమాఫీకి ఎన్‌సీడీసీ రుణం?

రూ.5 వేల కోట్ల కోసం సర్కారు ప్రయత్నాలు

షాతో సీఎం సంప్రదింపులు

ఈ సొమ్ము 'సహకార' మాఫీకి

11

హైదరాబాద్, జూలై 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి రైతునూ రుణ విముక్తుడిని చేయాలన్న లక్ష్యంతో రూ.2లక్షల మేర రుణాలను ఒకేసారి మాఫీ చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందని, కేసీఆర్ లాగా మాటలు చెప్పి రైతులను తాము మభ్యపెట్టడం లేదన్నారు. లక్ష రూపాయల మేర రైతు రుణాలను గురువారం సాయంత్రం 4గంటలకల్లా మాఫీ చేయనున్నట్లు వెల్లడించారు. రైతుల ఖాతాల్లోకి రూ.7వేల కోట్లను నేరుగా జమ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ నెలాఖరులోగా రూ.లక్షన్నర మేర రుణాలు, ఆగస్టులో రూ.2లక్షల మేరకు రుణాలను మాఫీ చేసి.. రైతు రుణ మాఫీ ప్రక్రియ పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. తన జీవితంలో ఇది ఎప్పటికీ గుర్తుండిపోయే రోజు అని పేర్కొన్నారు. గ్రామ, మండల, నియోజకవర్గాల స్థాయిల్లో ఎక్కడికక్కడ పండగ వాతావరణంలో గురువారం సంబరాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రజాభవన్‌లో బుధవారం

మిగతా 11వ పేజీలో...

11.42 లక్షల మంది ఖాతాల్లోకి నగదు

'ఈ-కుబేర్'తో రూ.7 వేల కోట్లు జమ

20 మంది రైతులకు సీఎం చేతుల మీదుగా చెక్కుల పంపిణీ

11

నేటి ఉదయం బ్యాంకర్లతో రేవంత్ భేటీ



కొత్తగూడెం జిల్లాలోని తాలిపేరు ప్రాజెక్టు నుంచి దిగువకు గోదావరి ఉరకలు

జూరాలకు బిరబిరా కృష్ణమ్మ..

ఆల్మట్టికి భారీగా వరద.. నారాయణపూర్ నుంచి 62,955 క్యూసెక్కుల విడుదల

శ్రీశైలానికి 3,585, సాగర్‌కు 21,481 క్యూసెక్కులు.. గోదావరికి కొనసాగుతున్న వరద

భద్రాచలంలో పెరుగుతున్న నీటిమట్టం.. రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల వర్షాలు

ఇందూరు, ములుగు జిల్లాల్లో భారీగా.. నవీపేటలో 15.4, వెంకటాపురంలో 10.7 సెం.మీ

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

కృష్ణా బేసిన్‌లో ఎగువన కురుస్తున్న వర్షాలతో కర్ణాటకలోని కీలక ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాలు నిండుకుండలా మారాయి. ఆల్మట్టి గేట్లను మంగళవారమే తెరవగా.. బుధవారం నారాయణపూర్ గేట్లను తెరిచారు. ఆ ప్రాజెక్టు నుంచి సాయంత్రం 62,955 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. దీంతో గద్వాల జిల్లాలోని జూరాల వైపు కృష్ణమ్మ పరుగులు పెడుతోంది. జూరాలకు గురువారం సాయంత్రం వరకు వరద చేరే అవకాశముందని ఆ ప్రాజెక్టు అధికారులు తెలిపారు. జూరాలకు 2,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. 7,500 క్యూసెక్కులు దిగువకు విడిచి జల విద్యుదుత్పత్తిని ప్రారంభించారు. ప్రధాన ప్రాజెక్టు ఆల్మట్టికి 92,736 క్యూసెక్కుల వరద కొనసాగుతోంది. పూర్తి సామర్థ్యం 129 టీఎంసీలకు ఇప్పటికే నిల్వ 100 టీఎంసీలు దాటింది. దీంతో దిగువకు 65 వేల క్యూసెక్కులు వదులుతున్నారు. నారాయణపూర్ జలాశయం పూర్తి సామర్థ్యం 37 టీఎంసీలకు.. నిల్వ ఇప్పటికే 30 టీఎంసీలకు చేరింది. కృష్ణానదికి ఉపనది తుంగభద్రకు వరద కొనసాగుతోంది. 49,522 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. శ్రీశైలం ప్రాజెక్టుకు 3,585 క్యూసెక్కుల వరద వచ్చింది. దీంతో జల విద్యుదుత్పత్తిని ప్రారంభించి 22,166 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. జలాశయం పూర్తి సామర్థ్యం 215 టీఎంసీలకు ప్రస్తుతం 33.62 టీఎంసీలున్నాయి. నాగార్జునసాగర్‌లో 312 టీఎంసీలకు.. ప్రస్తుతం 122 టీఎంసీలున్నాయి. 21,481 క్యూసెక్కుల

నేడు, రేపు అతి భారీ వర్షాలు

మిగతా 12వ పేజీలో...

1 రేపటి గురువులు



నేటి నుంచి డీఎస్సీ

ఆగస్టు 5 వరకు పరీక్షలు

12

మొత్తం పోస్టులు 11,062

2.70 లక్షల మంది అభ్యర్థులు

1 బతుకులు మసి



వెంకటేశ్వర్లు



విద్యాసాగర్

సింగరేణిలో ఇద్దరు కార్మికుల సజీవ సమాధి

మరమ్మతు చేస్తుండగా కూలిన మట్టి

మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

9

రామగుండం-3 డివిజన్ ఓసీపీ-2లో ఘటన.. కిషన్‌రెడ్డి విచారం

1 మత్తు వదిలిస్తారు

డ్రగ్స్ కట్టడికి గట్టి నిఘా!

11

టాస్క్‌ఫోర్స్ తరహాలో యాంటీ డ్రగ్స్ కంట్రోల్ టీంలు

వరంగల్‌లో ప్రయోగాత్మకంగా..

బ్లాక్ స్పాట్‌లుగా గంజాయి, డ్రగ్స్ వినియోగ ప్రదేశాలు

2600 ఉద్యోగాలకు 25 వేలమంది

కొలువు వేటలో తొక్కిసలాట!

10

ముంబై విమానాశ్రయం వద్ద ఘటన

నిరుద్యోగం రికార్డులు బద్దలు: ప్రియాంక

స్థానిక కోటాపై వెనక్కి!

కన్నడిగులకు రిజర్వేషన్లపై భారీ రగడ

కర్ణాటక పారిశ్రామిక వర్గాల్లో కలకలం

ఐటీ కంపెనీలకు భారీ నష్టమని నిపుణుల ఆందోళన

రాజ్యాంగ వ్యతిరేక బిల్లు: పాయ్

ఐటీ కంపెనీలను బెదిరించేలా ఉంది: అసోచామ్

కంపెనీలు తరలివెళ్లే ముప్పు: నాస్కామ్

నిపుణులతో చర్చిస్తాం: మంత్రి పాటిల్

బిల్లుపై నిర్ణయం తాత్కాలికంగా వాయిదా.. సీఎం సిద్దరామయ్య ట్వీట్



బెంగళూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని ప్రైవేట్ సంస్థల్లో స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న నిర్ణయంపై ఆ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కు తగ్గింది. పారిశ్రామిక వర్గాలు, దిగ్గజ టెక్ సంస్థల నుంచి భారీ వ్యతిరేకత రావడంతో బిల్లును తాత్కాలికంగా నిలిపివేసింది. ప్రైవేట్ సంస్థల్లో స్థానికులకు రిజర్వేషన్లు కల్పిస్తూ క్యాబినెట్‌లో చేసిన తీర్మానాన్ని తాత్కాలికంగా

మిగతా 10వ పేజీలో...

వైద్యశాఖ బదిలీల్లో మోసం!

బదిలీ తప్పేందుకు ఆఫీస్ బేరర్ల అవతారమెత్తిన ఉద్యోగులు

ఒక్క సంఘం నుంచే ఆఫీస్ బేరర్లుగా 300 మందికి పత్రాలు

ఆ యూనియన్‌కు అసలు గుర్తింపే లేదంటున్న ఉద్యోగులు

అధికార పార్టీ అనుబంధ సంఘం ముసుగులో దందా

రూ.2 కోట్ల మేర వసూళ్లు.. నేటి నుంచి శాఖలో బదిలీలు



హైదరాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖలో గురువారం బదిలీల ప్రక్రియ మొదలు కానున్న నేపథ్యంలో కొందరు ఉద్యోగులు ఉన్నచోటనే కొనసాగేందుకు కొత్త మోసానికి తెరలేపారు. సంఘాల నేతలకు లక్షల్లో ముట్టజెప్పి, ఆ సంఘాల్లో తాము ఆఫీస్ బేరర్లుగా పనిజేస్తున్నట్లు తప్పుడుపత్రాలు తెచ్చుకున్నట్లు ఆరోపణలు

మిగతా 9వ పేజీలో...

ప్రజావాణి ఫిర్యాదులకు ట్రాకింగ్!

ఫిర్యాదు ఏ దశలో ఉందనేది అర్జీదారు తెలుసుకోవచ్చు

11

పరిష్కారం సరిగా లేదని భావిస్తే ఆన్‌లైన్‌లో అప్పీల్‌కు వెళ్లొచ్చు

అవకాశం కల్పించనున్న ప్రభుత్వం.. ప్రక్రియపై అధికారుల కసరత్తు

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

జమ్మూలో ఉగ్రబీభత్సం

జమ్మూలోని దోడాజిల్లాలో సోమవారం రాత్రి ఉగ్రవాదులకు, భద్రతాబలగాలకు మధ్య భీకరమైన ఎదురుకాల్పుల్లో అధికారి సహా నలుగురు జవాన్లు మరణించారు, స్థానికపోలీసులు సైతం పెద్ద సంఖ్యలో గాయపడ్డారు. దెస్సా ప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నట్టుగా తెలిసి, గాలింపు జరుపుతున్నప్పుడు ఒక్కసారిగా భద్రతాబలగాలపై ఈ దాడి జరిగింది. గతవారం పదిమంది జవాన్లు ట్రక్కులో వెడుతూండగా ఉగ్రవాదులు గ్రెనేడ్లతో దాడిచేసి, కొందరిని పొట్టనబెట్టుకున్న విషయం తెలిసిందే. జమ్మూలో అతివేగంగా ఉగ్రవాదం అనేకజిల్లాలకు విస్తరించడం ఆందోళన కలిగిస్తున్న పరిణామం. కొన్నేళ్ళుగా ఉగ్రవాద కార్యకలాపాలు లేని జిల్లాలు సైతం ఇప్పుడు భయంతో వొణికిపోతున్నాయి.

దోడా, రియాసీ, కథువా, పూంచ్, రజౌరీ.. ఇలా జమ్మూలోని పలు జిల్లాల్లో నిత్యం ఎక్కడో అక్కడ ఏదో ఒక స్థాయిలో ఉగ్రదాడులు జరుగుతున్నాయి. ఈ ఏడాదిలో ఇప్పటివరకూ ఉగ్రవాదులకంటే భద్రతా సిబ్బందే నాలుగురెట్లు అధికంగా కన్నుమూశారు. ఉగ్రవాదం జమ్మూ మూలల్లోకి విస్తరించడం, విదేశీ ఉగ్రవాదులను భద్రతాసిబ్బంది నిలువరించలేకపోవడం ఆందోళన కలిగిస్తున్న పరిణామాలు. ఇంటలిజెన్స్ వైఫల్యం వల్లనో, తప్పుడు సమాచారం వల్లనో భద్రతాసిబ్బంది ఉగ్రవాదుల ఉచ్చులోపడి, ప్రాణాలు కోల్పోతున్నారు. గతనెల రియాసీ జిల్లాలో వైష్ణోదేవి బస్సు యాత్రికులను విదేశీ ఉగ్రవాదులు లక్ష్యంగా చేసుకున్నాక, ఇది ఆరంభం మాత్రమేనని, గతకాలపు వాతావరణాన్ని మళ్ళీ పునరుద్ధరిస్తున్నామని లష్కరే తోయిబా ఒక ప్రకటన చేసింది. అనంతరం ప్రధాని అత్యున్నతస్థాయి సమావేశాన్ని నిర్వహించి ఎట్టిపరిస్థితుల్లోనూ ఉగ్రవాదులను ఉపేక్షించవద్దంటూ భద్రతాదళాలకు ప్రత్యేక ఆదేశాలు ఇచ్చారు. ఆర్టికల్ 370 రద్దు తరువాత జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదం తగ్గిపోయిందని బీజేపీ అధినాయకులు చెబుతూంటారు. టెర్రరిజం తగ్గి టూరిజం పెరిగిందని ప్రధానమంత్రి తన ఎన్నికల సభలో సంతోషం వ్యక్తంచేశారు. కశ్మీర్‌లో దశాబ్దాల తరబడి కాంగ్రెస్ చేసిన పాపాలను దాని ప్రత్యేకప్రతిపత్తి రద్దుద్వారా ప్రక్షాళించామని బీజేపీ నాయకులు అంటారు. కానీ, వారంటున్నట్టుగా ఉగ్రవాదం సమసిపోలేదని, పైగా ఎంతో ప్రశాంతంగా ఉండే జమ్మూకు అది ఒక నిర్దిష్టమైన లక్ష్యంతో విస్తరిస్తున్నదని ఈ వరుస ఘటనలు తెలియచెబుతున్నాయి. కొద్దిరోజుల క్రితమే జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్జీ)కు వివిధ అంశాల్లో అపరిమితమైన అధికారాలు కట్టబెడుతూ కేంద్రం ఆదేశాలు జారీచేసింది. తదనుగుణంగా కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం నిబంధనలను సవరించింది. జమ్మూకశ్మీర్‌ను కేంద్రపాలిత ప్రాంతాలుగా నిరవధికంగా కొనసాగించే ఉద్దేశంతోనే మోదీ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని స్థానిక పార్టీలు విమర్శిస్తున్నాయి. ఎల్జీకి మరిన్ని అధికారాలు ఇవ్వడమంటే రాష్ట్రహోదాను మరింత జాప్యం చేయడమేనని వాటి విమర్శ. ఆ రాష్ట్రాన్ని కేంద్రపాలిత ప్రాంతంగా మార్చడమన్న తిరోగామిచర్య వెనుక ఉన్న ప్రకటిత ప్రధాన లక్ష్యం ఉగ్రవాదాన్ని నిర్మూలించడం. ఈ విషయంలో వైఫల్యం స్పష్టంగా ఉన్నందున, అసెంబ్లీ ఎన్నికలలోపుగానే రాష్ట్రహోదాను తిరిగి పునరుద్ధరించి, ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వంతో కేంద్రం కలసినడవాలని స్థానికపార్టీలు డిమాండ్ చేస్తున్నాయి.

గతంలో పాకిస్థాన్‌లోకి చొరబడి మరీ ఉగ్రవాద స్థావరాలను నాశనం చేశామని గొప్పగా చెప్పుకున్నవారు ఇప్పుడు ఏం చేస్తున్నారంటూ రాజకీయ ప్రత్యర్థులు ప్రశ్నిస్తున్నారు. కొన్ని ఘట్టాలను అధికారపక్షం తన రాజకీయప్రయోజనాలకు వాడుకోవడం ఎంత సహజమో, విపక్షం వాటిని ఇటువంటి కష్టకాలంలో గుర్తుచేసి దెప్పిపొడవడమూ అంతే సహజం. రాజకీయాన్ని పక్కనబెడితే, భారతప్రభుత్వం అటు అంతర్జాతీయ వేదికలమీదా, ఇటు క్షేత్రస్థాయిలోనూ పాక్‌ప్రేరేపిత ఉగ్రవాదంమీద యుద్ధంచేయాల్సిన తరుణమిది. సంఘటితంగా పోరాడాల్సిన ఈ సందర్భంలో, కశ్మీర్‌లోని రాజకీయపార్టీలు తమ స్వార్థప్రయోజనాలకోసం ఉగ్రవాదాన్నీ, ఉగ్రవాదులను పెంచిపోషించాయన్న అర్థంలో అక్కడి డీజీపీ చేసిన వ్యాఖ్యలు ప్రమాదకరమైనవి. ఢిల్లీపాలకుల మెప్పుకోసం ఆయన ఆ మాటలన్నారని స్థానిక పార్టీలు మండిపడ్డాయి. ఈ ఆపత్సమయంలో నాయకులు, ప్రజలు సహా ఎవరినీ నొప్పించకుండా, దూరం చేసుకోకుండా అతిజాగ్రత్తగా వ్యవహరించాల్సిన బాధ్యత అక్కడి ఉన్నతాధికారులమీద ఉంది. పాకిస్థాన్ కుట్రలను సాగనివ్వకపోవడమే మన సమష్టికర్తవ్యం కావాలి.

అనైతిక ఫిరాయింపు, అందమైన దబాయింపు!

అరవయ్యేళ్ల కిందట, మూడో సాధారణ ఎన్నికల తరువాత, కాంగ్రెస్ పార్టీ కేంద్ర పార్లమెంటరీ బోర్డు ఒక తీర్మానం ఆమోదించింది. అప్పటికింకా నెహ్రూ బతికే ఉన్నారు. ఆ తీర్మానం ప్రకారం, ఇతర పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీలోకి చేరదలిస్తే, అతను లేదా ఆమె ముందుగా చట్టసభల సభ్యత్వాలకు రాజీనామా చేసి, తిరిగి కాంగ్రెస్ టికెట్ మీద పోటీచేయడానికి సిద్ధపడాలి. ఆ నిర్ణయం అయితే చేశారు కానీ, రాష్ట్రాల కాంగ్రెస్ పెద్దలు ఎవరూ అందుకు ఒప్పుకోలేదు. ఈ తీర్మానం ప్రకారం ఫిరాయింపుదారులు ఒక్కరు కూడా చట్టసభలకు రాజీనామా చేసి తిరిగి పోటీచేయలేదు. ఏదో ఒక మినహాయింపు ఇస్తూ, నిరంతరంగా ఇతర సభ్యులను కాంగ్రెస్ చేర్చుకుంటూనే ఉండింది. దాని మార్గంలోనే ఇతర పార్టీలూ నడుస్తూ వచ్చాయి. కాలక్రమంలో దేశంలో స్థిరపడిన, బలపడిన రాజకీయ సంస్కృతికి శాసనాలతో, విలువలతో నిమిత్తం లేకుండా పోయింది. మన పదజాలంలో ఆపరేషన్ ఆకర్షలు, జంప్ జిలానీలూ భాగమైపోయాయి.

నిజానికి తొలిరోజుల్లో కాంగ్రెస్‌కు తిరుగులేని ఆధిక్యం ఉండేది. మొదటి సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 364 స్థానాలు (మొత్తం సీట్లు 489) వస్తే, రెండో స్థానంలో 41 సంఖ్యతో ఇండిపెండెంట్లు ఉన్నారు. కమ్యూనిస్టు పార్టీ 26 సీట్లతో మూడోస్థానంలో ఉంది. ఇక, ఫిరాయింపుల అవసరం ఇతరులకు ఉంటుంది కానీ, కాంగ్రెస్‌కు ఎందుకు? అయినా, చేరుతూనే ఉండేవారు, చేర్చుకుంటూనే పోయారు. 1967లో జరిగిన నాలుగో ఎన్నికలు కాంగ్రెస్‌కు పెద్దకుదుపు. ప్రతిపక్షాలకు పెద్ద ఊపు. అనేక రాష్ట్రాలలో మిశ్రమ ప్రభుత్వాలు ఏర్పాటయ్యాయి. ఫిరాయింపులు ఇక ఉద్యమంగా మారిపోయాయి. ఇప్పుడు ట్రాఫిక్ రెండువైపులా మొదలయింది. 1967 ఎన్నికలలో రాష్ట్రశాసనసభలకు 3,550 మంది సభ్యులు ఎన్నిక కాగా, వీరిలో 550 మంది తామున్న పార్టీల నుంచి ఫిరాయించారు. కొందరు అనేకమార్లు ఫిరాయించారు కూడా. ఈ కాలంలో కాంగ్రెస్ పార్టీ అనేక రాష్ట్రాలలో ఫిరాయింపుల వల్ల ఇబ్బంది పడినమాట నిజమే కానీ, తిరిగి అదే మార్గం ద్వారా తేరుకున్నది కూడా. ఆ కాలంలోనే ఫిరాయింపులను నియంత్రించడానికి ఏమిచేయాలన్న ఆలోచనలు కూడా మొదలయ్యాయి. మొత్తం మీద ఫిరాయింపుల ద్వారా అత్యధిక లబ్ధిపొందిన సంస్థ కాంగ్రెస్ పార్టీయే అని చెప్పాలి. కానీ, కాంగ్రెస్ పార్టీ తాను అత్యధిక స్థానాలు గెలిచి బలశాలిగా ఉన్న కాలంలోనే, 1985లో ఫిరాయింపుల నిరోధక చట్టం తెచ్చింది. పార్టీ మార్పునకు అనర్హత వేటును, చీలికలకు విలీనాలకు నిర్ణీత శాతాల నియమాన్ని ఆ చట్టమే అమలులోకి తెచ్చింది.

1963లో పార్టీ స్థాయిలో చేసిన నిర్ణయం, ఆ పార్టీలో అమలు కానట్టే, 1985లో రాజ్యాంగస్థాయిలో చేసిన శాసనం కూడా దేశంలో అమలు కావడంలేదనే చెప్పాలి. చట్టానికి దొరకకుండా పనిజరుపుకోవడం ప్రస్తుత వ్యవస్థలో ఒక ఆమోదనీయమైన నైపుణ్యం. బాహాటంగా ఒక పార్టీ సభ్యుడు మరో పార్టీ వేదిక మీద సంచరిస్తాడు. నాయకుడి దగ్గర కండువా కప్పుకుంటాడు. అధికారికంగా రాజీనామా చేయరు. విప్‌లు ఉల్లంఘించరు. పార్టీని తిడుతూనే ఉంటారు. లేదా, రాజీనామా చేస్తారు కానీ, స్పీకర్ ఎంతకూ ఆమోదించరు. నిర్ణయానికి నిరవధిక సమయం తీసుకోగలగడం చట్టసభాపతికి ఉండే విశేషాధికారాలలో ఒకటి. ప్రజాస్వామ్యాన్ని పరిహసించదలచుకుంటే, ఫిరాయింపు ఎమ్మెల్యే మంత్రి అయి, పూర్తికాలం కొనసాగగలడు. ఫిరాయింపులకు వ్యతిరేకంగా రాహుల్‌గాంధీ మాట్లాడడం, ఫిరాయింపు నిరోధక చట్టం తెచ్చిన తన తండ్రి అడుగుజాడలో నడవడం వల్ల కావచ్చు. ఇప్పుడు జాతీయస్థాయిలో కాంగ్రెస్‌లోకి ఇతర పార్టీల వారు వచ్చే పరిస్థితి లేదు. రాష్ట్రాలలో ఆ నైతికతను అమలుజరిపే నిబద్ధతా లేదు.

జాతీయోద్యమం నాటి కాంగ్రెస్‌కు స్వాతంత్ర్య సాధన తప్ప మరో సిద్ధాంతం లేదు. ఆ నాటి కాంగ్రెస్ శ్రేణులలో సిద్ధాంత రాద్ధాంతాలది ద్వితీయస్థానమే. ఉద్యమ 'త్యాగాలకు' వెంటనే ప్రతిఫలాలు పొందాలనే ఆత్రుతే ఎక్కువ. అందుకే, మొదటి తరం రాజకీయసంస్థల ఫిరాయింపులలో పెద్దగా సైద్ధాంతిక ఫిరాయింపులు లేవు. తరువాత తరువాత కాలంలో కాంగ్రెస్‌లోని శ్రేణుల మధ్య విధాన సమీకరణలు సమకూరుతూ, స్పష్టపడుతూ వచ్చాయి. ప్రయోజనాల రీత్యా, ఆ శిబిరాలు కొనసాగినప్పటికీ, అటూ ఇటూ దూకడానికి వ్యక్తులుగా పట్టింపులు లేనివారే ఎక్కువ. తెలంగాణ రాజకీయ ఉద్యమం కూడా సిద్ధాంతాలను నిరాకరించి, భౌగోళికరాష్ట్ర సాధన ఏకైక లక్ష్యంగా ముందుకు వెళ్లింది. రాష్ట్ర అవతరణ తరువాత, పార్టీని నిలిపి ఉంచే సూత్రంగా కేసీఆర్ నాయకత్వాన్నే భావించారు. ఇటువంటి సరళమైన ప్రాతిపదికలకు పెద్ద కట్టుబాట్లు అవసరం లేదు. ఉద్యమకాలంలో కూడా కేసీఆర్ పక్కన నిలిచిన వృత్తి రాజకీయ నేతలలో చాలా మందికి పెద్ద నీతినియామాలేమీ లేవు. తరువాతా లేవు. ఆ లక్షణం వల్లనే, ఇతర పార్టీలలోని అనైతికులకు రహదారి ఏర్పడింది. అదే దారి ఇప్పుడు కాంగ్రెస్ దిశగా నడుస్తోంది. వ్యక్తులు ప్రైవేటు జీవితాల్లో గీత దాటితేనో, చట్రాలలోపల ఒదగకపోతేనో, తప్పో ఒప్పో స్వేచ్ఛను సాధనచేస్తేనో విరుచుకుపడి, వేధించి, సకల మాధ్యమాల్లో ఆత్మగౌరవాలను లించింగ్ చేసే మన సమాజం, ప్రజలు తమకు ఇచ్చిన సమ్మతిపై ఈ గోడదాటు నేతలు వ్యాపారమూ అత్యాచారమూ చేస్తుంటే ఎందుకు సహిస్తున్నది?



akbar

> ఉద్యమకాలంలో కేసీఆర్ పక్కన నిలిచిన వృత్తి రాజకీయ నేతలలో చాలా మందికి పెద్ద నీతినియామాలేమీ లేవు. తరువాతా లేవు. ఆ లక్షణం వల్లనే, ఇతర పార్టీలలోని అనైతికులకు రహదారి ఏర్పడింది. అదే దారి ఇప్పుడు కాంగ్రెస్ దిశగా నడుస్తోంది. వ్యక్తులు ప్రైవేటు జీవితాల్లో గీత దాటితేనో, చట్రాలలోపల ఒదగకపోతేనో, తప్పో ఒప్పో స్వేచ్ఛను సాధనచేస్తేనో విరుచుకుపడి, వేధించి, సకలమాధ్యమాల్లో ఆత్మగౌరవాలను లించింగ్ చేసే మన సమాజం, ప్రజలు తమకు ఇచ్చిన సమ్మతిపై ఈ గోడదాటు నేతలు వ్యాపారమూ అత్యాచారమూ చేస్తుంటే ఎందుకు సహిస్తున్నది?

పార్టీ నుంచి వెళ్లిపోవడం, చీలిపోవడం వంటివి ప్రజాస్వామ్యప్రక్రియలు. తీవ్రమైన విభేదాలతో పార్టీని వదలడం వేరు, ఫిరాయింపు వేరు. ఎమర్జెన్సీ సడలింపు సమయంలో జగ్జీవన్‌రామ్ కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చారు. రాజీవ్ ప్రధానిగా ఉన్నప్పుడు వి.పి.సింగ్ కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. ప్రజలు అటువంటి వాటిని గమనిస్తూ ఉంటారు. ఒక రాజకీయ సంవాదం ఎట్లా రూపుదిద్దుకుంటున్నది, వైఖరుల్లో అభిప్రాయాల్లో తేడాలు ఎట్లా సమీకృతమవుతున్నాయి, తెలిసిపోతూ ఉంటుంది. తగినంత విధాన ఘర్షణ లేకుండా చీలికలను ప్రజలు ఆమోదించరు. 1984లో ఎన్‌టి రామారావు మీద నాదెండ్ల భాస్కరరావు చేసిన రాజకీయ ప్రయత్నానికి జనం ఆమోదం లేకపోవడం అందువల్లనే. కాంగ్రెస్ ప్రోద్బలంతో కేవలం అధికారం కోసం మాత్రమే భాస్కరరావు అట్లా వ్యవహరించారని ప్రజలు నమ్మారు. విధేయత మార్చిన ఎమ్మెల్యేల ఇళ్ల ముందు, వీధుల్లోకి వచ్చి ఆందోళనలు చేశారు. ఏకనాథ్ షిండే విషయంలో కూడా మహారాష్ట్ర ప్రజల నుంచి సమ్మతి లేదని ఇటీవలి పరిణామాలు సూచిస్తున్నాయి. చీలికలను, కూడికలను సాంకేతికంగా పకడ్బందీగా జరిపించినా, నైతికంగా అవి ఎటువంటివో సమాజం అంతా కాకపోయినా, కనీసం పౌరసమాజమైనా ఒక కంట కనిపెడుతూ ఉంటుంది.



■ కె. శ్రీనివాస్

సందర్భం

ఒకసారి ప్రజాప్రతినిధిని ఎన్నిక చేసుకున్న తరువాత, పదవీకాలం మధ్యలో అతను లేదా ఆమె తీసుకునే వైఖరులను క్రియాశీలంగా వ్యతిరేకించడం రానురాను తగ్గిపోతోంది. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రజాప్రతినిధుల మీద ఒత్తిడి తేవడానికి ప్రజలు గట్టిగా ప్రయత్నించారు. పార్టీ మారిన సందర్భాలలో అటువంటి నిరసనలను అరుదుగా చూస్తుంటాము. ఒక లెజిస్లేటర్‌ను ఎన్నుకోవడం అంటే, సర్వ హక్కులతో ప్రజాభిప్రాయాన్ని కట్టబెట్టినట్టేనా? ఆ ప్రతినిధి, ఆ సమ్మతిని బదలాయింపు చేయవచ్చునా? బస్సు టిక్కెట్టు, రైలు టిక్కెట్టు, సినిమా టిక్కెట్టు వంటివే 'నాన్ ట్రాన్స్‌ఫరబుల్' అయితే, ఓటు ద్వారా సంక్రమించిన ప్రాతినిధ్యం బదలాయించదగ్గదా? తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ అనుకూల వాతావరణాన్ని అధిగమించి ప్రజల ఆమోదాన్ని పొందినవారు. అంటే ఓటర్లు, కాంగ్రెస్‌ను కాదని, బీఆర్ఎస్‌ను ఎంచుకున్నారు. మరి, ఇప్పుడు ఆ శాసనసభ్యులు, తమ ప్రజల ఆకాంక్షకు భిన్నంగా ఎట్లా వెళుతున్నారు? ఈ ప్రశ్న వీరికి మాత్రమే పరిమితం కాదు, వైఎస్ హయాంలో అవలీలగా అటువైపు వెళ్లిన టీఆర్ఎస్ శాసనసభ్యులకు, కేసీఆర్ ఒకటో హయాంలో, రెండో హయాంలో వెళ్లిన టీడీపీ, కాంగ్రెస్ శాసనసభ్యులకు కూడా వర్తిస్తుంది.

రాజీనామా చేసి రావచ్చుననే సూత్రం, అరవయ్యేళ్ల కిందట అద్భుతమైన ప్రతిపాదన అయిఉండవచ్చును కానీ, ఎన్నికలు, అధికారం లక్షలకోట్ల పరిశ్రమలుగా మారిన సందర్భంలో అదేమంత నైతికతను సూచించదు. ఆ ఒక్క నియమాన్ని చాటుతూ, బీజేపీ తాను గొప్పనీతిగా ఉన్నట్టు చెప్పుకుంటోంది. కర్ణాటకలో 2019 సంక్షోభంలో బీజేపీ అటువంటి ప్రయోగం చేసింది. ప్రజలను ఆకట్టుకునే ఉద్వేగ రాజకీయాలు నిర్వహిస్తూ, తగినంత ఆర్థిక బలం కలిగిన పార్టీ, కొందరు ఫిరాయింపుదార్లను గెలిపించుకోగలగడం పెద్ద విశేషం కాదు, అది గొప్ప నైతికతమైపోదు. అలాగే, రాజీనామాలు లేని ఫిరాయింపులకు కూడా ఆ పార్టీలో కొంత చరిత్ర లేకపోలేదు.

గోడదాటే ఎమ్మెల్యేలను కాపాడుకోవడం చేతకాక, చేర్చుకునే పార్టీ మీద విమర్శలు ఎక్కుపెడితే ఉపయోగం లేదు. బీఆర్ఎస్ నాయకులను చూస్తే జాలి వేస్తుంది. మొదటి పదవీకాలంలో సరే, రెండో విజయం తరువాత, 88 మంది శాసనసభ్యుల బలం ఉన్న తరువాత, ఎందుకు ఫిరాయింపులను ప్రోత్సహించినట్టు? 2014 ఎన్నికల్లో మాత్రం, గెలుచుకున్న 63 మంది బలగం చాలు కదా? తెలంగాణ తొలి ప్రభుత్వాన్ని రక్షించుకోవడం, పడిపోకుండా కాపాడుకోవడం వంటి ఉదాత్త ఆశయాలతో అప్పుడు బలాన్ని అరువు తెచ్చుకున్నారు. మరి ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం సంఖ్య కూడా దాదాపు అదే కదా? వారికి మాత్రం తమ ఘనమైన ప్రభుత్వాన్ని కాపాడుకునే కర్తవ్యం ఉండదా? ఒకరిద్దరయితే తప్పట, గుంపు విలీనం ఒప్పట. ఫిరాయింపుల చుట్టూ ఇన్ని సమర్థనలను నిర్మించుకోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఈ సంవాదం మధ్యలో ప్రజాస్వామ్య విలువలు, కట్టుబాటు అన్న మాటలు పీలగానూ, బేలగాను ధ్వనించే పరిస్థితి ఏర్పడింది. అవినీతికర ప్రక్రియ కొనసాగుతుంటే, ఇదేదో ప్రపంచకప్పు క్రీడ అయినట్టు, మీడియా అంతా గోడకు ఇవతల, అవతల కెమెరాలు బిగించుకుని కాచుక్కూచోవడం, ఫిరాయింపు వీరుడు ఏ క్షణం వస్తాడో అన్నట్టు, అర్ధరాత్రుళ్లు ముఖ్యనాయకుల ఇళ్ల ముందు పడిగాపులు పడవలసిరావడం ఆశ్చర్యం కలిగిస్తుంది. మూడింట రెండు వంతుల లెక్క ఎంతకాలంలో పూర్తవుతుందో విశ్లేషణలు చేయడం మరో పవిత్రబాధ్యత!

> ఒక లెజిస్లేటర్‌ను ఎన్నుకోవడం అంటే, సర్వ హక్కులతో ప్రజాభిప్రాయాన్ని కట్టబెట్టినట్టేనా? ఆ ప్రతినిధి, ఆ సమ్మతిని బదలాయింపు చేయవచ్చునా? బస్సు టిక్కెట్టు, రైలు టిక్కెట్టు, సినిమా టిక్కెట్టు వంటివే 'నాన్ ట్రాన్స్‌ఫరబుల్' అయితే, ఓటు ద్వారా సంక్రమించిన ప్రాతినిధ్యం బదలాయించదగ్గదా?

రాజ్యాంగంలో బీసీల కోసం రాయాలి కొత్త పేజీలు...!

స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు పెంచుతామని ఎన్నికల వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు వ్యవహరిస్తున్న తీరును చూస్తే బీసీలు మరొక్కసారి మోసపోబోతున్నారని స్పష్టంగా అర్థమవుతున్నది. కాంగ్రెస్ చేసిన వాగ్దానాల్లో కెల్లా అత్యంత ముఖ్యమైన వాగ్దానం బీసీ కులగణన, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు. ఎన్నికల ముందు రాహుల్‌గాంధీ తాము అధికారంలోకి రాగానే బీసీ కులగణన, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేస్తామని గట్టిగా చెప్పారు. రాహుల్ చెప్పిన మాటలను బీసీలు నమ్మారు. కాంగ్రెస్‌ను గెలిపించారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలుచేస్తారని ఎదురుచూస్తుంటే, కులగణన జరుగకుండా స్థానిక సంస్థల ఎన్నికల్లోకి పోయేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేసే ప్రయత్నంతో బీసీలు తీవ్ర నిరుత్సాహానికి గురవుతున్నారు. ఏదో ఒక సాకు చూపి రాష్ట్ర ప్రభుత్వం దాటవేస్తున్నదన్న అనుమానాల్లో బీసీలు ఉన్నారు. సుప్రీంకోర్టు తీర్పు మార్గదర్శకాలను దాటి బీసీలకు రిజర్వేషన్లు పెంచలేరని అగ్రవర్ణాలకు స్పష్టంగా తెలుసు. అందుకే అన్ని పార్టీల్లో ఉన్న అగ్రవర్ణ నాయకత్వాలు ఈ విషయంపై పెదవి విప్పకుండా ఉన్నారు. రాహుల్ చెప్పిన మాటను రేవంత్ రెడ్డి ఏ మేరకు అమలు జరుపుతారోనన్న విషయం తేటతెల్లమయ్యే సమయం ఆసన్నమైంది.



> కులగణన చేయకుండా రాష్ట్రంలో పంచాయతీరాజ్ చట్టం చేయలేరు. అది జరగకుండా బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచటం జరగదు. రాహుల్ చెప్పిన మాటకు భిన్నంగా, కామారెడ్డిలో కాంగ్రెస్ డిక్లరేషన్‌కు వ్యతిరేకంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తున్నది.

243డి(6) రాజ్యాంగ సవరణ ద్వారా రాష్ట్ర ప్రభుత్వమే కులగణన చేస్తే పంచాయితీరాజ్ చట్టాన్ని అమలు జరుపవచ్చు. 1992 దాకా ఎస్సీ, ఎస్టీలకు కూడా స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు లేవు. 243డి(6) రాజ్యాంగ సవరణ ద్వారానే బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు అమలులోకి వచ్చాయి. 1994లో ఏపీ పంచాయితీరాజ్ యాక్ట్ ప్రకారం స్థానిక సంస్థలల్లో బీసీలకు 34శాతం రిజర్వేషన్లు ఇచ్చారు. కానీ 2010 కృష్ణమూర్తి కేసులో సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం 50శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు దాటకూడదని తీర్పునిచ్చింది. ఈ లెక్కన ఓటరు లిస్టుల ఆధారంగా చూసినా రాష్ట్రంలో 17శాతంగా ఉన్న ఎస్సీలు, 8 శాతంగా ఉన్న ఎస్టీల సంఖ్య పెరిగింది. దీని ప్రకారం చూస్తే బీసీలకు 20 శాతానికి మించి రిజర్వేషన్లు వచ్చే అవకాశమే లేదు. బీసీలకు సామాజిక న్యాయం విషయంలో మళ్ళీ మరొక్కసారి ప్రభుత్వం ద్రోహం చేసినట్లవుతుంది. 243డి(6) రాజ్యాంగ సవరణ ఆధారంగానే 2023లో బిహారు ప్రభుత్వం కులగణన చేసి పంచాయతీరాజ్ యాక్ట్‌ను తీసుకువచ్చి రిజర్వేషన్లను 65 శాతం దాకా పెంచారు. కానీ దీన్నీ పాట్నా హైకోర్టు కొట్టివేసింది. భారత రాజ్యాంగం సాక్షిగా పార్లమెంటు, అసెంబ్లీ, న్యాయస్థానాలు, ప్రధాని, ముఖ్యమంత్రి, న్యాయమూర్తులు అంతా ప్రజాసేవకులు అన్నది మరువరాదు. ప్రజాస్వామ్యం అందరి భాగస్వామ్యం చూడాలని చెబుతుంది. కానీ దేశంలో, రాష్ట్రంలో ప్రజాస్వామ్యం కొందరిదిగా మారటం వల్లనే 77 ఏళ్ళుగా బీసీ కులగణనను చేయకుండా ఆధిపత్య వర్గాలు కుట్రలు చేస్తూ వస్తున్నాయి.

కులగణన చేయకుండా రాష్ట్రంలో పంచాయతీరాజ్ చట్టం చేయలేరు. అది జరగకుండా బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచటం జరగదు. రాహుల్ చెప్పిన మాటకు భిన్నంగా, కామారెడ్డిలో కాంగ్రెస్ డిక్లరేషన్‌కు వ్యతిరేకంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తున్నది. రాహుల్ చెప్పిన సామాజిక న్యాయానికి భిన్నంగా వ్యవహరిస్తున్న తీరును నిరసించటానికి బీసీలంతా ఐక్యం కావాల్సిన చారిత్రక సందర్భం ఆసన్నమయ్యింది. అన్ని పార్టీల్లో ఉన్న 2 కోట్ల మంది బీసీలు ఒక్క తాటిపైకి రావాల్సిన సమయం వచ్చింది.

బీసీలు తమను తాము వెతుక్కుంటూ తమ హక్కుల సాధన కోసం తండ్లాడుతున్న సందర్భంలో బీసీ విద్యావంతులు, ఆలోచనాపరులు, కవులు, రచయితలు, కళాకారులు బీసీ ఉద్యమానికి రూపకల్పన చేయవలసిన సందర్భమిది. తెలంగాణ రాష్ట్రసాధన ఉద్యమానికి స్వీయ రాజకీయ అస్తిత్వమనే భావజాల ఆయుధాన్ని అందించినట్లుగా ఇపుడు బీసీ సాధికారిక ఉద్యమానికి తెలంగాణ బీసీ అస్తిత్వ సాధనకు భావజాల వేదికను రూపొందించవలసిన బాధ్యత బీసీ మేధావులపై ఉంది. బీసీల ఆర్థిక, రాజకీయ, సామాజిక న్యాయ పోరాటానికి ఉత్పత్తి కులాలన్నింటినీ ఏకం చేసి, బీసీ కార్మిక, కర్షక, విద్యార్థి, మేధావి ఐక్యతను ముందుకు తీసుకుపోవాలి. బీసీలను ఓటు యంత్రాలుగా మార్చి 77 ఏళ్ళుగా పాలనను కొనసాగిస్తున్న పాలకుల నైజాన్ని తెలియజేస్తూ స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల కోసం ఊరువాడా ఏకం చేయవలసిన బాధ్యత బీసీ ఉద్యమకారులపై, బీసీల పక్షాన నిలిచే రాజకీయ పార్టీలపై ఉంది.

స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు ఓటరు లిస్టుల ఆధారంగా కానీ, కులగణన ఆధారంగా కానీ ఏ విధంగా అధ్యయనం చేసినా ఆచరణలో సాధ్యం కాదని రేవంత్ రెడ్డి ప్రభుత్వం గుర్తించినట్లు కనిపిస్తుంది. రాజ్యాంగ సవరణ జరుగకుండా రిజర్వేషన్ల పెంపు అసాధ్యం అని దేశంలోని అనేక రాష్ట్రాల అనుభవాల పాఠాలు చెబుతున్నాయి. ఈ లెక్కన చూస్తే బీసీలకు తీరని అన్యాయమే కాకుండా ఎంబీసీలు, సంచార అర్ధసంచార జాతులకు మరీ ఘోరమైన అన్యాయం జరుగుతుంది. కర్ణాటక రాజకీయ రిజర్వేషన్ల పెంపు విషయమై కృష్ణమూర్తి కేసు విషయంలో సుప్రీంకోర్టు ఒప్పుకోలేదు. యాభైశాతం రిజర్వేషన్లు దాటకూడదంటున్న అదే సుప్రీంకోర్టు ఈడబ్ల్యుయస్ పేరుతో 10 శాతం రిజర్వేషన్లు అగ్రవర్ణాలకు ఇవ్వడం ఏ లెక్కన న్యాయమవుతుంది? కేంద్రంలో రాజ్యాంగ సవరణ చేయకుండా బీసీ రిజర్వేషన్ల పెంపు సాధ్యం కాదు. తెలంగాణ ప్రభుత్వం కులగణన చేసి తీరాలి. బీసీల ఓట్ల కోసం మాత్రమే కులగణన అన్నారా? లేక చిత్తశుద్ధితోనే వాగ్దానం చేశారా? రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఇది పరీక్షా కాలంగా మారనుంది.

ఏదో తూతూ మంత్రంగా జనాభా పట్టిక ఆధారంగా లెక్కలు సేకరించి ఆదరాబాదరా చేస్తే 2 కోట్ల మంది బీసీల నిరసనకు గురికావలసి వస్తుంది. కేంద్రంపై బీసీలు, అన్ని రాజకీయ పార్టీలు ఒత్తిడి పెంచాలి. ఇందుకోసం జాతీయంగా అన్ని పార్టీలను ఒక వేదికపైకి తెచ్చే నాయకత్వం కూడా కావాలి. బీసీలకు సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం చేకూర్చేందుకు తప్పకుండా రాజ్యాంగ సవరణ జరగాలి.

• జూలూరు గౌరీశంకర్
తెలంగాణ రాష్ట్ర తొలి బీసీ కమిషన్ సభ్యులు

దాశరథి శతజయంతి ప్రారంభ సభ

మన మానుకోట మట్టిబిడ్డ, మహాకవి దాశరథి శతజయంతి ఉత్సవాల ప్రారంభ సభ ఈ నెల 22వ తేదీ మహబూబాబాద్ ఎస్‌వి ఫంక్షన్ హాల్‌లో జరగనున్నది. దాశరథి జన్మభూమి చినగూడురు నుంచి మహబూబాబాద్ వరకు ఆ రోజు ఉదయం తొమ్మిది గంటలకు బైక్ ర్యాలీ జరుగుతుంది. అనంతరం ఉదయం 10 గంటలకు జరిగే సభకు ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు రామచంద్ర నాయక్, మురళీ నాయక్, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, జి. దేవీప్రసాద్, కె.విరాహత్ అలీ అతిథులు. ప్రముఖ కవి నందిని సిధారెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ వక్తలు. సభ తరువాత కవి సమ్మేళనం జరుగుతుంది.

– తక్కెళ్లపల్లి రవీందర్‌రావు
అధ్యక్షులు, దాశరథి శతజయంతి ఉత్సవ కమిటీ

రుణమాఫీతో రైతుకు అభయ హస్తం

రాష్ట్ర వ్యాప్తంగా ఖరీఫ్ పనులు ముమ్మరంగా మొదలయ్యాయి. ఏ విత్తనాలు నాటాలి, ఏ ఎరువులు కొనుగోలు చేయాలి, పంట పెట్టుబడికి పైసలు ఎక్కడి నుంచి తేవాలి... అన్న సంశయంలో ఉన్న రైతన్నలకు కాంగ్రెస్ ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. రూ.2లక్షల రైతు రుణమాఫీ హామీ అమలుకు శ్రీకారం చుట్టి మరోసారి కాంగ్రెస్ పార్టీ రైతుల పక్షపాతి అని రుజువు చేసింది.

అసలే రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందీ, కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందా– అన్న ప్రశ్నలు, విమర్శలు పలు వర్గాల నుంచి వెల్లువెత్తాయి. వాటన్నింటినీ పటాపంచలు చేస్తూ, ప్రతిపక్ష పార్టీల విమర్శలకు చెక్ పెడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ వస్తున్నారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి పథకం కింద ప్రతి ఇంటికి 200 యూనిట్ల కరెంట్ బిల్లును ఉచితంగా అమలు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. గ్యాస్ సిలిండర్‌కు రూ.500లను కూడా అమలు చేస్తూ పేద ప్రజల ఆర్థిక భారాన్ని తగ్గిస్తోంది. ఎంపీ ఎన్నికలతో మిగతా హామీల అమలుకు కొంత బ్రేక్ పడింది. ఫలితాల అనంతరం ఇక ఇప్పుడు రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సారిస్తామని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఇందులో భాగంగానే ఖరీఫ్ సీజన్ మొదలై రైతులు విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు బ్యాంకుల చుట్టూ, వడ్డీ వ్యాపారుల చుట్టూ తిరిగే సమయంలో, ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ 'రైతు రుణమాఫీ' అమలుకు శ్రీకారం చుట్టారు.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వంలో అవినీతిని వెలుగులోకి తీసుకొస్తూనే ఉంది. రైతు బంధు కింద గుట్టలకు, వెంచర్లకు, హైవేలకు నగదును అందజేసిన ఘటనలను బైట పెట్టింది. ఇలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా అర్హులైన రైతులకే సాయం అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం నిబంధనలు రూపొందించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రుణమాఫీ కోసం రూపొందించిన జీవో 148లోని కీలక అంశాలను తీసుకుని, నూతన జీవో ఆర్టీ నెం.567ను విడుదల చేసింది. ఆగస్టు 15 గడువు కంటే ముందే ఏకకాలంలో రుణమాఫీ చేసేలా సీఎం రేవంత్‌రెడ్డి కసరత్తు మొదలు పెట్టారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 90లక్షల రేషన్‌కార్డులు ఉన్నాయి. ఇందులో రుణాలు ఉన్న రైతుల ఖాతా సంఖ్య 70లక్షలే. ఇంకా దాదాపు 6.36 లక్షల మంది రైతులకు రుణాలు ఉన్నా రేషన్ కార్డులు లేవు. వారందరినీ కూడా దృష్టిలో ఉంచుకుని రుణమాఫీ చేయనుంది.

తెలంగాణ ఏర్పడినప్పుడు మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పులకుప్పగా మార్చారు. ఇప్పుడు ఏ ప్రభుత్వ శాఖలో చూసినా అప్పుల లెక్కలే కనిపిస్తున్నాయి. 2014 ఎన్నికల్లో తెలంగాణలోని రైతులందరికి లక్ష రూపాయల రుణమాఫీ చేస్తామని కేసీఆర్ చెప్పారు. అధికారంలోకి వచ్చాక విడతల వారీగా రూ.25వేల రూపాయలు చొప్పున లక్ష వరకు చేశారు. ఆ లబ్ధి కూడా అరకొర రైతులకే లబ్ధి చేకూరింది. భారీ లెక్కలతో పబ్బం గడిపారే తప్ప ఏనాడూ రాష్ట్ర ప్రయోజనాలకు, రైతుల అభివృద్ధికి పాటుపడలేదు. 2018 నుంచి 2023 వరకు రుణమాఫీ అంచనా వ్యయం రూ.21,557 వేల కోట్లు ఉండగా కేవలం రూ.1206 కోట్లతో 5,42,609 లక్షల మంది రైతులకు మాత్రమే రుణమాఫీ చేశారు. అది కూడా విడతల వారీగా నిధులు విడుదల చేస్తూ చేపట్టారు. ఇంకా 31లక్షల రైతుల నోట్లో మట్టి కొట్టారు. ఎన్నికల్లో లబ్ధి పొందాలన్న స్వార్థంతో అసెంబ్లీ ఎన్నికలకు ముందు రుణమాఫీ ప్రకటించి కొంతమేర చేసినా రైతులందరికి అది చేరలేదు. పైపెచ్చు రైతులు గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అకాల వర్షాలతో, వరదలతో నిండా మునిగిపోయారు. కనీసం కేంద్ర ప్రభుత్వం అందజేసే ఫసల్ బీమాను కూడా అహంకారపూరిత ధోరణితో కేసీఆర్ రాష్ట్రంలో అమలు చేయలేదు. దీంతో పంట నష్టం వాటిల్లినప్పుడు ఎంతోమంది రైతులు ఆర్థికంగా చితికిపోయారు. రాష్ట్ర ప్రభుత్వమైనా ఆదుకుందా అంటే అదీ లేదు. ఏనాడూ బీఆర్ఎస్ నాయకులు రైతుల పొలాలను పరిశీలించిన పాపాన పోలేదు. గల్లీలో కుస్తీ, ఢిల్లీలో దోస్తీ అన్న చందంగా బీజేపీ నాయకులు కూడా ఏనాడూ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని నిలదీసిన పాపాన పోలేదు. ఫసల్ బీమాను అమలు చేయాలని ఏ బీజేపీ రాష్ట్ర నాయకుడూ రోడ్డెక్కి, బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన దాఖలాలు లేవు. నియంత్రిత వ్యవసాయం అంటూ రైతులను ఆగమాగం చేశారు. రైతులు ఏం పంట వేయాలో తామే చెబుతామని, రైతులను ఆర్థికంగా బలోపేతం చేస్తామంటూ నష్టాల ఊబిలోకి దించారు. రబీలో పంట వేసుకోవాలా వద్దా, వేస్తే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందా లేదా అన్న సంశయంతో చాలా మంది రైతులు వ్యవసాయానికి దూరం అయ్యారు. తెచ్చిన అప్పులు కట్టలేక ఎంతో మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. వాటిని కూడా గత ప్రభుత్వం దాచిపెట్టింది. ఎన్‌సీఈఆర్బీ లెక్కల ప్రకారం 2014 నుంచి 2023 వరకు తెలంగాణలో 7007 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో దాదాపు 9904 మంది రైతులకు రైతు బీమా కింద నగదును అందజేశారంటే ఎంతమంది అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకున్నారో అర్థం అవుతుంది. ఇంతేగాక రైతులకు సంకెళ్లు వేసిన ఘనత కూడా మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుంది. ప్రాజెక్టుల రీడిజైన్, నూతన ప్రాజెక్టుల నిర్మాణాల పేరిట రైతుల నుంచి భూములు లాక్కుని వారిని నడిసంద్రంలో వదిలేసిన పాపం కూడా బీఆర్ఎస్‌కే దక్కుతుంది. నష్ట పరిహారం అడిగితే లాఠీలతో భయపెట్టిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. అందుకే సార్వత్రిక ఎన్నికల్లో చెంపపెట్టులా రైతులు, ప్రజలు కేసీఆర్‌ను ఓడించారు.

కాంగ్రెస్ అధికారం చేపట్టేనాటికి రాష్ట్రం అప్పుల కుప్పగా మారి ఉన్నది. అయినా అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ రాష్ట్ర పురోగాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని రైతులను ఆర్థికంగా వృద్ధిలోకి తెచ్చేందుకు పక్కా ప్రణాళికలను రూపొందిస్తోంది. అప్పుల రాష్ట్రంగా ఉన్న తెలంగాణను గాడిలో పెట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని మంత్రివర్గం నిరంతరం కృషి చేస్తోంది. సంక్షేమ పథకాలకు ముందస్తు ప్రణాళికతో నిధులు సమకూరుస్తోంది. రైతుల రుణమాఫీకి దాదాపు రూ.31వేల కోట్లు అవసరం ఉందని అంచనా ఉండగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పక్కా ప్రణాళికలతో ఏక కాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేసేలా చర్యలు చేపడుతున్నారు. నేడు ఒకేసారి మొదటగా రూ.లక్ష చొప్పున రుణమాఫీ చేయడంతో దాదాపు 11.50 లక్షల మంది రైతులు లబ్ధి పొందుతారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ హయాంలో దివంగత సీఎం వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి దాదాపు 72 లక్షలకు పైగా రైతులకు రుణమాఫీ చేశారు. అదే పంథాలో మళ్లీ సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు రుణమాఫీ చేయనున్నారు.


> కాంగ్రెస్ అధికారం చేపట్టేనాటికి రాష్ట్రం అప్పుల కుప్పగా మారి ఉన్నది. అయినా అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ రాష్ట్ర పురోభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని రైతులను ఆర్థికంగా వృద్ధిలోకి తెచ్చేందుకు పక్కా ప్రణాళికలను రూపొందిస్తోంది. అప్పుల రాష్ట్రంగా ఉన్న తెలంగాణను గాడిలో పెట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని మంత్రివర్గం నిరంతరం కృషి చేస్తోంది. సంక్షేమ పథకాలకు ముందస్తు ప్రణాళికతో నిధులు సమకూరుస్తోంది. రైతుల రుణమాఫీకి దాదాపు రూ.31వేల కోట్లు అవసరం ఉందని అంచనా ఉండగా సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పక్కా ప్రణాళికలతో ఏక కాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేసేలా చర్యలు చేపడుతున్నారు.



అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ కాంగ్రెస్ ప్రభుత్వమే రైతుల పక్షపాతి ప్రభుత్వం, పేదల ప్రభుత్వం అని చెప్పొచ్చు.

కాంగ్రెస్ ప్రభుత్వం మరో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టింది. నేటి దాకా రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించే జీవోలు ఇంగ్లీషు భాషలో ఉండేవి. దీంతో సామాన్యుడికి జీవోలో పొందుపరిచిన కీలక ప్రతిపాదనలు, అంశాలు, సమాచారం అర్థమయ్యేవి కాదు. ముఖ్యంగా రైతుల్లో చాలామంది నిరక్షరాస్యులు ఉంటారు. చదువుకున్నవారిలో ఎక్కువమందికి ప్రామాణికంగా తెలుగు భాష మాత్రమే చదవడం, రాయడం వచ్చు. వీరికి ఇంగ్లీషు భాష అంతగా రాదు. వారందరికి అర్థమయ్యేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో మొట్టమొదటిసారిగా కాంగ్రెస్ ప్రభుత్వం జీవోను తెలుగులో ప్రచురించింది. జీవో ప్రతిని చదివితే నిరక్షరాస్యులు కూడా అర్థం చేసుకునేలా తెలుగు పదాలను ఉపయోగిస్తూ ఈ జీవోను విడుదల చేసింది. దీంతో ప్రతి రైతు జీవోలో పొందుపరిచిన అంశాలు నేరుగా అవగతం చేసుకోవచ్చు. తెలంగాణ రాష్ట్రంగా ఆవిర్భవించిన తర్వాత మొట్టమొదటి తెలుగు జీవోగా దీన్ని చెప్పుకోవచ్చు. గతంలో ప్రభుత్వం రూపొందించే జీవోలను తెలుగులో ప్రచురిస్తామని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. కానీ అది కార్యరూపం దాల్చలేదు. తెలుగు బాషపై ఉన్న మమకారంతో సీఎం రేవంత్‌రెడ్డి జీవో కాపీని తెలుగులో ప్రచురించడం మరొక గొప్ప ప్రారంభం.

■ ఇందిరా శోభన్
రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు



బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.8 కనిష్ఠం 23.6

కేటీఆర్ ట్వీట్‌కు స్పందించిన జీహెచ్‌ఎంసీ

హైదరాబాద్ సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఎక్స్(ట్విటర్)లో చేసిన పోస్టుపై జీహెచ్‌ఎంసీ స్పందించింది. బండ్లగూడ సమీపంలోని అరుంధతి ఎన్‌క్లేవ్‌లో బుధవారం చెట్లను ప్రూనింగ్ చేయడంతోపాటు చెత్తాచెదారం తొలగించారు. చెత్తాచెదారంతో పాముల భయముందంటూ ఓ నెటిజన్ చేసిన ట్వీట్‌పై స్పందించిన కేటీఆర్ వెంటనే చర్యలు తీసుకోవాలంటూ చేసిన ట్వీట్‌కు అధికారులు కాలనీని సందర్శించి అవసరమైన చర్యలు చేపట్టారు.



పాతబస్తీలో మొహర్రం..

పురవీధుల్లో బీబీకా ఆలం ఊరేగింపు 6

ధర్మ పరిరక్షణకోసం అసువులు బాసిన అమరులను స్మరిస్తూ షియా ముస్లింలు బుధవారం పాతబస్తీలో నిర్వహించిన ఊరేగింపు భక్తి ప్రపత్తులను చాటింది. మొహర్రంను పురస్కరించుకుని పురవీధుల్లో మాతం నిర్వహించారు. ఇందులో వేలాదిమంది పాల్గొన్నారు.

- చార్మినార్, జూలై 17 (ఆంధ్రజ్యోతి)



వివేకానందనగర్‌లోని ఓ ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు



భక్తి శ్రద్ధలతో తొలి ఏకాదశి

తొలిఏకాదశి వేడుకలను నగరవాసులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. బుధవారం ఉదయం నుంచే ఆలయాలకు పోటెత్తారు. కుటుంబ సమేతంగా దేవాలయాలను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- హైదరాబాద్ సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి)

ప్రతి చెరువుకో ఫైల్..!

- సమగ్ర సమాచారంతో రూపకల్పన
- శాటిలైట్ చిత్రాల ద్వారా వాస్తవ, ప్రస్తుత విస్తీర్ణం పరిశీలన
- ఆక్రమణలు, అక్రమ డంపింగ్‌పై వెంటనే అలర్ట్ వచ్చేలా చర్యలు
- కసరత్తును ముమ్మరం చేసిన హైడ్రా



హైదరాబాద్ సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): చెరువులు, పార్కుల పరిరక్షణే లక్ష్యంగా హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఎసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ (హైడ్రా) కసరత్తు ముమ్మరం చేసింది. ఫిర్యాదుల ఆధారంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి చట్టప్రకారం చర్యలు ప్రారంభించింది. ఆక్రమణలు, కబ్జాలను ముందస్తుగా నియంత్రించేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా ఒక్కో చెరువుకు ఒక్కో ఫైల్‌ను సిద్ధం చేయాలని నిర్ణయించింది. చెరువు ఏ గ్రామం, ఏ సర్వే నంబర్‌లో ఉంది..? వాస్తవ విస్తీర్ణం.. ప్రస్తుత విస్తీర్ణం, గుర్తించిన ఆక్రమణలు.. పూర్తి నీటి నిల్వ సామర్థ్యం(ఎఫ్‌టీఎల్), బఫర్‌జోన్ తదితర సమస్త సమాచారం ఈ ఫైల్‌లో ఉండేలా చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలో ఇరిగేషన్, రెవెన్యూ విభాగాల అధికారుల నుంచి వివరాలు తీసుకుంటూనే.. పర్యావరణవేత్తలు, చెరువుల పరిరక్షణకు పాటుపడుతోన్న సామాజిక కార్యకర్తలు, న్యాయవాదుల నుంచి ఆక్రమణలకు సంబంధించిన వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. చెరువుల్లో ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేపట్టినా.. నిర్మాణ రంగ వ్యర్థాలు డంప్ చేసినా రిమోట్ సెన్సింగ్ శాటిలైట్ చిత్రాల ద్వారా వెంటనే కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను అలర్ట్ చేసేలా చర్యలు తీసుకోనున్నట్టు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్(ఈవీడీఎం) కమిషనర్ ఏవీ రంగనాథ్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

మూడు దశల్లో...


ఔటర్ వరకు 2 వేల చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని హైడ్రా పరిధిగా ఇప్పటికే సూత్రప్రాయంగా నిర్ణయించారు. ఈ నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ పరిధిలోని 185, ఔటర్ వరకు ఉన్న దాదాపు 1000 చెరువుల సమస్త సమాచారం సిద్ధం చేయాలని భావిస్తున్నారు. బల్దియా, హెచ్‌ఎండీఏలోని లేక్స్ విభాగం ఇంజనీర్లతో రంగనాథ్ సమావేశమై చర్చించారు. ఇరిగేషన్, రెవెన్యూ విభాగాల సహకారంతో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ గుర్తిస్తూ ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసి అభ్యంతరాలు, సలహాలు స్వీకరిస్తారు. వాటిని పరిశీలించి అవసరమైన సవరణలతో తుది నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. అనంతరం చెరువు వివరాలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచి.. అధునాతన సాంకేతికత ద్వారా ఆక్రమణలు గుర్తించాలని భావిస్తున్నారు.

నోటీసులివ్వకుండా కూల్చేస్తాం: రంగనాథ్..

చెరువులు, ప్రభుత్వ విభాగాల పార్కుల్లో ఆక్రమణలను ఉపేక్షించం. నిర్మాణదారుడు స్థలానికి సంబంధించి సరైన డాక్యుమెంట్లు చూపని పక్షంలో నోటీసులు ఇవ్వకుండా వెంటనే కూల్చివేస్తాం. పురపాలన చట్టం కూడా ఇదే చెబుతోంది. ప్రస్తుతం ఈవీడీఎంకు ఉన్న అధికారాల మేరకు ఆక్రమణలపై చర్యలు తీసుకుంటున్నారు. బంజారాహిల్స్, గాజులరామారంలో ఆక్రమణలను నేలమట్టం చేశాం. పౌరులూ చెరువులు, పార్కుల కబ్జాల సమాచారం అందించాలి.

- గ్రేటర్‌లో ఎనిమిది మంది బలి
- కడుపుకోతతో తల్లడిల్లుతోన్న తల్లిదండ్రులు
- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం
- శివారు కార్పొరేషన్లు, మునిసిపాలిటీల్లో నివారణ చర్యలు కరువు..?

'వీధికుక్కలు రెచ్చిపోతున్నాయి. పాదచారులపై, వీధుల్లో, ఇళ్ల కాంపౌండ్‌లలో ఆడుకుంటున్న చిన్నారులపై దాడులు చేస్తూ వారి ప్రాణాలను హరిస్తున్నాయి. ఈ పరిస్థితి పునరావృత్తం కాకుండా చర్యలు చేపట్టాలన్న డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి.'



చిన్నారులను చంపేస్తున్నాయ్!

ప్రాణాలు తీస్తున్న వీధికుక్కలు

హైదరాబాద్ సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో ఇంటి ఎదుట ఆడుకుంటున్న 18 నెలల బాలుడిపై వీధికుక్కలు దాడిచేసిన ఘటనలో ఆ చిన్నారి తీవ్రంగా గాయపడి మృతిచెందిన విషయం తెలిసిందే. బతుకుదెరువు కోసం నెల రోజుల క్రితం నగరానికి వచ్చిన కుటుంబం ఒక్కగానొక్క కొడుకును కోల్పోయింది. ఇటువంటి పరిస్థితి జవహర్‌నగర్‌లో మాత్రమే కాదు.. శివార్లలోని కార్పొరేషన్లు, మునిసిపాలిటీలన్నింటిలోనూ ఉంది. వీధికుక్కల నియంత్రణకు ఆయా సంస్థల్లో ప్రత్యేక విభాగాల్లేవు. అవసరమైన సిబ్బంది లేరు. దీంతో విస్తరిత ప్రాంతాల్లో జనాభాతోపాటు కుక్కలూ అధికమవుతున్నాయి.



సికింద్రాబాద్‌లోని ఓ వీధిలో.. (ఫైల్)



గాంధీ మార్చురీ వద్ద రోదిస్తున్న బాలుడి తల్లి

వెటర్నరీ విభాగం లేదు..

జీహెచ్‌ఎంసీతో పోలిస్తే శివార్లలోని కార్పొరేషన్లు, మునిసిపాలిటీల్లో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది. గ్రేటర్ చుట్టూ ఉన్న ఏడు కార్పొరేషన్లు, ఏడు మునిసిపాలిటీల్లో వెటర్నరీ విభాగం లేదు. దీంతో వీధికుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ జరుగుతున్న దాఖలాలు అంతంత మాత్రమే. మణికొండ, నార్సింగ్, కొంపల్లి, దుండిగల్ మునిసిపాలిటీలు,

మిగతా 6వ పేజీలో..

జీహెచ్‌ఎంసీ లెక్కలివి...

ఆర్థిక సంవత్సరం	స్టెరిలైజేషన్/ వ్యాక్సినేషన్ చేసినవి
2014-15	91,974
2015-16	97,823
2016-17	94,247
2017-18	87,697
2018-19	68,359
2019-20	59,925
2020-21	52,783
2021-22	60,914
2022-23	50,046
2023-24	57,523
మొత్తం	7,21,291

సామాజిక మాధ్యమాల్లో విహాన్ అల్లరి వైరల్



విహాన్

జవహర్‌నగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): 18 నెలల విహాన్ అల్లరి సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. చలాకీగా ఉండే బాలుడు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో సరదాగా గడిపే వీడియోలు.. టీవీ, మొబైల్‌లో పాట వస్తే.. స్టెప్పులేయడం, ఇంట్లో సందడి చేయడం వంటివి నెట్టింట్లో వైరల్‌గా మారాయి. ఇప్పుడా వీడియోలు జ్ఞాపకాలుగా మిగిలాయి. తోటి చిన్నారులతో నృత్యం చేస్తూ, మామిడి పండు తాను తింటూ తండ్రికి తినిపిస్తోన్న వీడియోలను చూసిన నెటిజన్లు.. అయ్యో పాపం కుటుంబానికి తీరని శోకం మిగిలిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



జవహర్‌నగర్ మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు

రూ.20లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

- బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి
- రోడ్డుపై బైఠాయించిన ప్రతిపక్షాల నేతలు

జవహర్‌నగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): జవహర్‌నగర్ పరిధిలో మంగళవారం రాత్రి వీధికుక్కల మూకుమ్మడి దాడిలో మృతిచెందిన చిన్నారి విహాన్ (18 నెలలు) కుటుంబానికి రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ప్రజా సంఘాలు, ప్రతిపక్ష పార్టీలు బీజేపీ, బీఆర్‌ఎస్‌తో పాటు పలువురు నాయకులు డిమాండ్ చేశారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం వల్లే వీధికుక్కలు ఓ నిండుప్రాణాన్ని బలిగొన్నాయని ఆరోపిస్తూ వారు కార్పొరేషన్ కార్యాలయం ఎదుట బుధవారం బైఠాయించి ఆందోళనకు దిగారు. బాధిత కుటుంబానికి డబుల్‌బెడ్‌రూం ఇల్లు లేదా ప్లాట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తక్షణం సాయం చేయాలని కమిషనర్‌ను కోరినా స్పందించలేదని ఆరోపించారు. ఈ క్రమంలో కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి వారి వద్దకు వచ్చి వీధిశునకాల దాడి ఘటనపై పూర్తి వివరాలతో మేడ్చల్ కలెక్టర్‌కు నివేదిక అందించామని తెలిపారు. రోడ్డుపై బైఠాయించిన వారిలో బీఆర్‌ఎస్ నాయకులు రాజశేఖర్, రాంచందర్, బండకింది ప్రసాద్, బీజేపీ నాయకులు రంగుల శంకర్, కమల్, సందీప్, కాలనీవాసులు నరేందర్‌యాదవ్, ప్రజాసంఘాలు షేక్‌షావలితో పాటు పలువురు పాల్గొన్నారు.

తక్షణ సాయం కింద రూ. 50వేలు

చిన్నారి అంత్యక్రియల కోసం తక్షణసాయం కింద మేయర్ శాంతి కోటేశ్‌గౌడ్ రూ.30వేలను, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ రూ.20వేలను కలిసి మొత్తం రూ.50వేలను బాధిత కుటుంబానికి ఆన్‌లైన్ ద్వారా అందజేశారు.

మిరుదొడ్డిలో అంత్యక్రియలు

అడ్డగుట్ట, మిరుదొడ్డి: కుక్కల దాడిలో మృతిచెందిన విహాన్‌కు బుధవారం ఫోరెన్సిక్ వైద్యురాలు లావణ్య పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అనంతరం మృతదేహాన్ని స్వగ్రామమైన సిద్దిపేట జిల్లా మిరుదొడ్డికి తరలించి అంత్యక్రియలు పూర్తి చేశారు.

- ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ సమితి పాత, కొత్త కమిటీల్లో విభేదాలు
- అడ్‌హాక్ కమిటీ ఆధ్వర్యంలోనే గణేష్ ఉత్సవాలు: దానం నాగేందర్
- ఉత్సవాలను ఎప్పటికీ మేమే నిర్వహిస్తాం: చైర్మన్ రాజ్‌కుమార్

కుదరని సయోధ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే దానం నాగేందర్, సభ్యులు

ఖైరతాబాద్, జూలై 17(ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మక ఖైరతాబాద్ గణపతి ఉత్సవాల నిర్వహణలో పాత, కొత్త కమిటీల మధ్య సయోధ్య కుదరడం లేదు. రెండు కమిటీల మధ్య విభేదాలు తలెత్తడంతో ఈసారి ఏం జరగనుందోనని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు గణపతి ఉత్సవాల్లో రాజకీయ జోక్యాలేంటని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

గణపతికి గిన్నిస్ రికార్డు సాధిస్తాం: ఎమ్మెల్యే దానం

ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఖైరతాబాద్ గణపతి వద్ద ఉత్సవాలను మరింత ఘనంగా నిర్వహించి భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించి గిన్నిస్ రికార్డు సాధించడమే లక్ష్యంగా పనిచేస్తామని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు కమిటీల నుంచి తొలి విడతలో 41 పేర్లను చదివి వినిపించారు. చైర్మన్‌గా సింగరి రాజ్‌కుమార్, అధ్యక్షుడిగా దానం నాగేందర్, ఉపాధ్యక్షురాలిగా కార్పొరేటర్ విజయారెడ్డితో పాటు మరికొన్ని పేర్లు తెలిపారు. మరిన్ని పేర్లు చేర్చి మొత్తం 101 మందితో అడ్‌హాక్ కమిటీని వేస్తామన్నారు. ఉత్సవాల్లో గణపతి వద్దకు వచ్చే లక్షలాది మంది భక్తులకు ఇబ్బందులు లేకుండా ఫైనాన్స్ కమిటీ, ఎస్‌ఆర్‌ఏ, వీఐపీల ఆహ్వాన కమిటీ, పోలీస్, మీడియా కమిటీలు వేసి సేవలందిస్తామన్నారు. పోలీసు, మీడియా, వాలంటీర్ల కోసం భోజన సౌకర్యం కల్పిస్తామని, భక్తులు తిరుపతి, యాదగిరిగుట్టలో పొందే అనుభూతి మిగిలేలా ఏర్పాట్లు చేస్తామన్నారు.

ఉత్సవాలను మేమే నిర్వహిస్తాం..

ఎప్పటిమాదిరిగానే గణేష్ ఉత్సవాలను తామే నిర్వహిస్తామని, తమ ఆధ్వర్యంలోనే అడ్‌హాక్ కమిటీ పని చేస్తుందని ఉత్సవ కమిటీ చైర్మన్, నిర్వాహక కుటుంబసభ్యులు రాజ్‌కుమార్, వీణామాధురి పేర్కొన్నారు. 70 సంవత్సరాలుగా తాము ఉత్సవాలను నిర్వహిస్తున్న విషయం అందరికీ తెలుసని, ఈసారి మరింత ఘనంగా చేస్తామని వారు తెలిపారు. ఈసారి పెద్ద ఎత్తున స్థానిక యువత ఉత్సవాల్లో భాగస్వాములవుతున్నారని, అందరి సహకారంతో వైభవంగా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.



అనుమానితుల ఇళ్లలో సోదాలు చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

ధూల్‌పేటలో గల్లీగల్లీలో సోదాలు

గంజాయితో దారితప్పుతున్న యువతకు కౌన్సెలింగ్

హైదరాబాద్ సిటీ, జూలై 17(ఆంధ్రజ్యోతి): నగరంలో మాదక ద్రవ్యాల సరఫరాపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నా.. ధూల్‌పేటలో మాత్రం గంజాయి రవాణా, విక్రయాలు గుట్టుగా సాగుతున్నాయి. ఇటీవల కాలంలో తరచుగా గంజాయి స్మగ్లర్స్ పోలీసులకు చిక్కుతుండటంతో ఆబ్కారీ శాఖ అధికారులు ధూల్‌పేటపై ప్రత్యేక దృష్టి సారించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎక్సైజ్‌శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎస్టీఎఫ్, డీటీఎఫ్ ఎక్సైజ్

మిగతా 6వ పేజీలో..

మార్పు వైపు అడుగులు వేయాలి..



డ్రగ్స్, గంజాయిని లేకుండా చేయాలనే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యానికి ప్రజలు పూర్తిగా సహకరించాలి. ధూల్‌పేట్‌లో గంజాయిని తుద ముట్టించే వరకు దాడులు జరుపుతుంటాం. ఈ విషయంలో ప్రజలు గంజాయి అమ్మకాలు, రవాణా, వినియోగంపై ఎక్సైజ్‌శాఖకు సహకరించాలి. లేదంటే కఠిన కేసులతో కటకటాల్లోకి వెళ్లాల్సి వస్తుంది. గంజాయి, ఇతర డ్రగ్స్ సమాచారాన్ని 18004252523 ట్రోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వండి

- వీబీ కమలాసన్‌రెడ్డి, డైరెక్టర్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్



సైబర్ నేరగాళ్ల ఆటకట్టిస్తున్న పోలీసులు 6

'ఉస్మానియా'లో అరుదైన శస్త్ర చికిత్స

పీపీపీ పద్ధతిలో ఎలివేటెడ్ కారిడార్లు.?

- కన్సల్టెన్సీ ఏర్పాటుకు హెచ్‌ఎండీఏ చర్యలు
- ఇప్పటికే పాలనా అనుమతులు మంజూరు
- సికింద్రాబాద్‌లో మొదలైన భూసేకరణ పనులు
- నివేదిక ఆధారంగానే నిర్మాణ పద్ధతిపై స్పష్టత

ఆదాయ, వ్యయ అంచనాలకు కసరత్తు

హైదరాబాద్ సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ప్రజలు, ప్రభుత్వ భాగస్వామ్యం (పీపీపీ)తో సికింద్రాబాద్‌లోని ఎలివేటెడ్ కారిడార్లను నిర్మించేందుకు హెచ్‌ఎండీఏ యోచిస్తోంది. ఈ భారీ ప్రాజెక్టులను పీపీపీ పద్ధతిలో చేపట్టేందుకు ఓ కన్సల్టెన్సీని ఏర్పాటు చేసేలా హెచ్‌ఎండీఏ చర్యలు చేపట్టింది. ఈ ప్రాజెక్టు నిధుల మంజూరుకు ప్రభుత్వం పాలనపరమైన అనుమతులివ్వడంతోపాటు శంకుస్థాపన చేసింది. దీంతో ఆర్మీ అధికారులతో కలిసి భూసేకరణ పనులు మొదలుపెట్టారు. ఈ క్రమంలో హెచ్‌ఎండీఏ నియామకం చేసే కన్సల్టెన్సీ నివేదిక

మిగతా 6వ పేజీలో..

బ్యాక్‌లాగ్‌పై మాకూ వన్‌టైమ్ ఛాన్స్ ఇవ్వరూ..!

హైదరాబాద్ సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీతో పాటు అనుబంధ కాలేజీల్లో ఎల్ఎల్‌బీ, ఎంబీఏ, ఎంసీఏ ఇతర వృత్తి విద్యా కోర్సులను చదివిన లక్షలాది మంది నిర్ణీత గడువులోపు బ్యాక్‌లాగ్స్ క్లియర్ చేసుకోలేదు. మరోసారి రీ అడ్మిషన్ చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని దిగులు చెందుతున్నారు. ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీ, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంఎల్ఐఎస్సీ, బీఎల్ఐఎస్సీ, ఎంసీజే కోర్సులకు అవకాశం కల్పించినట్లుగానే.. ఇతర వృత్తి విద్యా కోర్సుల్లో తమకు అవకాశం కల్పించాలని పలువురు అభ్యర్థులు కోరుతున్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ రోహిణి, ఉన్నతాధికారులు

'ఇన్‌స్పైర్ అవార్డ్స్' పోస్టర్ ఆవిష్కరణ

● దరఖాస్తుల సంఖ్యను పెంచాలని అధికారులకు డీఈవో ఆదేశం

హైదరాబాద్ సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఇన్‌స్పైర్ అవార్డ్స్ కోసం దరఖాస్తు ప్రక్రియకు సంబంధించిన పోస్టర్‌ను హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి రోహిణి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టడంతో పాటు వారి ఆలోచనలను ఆవిష్కరించేందుకు ఈ వేదిక ఉపయోగపడుతుందన్నారు. ప్రతీ పాఠశాల నుంచి ఐదు ప్రాజెక్టులు ఇన్‌స్పైర్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపికయ్యేలా ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రాజెక్టులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడానికి సెప్టెంబర్ 15 చివరి తేదీగా పేర్కొన్నారు. ఈ ఏడాది దరఖాస్తుల సంఖ్య పెంచడమే లక్ష్యంగా ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకోవాలని ఉప విద్యాశాఖాధికారులను, ప్రధానోపాధ్యాయులను, గైడ్ టీచర్లను డీఈవో ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ బి.శ్రీనివాస్‌రెడ్డి, డీఎస్‌ఓ సి.ధర్మేందర్‌రావు, సూపరింటెండెంట్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


గగన్‌పహాడ్ అప్పాచెరువు

గగన్‌పహాడ్ అప్పా చెరువును కాపాడండి

బీజేపీ యువ మోర్చా రాజేంద్రనగర్ కన్వీనర్ వినయ్‌రెడ్డి

రాజేంద్రనగర్, జూలై 17(ఆంధ్రజ్యోతి): గగన్‌పహాడ్ అప్పా చెరువును కాపాడాలని భారతీయ జనతా యువమోర్చా రాజేంద్రనగర్ నియోజకవర్గం కన్వీనర్ సూరెడ్డి వినయ్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో కోరారు. సర్వేనెంబర్లు 89,90, 91, 176,178లలో 46 ఎకరాలు ఉండాల్సిన అప్పాచెరువు చాలా వరకు అన్యాక్రాంతమైపోయిందన్నారు. రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ ఎం.వి.భూపాల్‌రెడ్డి స్వయంగా అప్పాచెరువును సందర్శించి, భూమిని పరిశీలించాలని అన్నారు. ఆక్రమణలు జరుగకుండా, చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నటువంటి ఆక్రమణలను తొలగించేలా అధికారులను ఆదేశించాలని కోరారు. నీటిపారుదల శాఖ అధికారులు అప్పాచెరువులో ఉన్న అక్రమణలను తొలగించలేదన్నారు. చెరువును ఆనుకుని రైల్వేట్రాక్ ఉందని, దాని కింద కూడా కబ్జాదారులు మట్టిపోసి నింపారన్నారు. ట్రాక్ కింద భాగం నుంచి చెరువులోకి నీరురాకుండా ఆపివేశారన్నారు. చెరువు స్థలంలో గోడలు నిర్మించారన్నారు. వీటన్నింటిపై రంగారెడ్డి జిల్లా కలెక్టర్ మరొకసారి పరిశీలించి అప్పాచెరువును కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



మాట్లాడుతున్న ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి

ఉపాధ్యాయులు గురుతర బాధ్యతతో
విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

రాజేంద్రనగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు గురుతర బాధ్యతతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి సూచించారు. రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ పరిధిలో ఇటీవల పదోన్నతులు, బదిలీలు పొందిన ఉపాధ్యాయులు బుధవారం అత్తాపూర్ ఎస్‌వీఎం గ్రాండ్‌లో కృతజ్ఞత సమావేశం ఏర్పాటు చేసి డాక్టర్ జి.చిన్నారెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు విజయసాగర్, శ్రీనివాససాగర్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతిపత్రం అందజేస్తున్న దామోదర్ గౌడ్, జైపాల్‌రెడ్డి తదితరులు

బార్ నిర్వాహకులు తీవ్ర నష్టాల్లో ఉన్నారు

- ఆదుకోవాలని మంత్రి జూపల్లికి వినతి

అఫ్జల్‌గంజ్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులను ఆదుకోవాలని, గత పదేళ్ల కాలంలో అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్న తమను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు. తెలంగాణ బార్ అండ్ రెస్టారెంట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.దామోదర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ఎం.జైపాల్ రెడ్డి పలువురు బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులు బుధవారం రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి వినతిపత్రం అందజేశారు. కరోనా సమయంలో వ్యాపారం సరిగా జరగక తీవ్రంగా నష్టపోయామన్నారు. 2019 నుంచి ప్రభుత్వం ఎలాంటి కొత్త పాలసీ తీసుకురాలేదన్నారు. 2022-23 కొత్త పాలసీని తీసుకొచ్చిన ప్రభుత్వం జీవో నంబర్ 46 విడుదల చేసిందన్నారు. పాత పాలసీనీ అమలు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. వైన్స్‌షాపు పర్మిట్ నిబంధనల ప్రకారం 100 మీటర్ల దూరంలో ఎలాంటి తినుబండాలు అమ్మకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాల్లో దాబాలు ఏర్పాటు చేసి వాటిల్లో మద్యం తాగేందుకు అనుమతిస్తున్నారని... దాబాలపైనా చర్యలు తీసుకోవాలన్నారు. బార్ లైసెన్స్‌ను ఐదేళ్లకు ఒకసారి రెన్యూవల్ చేసుకునేలా చూడాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో జి.విజయ్‌కుమార్ గౌడ్, ఈ. రామకృష్ణ, పి.రాజు గౌడ్, పి.శ్రీనివాస్‌గుప్తా, సుధాకర్ గౌడ్, కె.బాల్‌రాజ్‌గౌడ్, ఎన్.శ్రీధర్ రెడ్డి, ఎన్.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.


గాంధీభవన్‌లో ఏకలవ్యుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బెల్లయ్య నాయక్, ఆర్.సాంబయ్య తదితరులు

ఘనంగా ఏకలవ్యుడి జయంతి

- నివాళులర్పించిన గిరిజన కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్

అఫ్జల్‌గంజ్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో వెనుకబడిన ఎరుకల జాతి అభివృద్ధి కోసం గిరిజనశాఖ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడం గొప్ప విషయమని కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బెల్లయ్య నాయక్ పేర్కొన్నారు. బుధవారం గాంధీ భవన్‌లో టీపీసీసీ మాజీ ఎస్టీ సెల్ కో-ఆర్డినేటర్, ఏకలవ్య జాతీయ అధ్యక్షుడు ఆర్.సాంబయ్య అధ్యక్షతన ఏకలవ్యుడి జయంతి వేడుకలను నిర్వహించారు. బెల్లయ్య నాయక్ హాజరై ఏకలవ్యుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎరుకల జాతికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. ట్యాంక్‌బండ్ వద్ద ఏకలవ్యుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కుమార్‌రావు, ఎం.చిన్నయ్య, ఎల్లయ్య, ఎం.వినోద్ కుమార్, ఎరుకల కులస్థులు పాల్గొన్నారు.

ఆలయాలు ముస్తాబు

రేపటి నుంచి పాతబస్తీలో బోనాల ఉత్సవాలు


హరిబౌలి బంగారు మైసమ్మ దేవాలయం

చాంద్రాయణగుట్ట, జూలై 17 (ఆంధ్ర జ్యోతి): ఆషాడమాస బోనాల ఉత్సవాలకు ఆలయ కమిటీ నిర్వాహకులు అమ్మవారి ఆలయాలను సర్వాంగా సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే అధికారులు సమీక్షా సమావేశాలు నిర్వహించి ఆలయాల వద్ద తీసుకోవాల్సిన చర్యల గురించి వివిభాగాల అధికారులకు సూచనలు చేశారు. పాతబస్తీలోని లాల్‌దర్వాజ సింహవాహిని శ్రీమహంకాళి ఆలయం, ఉప్పుగూడ మహంకాళి ఆలయం, గౌలిపురా మహంకాళి మాతేశ్వరి భారత మాత ఆలయం, సుల్తాన్‌షాహీ జగదాంబ ఆలయం, హరిబౌలి బంగారు మైసమ్మ ఆయం, బేలా ముత్యాలమ్మ ఆలయం, మీరాలంమండి మహకాళేశ్వరి ఆలయం, హరిబౌలి శ్రీఅక్కన్న మాదన్న దేవాలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి.

పాతబస్తీ బోనాల జాతరకు చాలా ప్రాధాన్యం ఉంది. పాతబస్తీ నుంచే కాకుండా నగరం, ఇతర జిల్లాల నుంచి కూడా భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికార, అనధికార ప్రముఖులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకోవడానికి తరలివస్తారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి.

భారీ బందోబస్తు

బోనాల జాతర సందర్భంగా దక్షిణ మండలం పోలీసులు భారీబందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. స్థానిక పోలీసులతోపాటు వివిధ జిల్లాల నుంచి అదనపు బలగాలను రప్పించారు. బోనాల జాతరలో మహిళా భక్తుల రద్దీ దృష్ట్యా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.

19 నుంచి బోనాల ఉత్సవాలు

ఈనెల 19న బోనాల ఉత్సవాలు ధ్వజారోహణ, శిఖరపూజతో ప్రారంభమవుతాయి. 21న శాలిబండ కాశీ విశ్వనాథ దేవాలయం నుంచి ఉమ్మడిదేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారిఘటాలు ఆలయాలకు చేరుకుంటాయి. 28న ఆదివారం బోనాల జాతర, 29న రంగం (భవిష్యవాణి) కార్యక్రమాలు ఉంటాయి. బోనాలరోజున వివిధ ప్రాంతాల నుంచి మహిళలు బోనం నెత్తిన ఎత్తుకుని వచ్చి ఆలయంలో అమ్మవారికి సమర్పిస్తారు. ఈ సందర్భంగా ఫలహార బండ్ల ఊరేగింపు, పోతరాజుల వీరంగం, డప్పుల దరువుతో అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తారు.


లాల్‌దర్వాజ మోడ్ వద్ద ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలతో అలంకరించిన కమాన్


కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కేటీఆర్

సుజయ్ కుటుంబాన్ని పరామర్శించిన కేటీఆర్

నార్సింగ్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఐటీశాఖ ఎలక్ట్రానిక్స్ డైరెక్టర్ సుజయ్ కారంపూరి తండ్రి ప్రొఫెసర్ సుభాష్ మంగళవారం రాత్రి మృతిచెందారు. బుధవారం మాజీ ఐటీ శాఖమంత్రి కేటీఆర్.. ఆయన ఇంటికి వెళ్లి కారంపూడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మీ కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ప్రొఫెసర్ సుభాష్ సుదీర్ఘ కాలం పాటు కాకతీయ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా సేవలందించారని కేటీఆర్ కొనియాడారు.

'గోషామహల్ నియోజకవర్గానికి అధికారికంగా ఇన్‌చార్జిని ప్రకటించాలి'

గోషామహల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): గోషామహల్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ పరిస్థితి అత్యంతదారుణంగా ఉందని, పార్టీలో ఉన్న కొందరు నాయకులు ఇతర పార్టీలోకి వెళ్లగా, ఉన్న నాయకులు తామే నియోజకవర్గ ఇన్‌చార్జీలమంటూ లెటర్ హెడ్ తయారు చేసుకుని చెలామణి అవుతున్నారని ఆ పార్టీ నాయకుడు ఎం. ఆనంద్‌కుమార్ అన్నారు. బుధవారం నందినిహిల్స్‌లోని కార్యాలయంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిపై ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా గోషామహల్ నియోజకవర్గానికి అధికారికంగా ఇన్‌చార్జి పేరును ప్రకటించాలని కోరారు.

మైనర్‌పై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

మదీన, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మైనర్‌పై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిని బండ్లగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ కె. సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. బండ్లగూడ హాషమాబాద్‌కు చెందిన దస్తగిరి(22), అదే ప్రాంతంలో ఉండే ఓ బాలికకు మాయమాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, బుధవారం నిందితుడు దస్తగిరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

బర్కత్‌పురా, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. బుద్వేలు, ఉందా నగర్ రైల్వే స్టేషన్ల నడుమ 41 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి బుధవారం రాత్రి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎల్లప్ప తెలిపారు.

ప్రయాణికురాలితో అసభ్య ప్రవర్తన కండక్టర్‌పై కేసు.. రిమాండ్‌కు తరలింపు

హైదరాబాద్ సిటీ, జూలై 17(ఆంధ్రజ్యోతి): సిటీ బస్సులో మహిళా ప్రయాణికురాలితో అసభ్యంగా ప్రవర్తించిన కండక్టర్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈనెల 16న మణికొండలో ఓ ప్రయాణికురాలితో కండక్టర్ అసభ్యంగా ప్రవర్తించాడు. బాధిత యువతి అందుకు సంబంధించిన పోస్టును సోషల్ మీడియాలో పెట్టింది. విషయం తెలుసుకున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్ విచారణ జరిపించారు. విచారణలో కండక్టర్ ప్రవర్తన అసభ్యంగా ఉన్నట్లు తేలడంతో రాయదుర్గం పోలీసులు కొత్త చట్టం ప్రకారం కేసు నమోదు చేసి బుధవారం అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.

మత్స్యకారుల అభివృద్ధికి సీఎం రేవంత్ కృషి

ఫిష్ మార్కెట్లో తనిఖీలు చేసిన చైర్మన్ మెట్టు సాయికుమార్

గోషామహల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో మత్స్యకారుల అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. బుధవారం మత్స్యశాఖ మార్కెటింగ్ కాంప్లెక్స్‌ను వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫిష్ మార్కెట్ కాంప్లెక్స్‌లో వ్యాపారులు కొనుగోలుదారుల పట్ల ఏ విధంగా వ్యవహరిస్తున్నారు.. చేపల ధరలు, అధికారుల పనితీరు వంటి అంశాలపై ఆయన పరిశీలించారు. అనంతరం మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ ఫిష్ మార్కెట్‌కు వచ్చే కొనుగోలుదారులకు తక్కువ ధరలో నాణ్యమైన చేపలు, రొయ్యలు, పీతలు, అందించేలా వ్యాపారులు కృషి చేయాలన్నారు. దళారుల ఆటకట్టించేందుకు మత్స్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

పీహెచ్‌ఐఎన్ డెఫ్ స్కూల్‌లో 'స్కిల్‌సాఫ్ట్' సదుపాయాలు

హైదరాబాద్ సిటీ, జూలై 17(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట్‌లోని పీపుల్ విత్ హియరింగ్ ఇంపెయిర్డ్ నెట్‌వర్క్(పీహెచ్‌ఐఎన్) డెఫ్ స్కూల్‌లో స్కిల్‌సాఫ్ట్ ఇండియా సంస్థ మెరుగైన మౌలిక సదుపాయాలను కల్పించింది. ఆన్‌లైన్ కంప్యూటర్ ల్యాబ్, డిజిటల్ క్లాస్ రూంలు ఏర్పాటు చేయగా స్కిల్‌సాఫ్ట్ వైస్ ప్రెసిడెంట్, జనరల్ మేనేజర్ రామకృష్ణన్ బుధవారం ప్రారంభించారు. పాఠశాలలోని 120 మంది విద్యార్థులు, 10 మంది సిబ్బందికి ప్రయోజనం చేకూరనుంది. నూతన కంప్యూటర్ ల్యాబ్, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు విద్యార్థులకు మెరుగైన విద్యాబోధనకు ఉపకరించనుంది. నూతన సదుపాయాలతో పాఠశాలకు వార్షిక అద్దె ఖర్చు రూ.4 లక్షలు ఆదా అవుతుంది.

'పేదల పక్షాన పోరాడిన యోధుడు పండుగ సాయన్న'

హిమాయత్‌నగర్, జూలై16(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా మెరుగోనిపల్లి గ్రామంలో పుట్టిన పండగ సాయన్న నిజాం పాలనకు వ్యతిరేకంగా, పేదల పక్షాన పోరాడారని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ అన్నారు. హైదర్‌గూడలోని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం సాయన్న జయంతి వేడుకలు నిర్వహించగా, బల్ల సత్తయ్య, యాదగిరి, కనకయ్య, కృపాసాగర్ తదితరులు సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.


ఎస్‌బీఐ హైదరాబాద్ సర్కిల్ ఆధ్వర్యంలో సైక్లోథాన్‌ను బుధవారం నెక్లెస్ రోడ్డు పీవీ జ్ఞాన్ భూమి వద్ద ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేశ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ఇందులో 2023 బ్యాచ్‌కు చెందిన ప్రొహిబిషరీ అధికారులు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.
- అఫ్జల్‌గంజ్, (ఆంధ్రజ్యోతి)

సెయిలింగ్‌లో అష్రఫ్, అఖిలకు స్వర్ణాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలంగాణ మాన్‌సూన్ రెగెట్టా పోటీల్లో హాఫ్ రిగ్ ఫ్లీట్‌లో హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ అష్రఫ్, కొప్పుల అఖిల స్వర్ణ పతకాలు సాధించారు. బుధవారం హుస్సేన్ సాగర్‌లో జరిగిన ఈ పోటీల్లో అష్రఫ్ స్వర్ణం నెగ్గగా, నల్లగుట్ట ప్రభుత్వ పాఠశాలకు చెందిన యువరాజ్ రజతం, ఉద్భవ్ స్కూల్‌కు చెందిన పార్థు కాంస్యం గెలిచారు. బాలికల హాఫ్ రిగ్ ఫ్లీట్‌లో అఖిల స్వర్ణం సాధించగా, ముషీరాబాద్‌కు చెందిన నిఖిత రజతంతో మెరిసింది.


సెయిలర్ అష్రఫ్

పోలీస్ స్టేషన్ లాకప్‌లో యువకుల రీల్స్

స్నేహితుడిని కలవడానికి వచ్చి అత్యుత్సాహం... ముగ్గురిపై కేసు నమోదు

మదీన, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ముగ్గురు యువకులు అత్యుత్సాహం ప్రదర్శించి పోలీస్ స్టేషన్‌లో లాకప్‌లో సెల్‌ఫోన్‌లో వీడియో (రీల్స్) తీశారు. ఆ వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేయగా అది కాస్త వైరల్ కావడంతో ముగ్గురిపై బండ్లగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. హషమాబాద్‌కు చెందిన దస్తగిరిని బాలిక కిడ్నాప్ కేసులో పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తీసుకొచ్చి లాకప్‌లో ఉంచారు. దస్తగిరిని కలవడానికి స్నేహితులు మునీరుద్దీన్ ముదష్షిర్ (22), షేక్ సులేమాన్(21), ముబారక్ బిన్ అబ్దాద్(22) ఈ నెల 16న పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. ఆ సమయంలో స్టేషన్‌లో సిబ్బంది తక్కువగా ఉన్నారు. ఇదే అదనుగా భావించి, లాకప్‌లో ఉన్న స్నేహితుడు దస్తగిరితో మాట్లాడుతుండగా ముదష్షిర్ తన సెల్‌ఫోన్‌లో రీల్ చేసి, ఆ వీడియోను తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశాడు. అది కాస్త సోషల్ మీడియాలో వైరల్ అయింది. విషయం తెలుసుకున్న పోలీసులు బుధవారం ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారికి నోటీసులు ఇచ్చి పంపించినట్లు తెలిసింది. పోలీస్ స్టేషన్‌లో రీల్స్ చేయడం... దాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం ఏమిటని... పోలీస్‌స్టేషన్ అంటే అంత చులకనగా మారిందా అని ప్రజలు చర్చించుకుంటున్నారు.



మాట్లాడుతున్న రమావత్ అంజయ్యనాయక్

గిరిజన చట్టాలను అమలు చేయాలి

రాజేంద్రనగర్, జూలై 17(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో గిరిజన సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం రాజేంద్రనగర్‌లోని సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో గిరిజన సమాఖ్య రంగారెడ్డి జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకొన్నారు. రంగారెడ్డి జిల్లా తెలంగాణ గిరిజన సమాఖ్య అధ్యక్షుడిగా ఏ రాజూ నాయక్, ప్రధాన కార్యదర్శిగా జర్పుల శివనాయక్(ప్రచండ) ఎంపికయ్యారు. ఉపాధ్యక్షుడిగా జి.శంకర్ నాయక్, సహాయకార్యదర్శిగా బి.భిక్షునాయక్, కోశాధికారిగా చత్రునాయక్, కార్యవర్గం, కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అనంతరం అంజయ్య నాయక్ మాట్లాడుతూ దేశంలో గిరిజన చట్టాలను అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం తాత్సారం చేస్తుందని ఆరోపించారు. దాంతో దేశ వ్యాప్తంగా గిరిజనులపై దాడులు జరుగుతున్నాయన్నారు. గిరిజన సంక్షేమం, అభివృద్ధికి కావాల్సిన చట్టాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, పానుగంటి పర్వతాలు, హరిసింగ్ నాయక్, ఎ.రాజు నాయక్ పాల్గొన్నారు.


ఆడాల శివ కుమార్‌కు నియామపత్రం అందజేస్తున్న అధ్యక్షుడు సంజీవరెడ్డి

ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శిగా శివకుమార్ నియామకం

చాంద్రాయణగుట్ట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఐఎన్‌టీయూసీ) రాష్ట్ర కార్యదర్శిగా ఉప్పుగూడకు చెందిన ఆడాల శివకుమార్ నియమితులయ్యారు. బుధవారం ఐఎన్‌టీయూ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డి ఆయనకు నియామకపత్రం అందజేశారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నెరవేరుస్తానని, కార్మికుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని శివకుమార్ తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చాంద్రాయణగుట్ట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఫలక్‌నుమా సబ్ డివిజన్ పరిధిలో వివిధ పనుల నిమిత్తం విద్యుత్‌సరఫరా నిలిపేస్తున్నామని ఏడీఈ మధుసూదన్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పోలీస్ క్వార్టర్స్, మేకలబండ, ఆలియాబాద్, లాల్‌దర్వాజ, ఖిల్వత్, శాలిబండ, రాంబక్షి బండ, లాల్‌దర్వాజ మోడ్, సుధా టాకీస్, హరిబౌలి, ఆర్యమైదాన్ ప్రాంతాలలో, మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు ఆలియాబాద్, శంషీర్‌గంజ్, ఛత్రినాక, బోయగూడ, శ్రీరాంనగర్, మక్తూమ్‌పురా, గౌలిపురా, మురాద్ మహల్, బాలాగంజ్, లాల్‌దర్వాజ ప్రాంతాల్లో.. మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు జంగమ్మెట్, ఫలక్‌నుమా, ఖాద్రిచమన్, శివాజీనగర్, రాజన్నబౌలి, ఆలియాబాద్, శంషీర్‌గంజ్, ఇంజన్‌బౌలి, జీఎం చావుని, ఛత్రినాక, కందికల్‌గేట్, వీవీ నగర్, అయోధ్యనగర్, హనుమాన్ నగర్, ఉప్పుగూడ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ తెలిపారు.

రూ. 3.06 కోట్లు దండుకున్న కిలాడీ లేడి

హైదరాబాద్ సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): అధిక మొత్తంలో లాభాలు వస్తాయని నమ్మించి ఓ వ్యక్తిని మోసం చేసి అతడి నుంచి రూ.3.06 కోట్లు కాజేసిన కిలాడీ లేడీని సైబరాబాద్ ఆర్థికనేరాల విభాగం అధికారులు అరెస్టు చేశారు. శేరిలింగంపల్లి, నల్లగండ్ల ప్రాంతానికి చెందిన పానుగంటి ఇందిరాదేవిరెడ్డి (29) అలియాస్ ఇందిరాదేవి కొన్నేళ్లుగా మోసాల బాట పట్టింది. ఎన్నారైగా బిల్డప్ ఇస్తూ.. బ్యూటీ పార్లర్ నిర్వహిస్తున్నట్లు ప్రచారం చేసింది. నాగోల్‌లో దేవి ఫుడ్స్ పేరిట ఫుడ్ ఇండస్ట్రీ కూడా ఉందని అమాయకులను నమ్మించింది. నార్సింగి, మాదాపూర్, గచ్చిబౌలిలో గేటెడ్ కమ్యూనిటీల్లో తనకు విల్లాలు, ఆస్తులున్నాయని, నాగోల్‌లో అపార్టుమెంట్ కూడా ఉందని అమాయకులను బురిడీ కొట్టించింది. మదీనాగూడకు చెందిన ఎస్. సత్యనారాయణతో పరిచయం పెంచుకున్న ఆమె.. తన వ్యాపారాల్లో పెట్టుబడులు పెడితే భారీగా లాభాలు వస్తాయని నమ్మించింది. సత్యనారాయణ రూ. 3.06 కోట్ల పెట్టుబడి పెట్టాడు. బాధితుడికి సంబంధించిన రెండు కార్లను కూడా తీసుకెళ్లి తనఖా పెట్టింది. ఇద్దరు స్నేహితులను తీసుకొచ్చి పోలీసు అధికారులుగా పరిచయం చేసి వారి కోసం రెండు ఐఫోన్‌లు, వన్‌ప్లస్ ఫోన్‌లు సత్యనారాయణతో కొనుగోలు చేయించి తీసుకుంది. మోసపోయానని గ్రహించిన బాధితుడు డబ్బు, కార్లు తిరిగి ఇవ్వమని ఆమెను అడిగాడు. డబ్బు విషయం మరిచిపోవాలని, అడిగితే తప్పుడు కేసుల్లో ఇరికిస్తానని బ్లాక్‌మెయిల్ చేయసాగింది. బాధితుడు సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మహిళను అరెస్టు చేసి ఆమె నుంచి రెండు కార్లు, 3 ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు.

రూ. 5.73 లక్షలు కాజేసిన సైబర్ నేరగాడు

హైదరాబాద్ సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం పేరుతో ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతూ అమాయకుల నుంచి రూ. లక్షల్లో కొల్లగొడుతున్న సైబర్ నేరగాడి ఆటకట్టించారు సిటీ సైబర్‌క్రైమ్ పోలీసులు. ఖమ్మం జిల్లా ఇల్లందుకు చెందిన బింఢె పవన్‌కల్యాణ్‌ను అరెస్టు చేశారు. డీసీపీ ధార కవిత తెలిపిన వివరాల ప్రకారం నగరానికి చెందిన జగదీశ్ ఉద్యోగం కోసం వెతుకుతున్న క్రమంలో లోకల్ యాప్‌లో కన్సల్టెన్సీ మేనేజర్ పేరుతో ప్రకటన కనిపిం చగా అందులోని నంబర్‌కు ఫోన్ చేశాడు. అవతలి వ్యక్తి మాట్లాడుతూ.. మా వద్ద ఎంఎన్‌సీ కంపెనీల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్స్ ఉద్యోగం ఖాళీగా ఉందని, అయితే, బ్యాక్‌డోర్ ఉద్యోగాలు కావడంతో కొంత డబ్బు ఖర్చు అవుతుందని చెప్పాడు. ముందుగా రూ.2వేలు డిపాజిట్ చేయించుకున్నాడు. ఆ తర్వాత వివిధ రకాల ఫీజుల పేరుతో బాధితుడిని మభ్యపెట్టి దశల వారీగా రూ.5.73లక్షలు కొల్లగొట్టాడు. ఆ తర్వాత స్పందించడం మానేశాడు. అనుమానం వచ్చిన బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. సాంకేతికత ఆధారంగా నిందితుడు ఖమ్మం జిల్లా ఇల్లందుకు చెందిన బింఢె పవన్ కల్యాణ్‌గా గుర్తించి పోలీసులు అరెస్టు చేశారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యంతో లోకల్ యాప్‌లో క్యూటీఆర్ కంపెనీకి జాబ్ కన్సల్టెన్సీ మేనేజర్‌గా చెప్పుకుంటూ.. ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి ఆన్‌లైన్‌లోనే మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.


విఠలేశ్వర రుక్మాబాయి బ్రహ్మోత్సవాల్లో కార్పొరేటర్లు రాకేశ్‌జైశ్వాల్, శంకర్‌యాదవ్, ఆలయ అధ్యక్షులు కిషన్‌యాదవ్, పాండు యాదవ్

కనులపండువగా బ్రహ్మోత్సవాలు

అఫ్జల్‌గంజ్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మక శ్రీజంగల్ విఠోబా దేవస్థానం ఆధ్వర్యంలో విఠలేశ్వర, రుక్మాబాయి బ్రహ్మోత్సవాలు కనులపండువగా కొనసాగుతున్నాయి. బుధవారం ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, గణపతిపూజ, హారతి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాంబాగ్ కార్పొరేటర్ రాకేశ్ జైశ్వాల్, బేగంబజార్ కార్పొరేటర్, ఆలయ కమిటీ చైర్మన్ జి.శంకర్ యాదవ్, అధ్యక్షుడు వి.కిషన్‌యాదవ్, కోశాధికారి వి.పాండు యాదవ్, ఉపాధ్యక్షులు సత్యప్రకాశ్‌రెడ్డి, కె.గోవింద్‌రాజ్ మహరాజ్, జనరల్ సెక్రటరీ పి.మాణిక్‌రావు తదితరులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బోనాల జాతరను ప్రశాంతంగా నిర్వహించాలి

● కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



జాతర ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

సికింద్రాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి బోనాల జాతరను ప్రశాంతంగా నిర్వహించాలని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ ఉజ్జయినీ మహాకాళి ఆలయాన్ని సందర్శించి ఆలయ పరిసరాల్లో పర్యటించారు. జాతర సన్నాహాలపై జీహెచ్ఎంసీ, రెవెన్యూ, విద్యుత్, దేవాదాయ, వాటర్ బోర్డు, పోలీస్, రోడ్డు భవనాలు, వైద్య తదితర శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ నెల 21న జరిగే బోనాలు, 22న జరిగే రంగం(భవిష్యవాణి) అంబారీ ఊరేగింపు, మహాహారతి కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

పిల్లి తిన్నాకే..! ఘటనపై విచారణకు ఆదేశం

● కిటికీ తలుపులు వేయనందుకే వచ్చిందన్న ప్రిన్సిపాల్

హైదరాబాద్ సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూలోని మంజీరా హాస్టల్‌లో విద్యార్థులు తినాల్సిన ఆహారాన్ని పిల్లి తింటున్న వైనంపై వచ్చిన కథనానికి వైస్ చాన్స్‌లర్ బుర్రా వెంకటేశం స్పందించారు. తక్షణమే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా కళాశాల ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. వీసీ ఆదేశాల మేరకు కళాశాల ప్రిన్సిపాల్ జి.వి.నర్సింహారెడ్డితో పాటు హాస్టల్ వార్డెన్ దుర్గాకుమార్, కేర్‌టేకర్, ఇతర సిబ్బంది బుధవారం ఉదయం మంజీరా హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. జరిగిన ఘటనకు సంబంధించి విచారణ జరిపిన అనంతరం ప్రిన్సిపాల్ స్పందిస్తూ.. హాస్టల్ మెస్‌లో ఓ కిటికీ తెరిచి ఉన్న కారణంగా పిల్లి లోపలికి వచ్చిందని చెప్పారు. విద్యార్థుల భోజనాలు ముగిసిన తర్వాతనే వచ్చిందని, భోజన సమయంలో కాదని అన్నారు. వడ్డన సమయంలో ఎక్కువమంది సిబ్బంది, విద్యార్థులు ఉన్నందున ఆ సమయంలో పిల్లి అక్కడికి రాలేదని వెల్లడించారు. హాస్టల్ మెస్‌లోని ఆహార పదార్థాల్లో పిల్లి మూతి పెట్టింది అన్న అంశాన్ని ఫుడ్ సేఫ్టీ అధికారులు కూడా పరిశీలించారని ప్రిన్సిపాల్ చెప్పారు. వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న ఆహారాన్ని పిల్లి తినలేదని వారు చెప్పినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. సోషల్ మీడియాలో సంచలనం సృష్టించాలనే దురాలోచనతోనే కొందరు పిల్లి ఆహారం తింటున్న వీడియో పోస్టు చేశారని తమ దృష్టికి వచ్చిందన్నారు. విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఘనంగా బీబీకా ఆలం ఊరేగింపు

చార్మినార్/చాదర్‌ఘాట్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కర్బలా మైదానంలో ధర్మ పరిరక్షణ కోసం అసువులు బాసిన అమరులను స్మరిస్తూ షియాలు బుధవారం నిర్వహించిన మొహర్రం పదవ సంతాప దినం ఊరేగింపు ఆధ్యాత్మికతను చాటింది. పాతబస్తీ పురవీధులు ఆర్తనాదాలతో మార్మోగాయి. మధ్యాహ్నం 12.30 గంటలకు బీబీ కా అలవాలో చారిత్రక బీబీకా ఆలంను ప్రత్యేక ప్రార్థనల అనంతరం వజ్ర వైడూర్యాలతో అలంకరించి ఏనుగు అంబారీపై ప్రతిష్ఠించారు. బీబీకా అలవా నుంచి ఊరేగింపును ప్రారంభించారు. మత పెద్దల ప్రత్యేక ప్రార్థనల అనంతరం ముందుకు సాగింది. నల్లని వస్త్రాలు ధరించిన షియాలు సంతాప గీతాలు ఆలపిస్తూ దారి పొడవునా యా హుస్సేన్ యా అలీ అంటూ చురకత్తులు, బ్లేడ్లు, తల్వార్లతో తమ శరీరంపై బాదుకుంటూ రక్తాన్ని చిందించారు. భక్తులు బీబీకా ఆలంకు దట్టీలు సమర్పించారు. బీబీకా అలవా నుంచి షేక్ ఫైసీ కమాన్, బడాబజార్, యాకుత్‌పురా, మజీదే ఇత్తేబార్ చౌక్, ఆలీజా కోట్ల, సర్దార్ మహల్ మీదుగా చార్మినార్‌కు మధ్యాహ్నం 3 గంటలకు చేరింది. చార్మినార్ వద్ద ఏర్పాటు చేసిన వేదికపై తెలంగాణ చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి, నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, అదనపు కమిషనర్ విక్రమ్‌సింగ్ మాన్, ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ విశ్వప్రసాద్, ట్రాఫిక్ డీసీపీ వెంకటేశ్వర్లు, దక్షిణ మండలం డీసీపీ స్నేహ మెహరా బీబీకా ఆలంకు దట్టీలు సమర్పించారు. చార్మినార్ నుంచి ఊరేగింపు గుల్జార్‌హౌస్, ఖద్మె రసూల్ అషూర్‌ఖానా వద్దకు చేరుకుంది. పంజేషా, ఎతెబార్‌చౌక్, మీరాలం మండి, దారుల్‌షిఫా మీదుగా చాదర్‌ఘాట్ వరకు సాగింది. ఊరేగింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో దక్షిణమండలం డీసీపీ స్నేహమెహరా, భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. మీరాలంమండి వద్ద రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఫయీమ్ ఖురేషి, గాజుల అంజయ్య దట్టీలు సమర్పించారు.

● పాతబస్తీలోని డబీర్‌పుర నుంచి ప్రారంభమైన బీబీకా ఆలం ఊరేగింపు బుధవారం రాత్రి చాదర్‌ఘాట్‌లోని మూసీ ఒడ్డునున్న మజీద్-ఇ-ఇలాహీ వద్ద ప్రశాంతంగా ముగిసింది. సౌత్ జోన్ డీసీపీ స్నేహ మెహ్రా, సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్, టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాస్ ఊరేగింపుతో ముందుకు సాగగా, మలక్‌పేట ఏసీపీ శ్యాంసుందర్, చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ రాజు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

సైబర్ నేరగాళ్ల ఆటకట్టిస్తున్న పోలీసులు

● బ్యాంక్ ఖాతాలు ఫ్రీజ్ ● ఐదు కేసుల్లో రూ. 46.07 లక్షలు రికవరీ
● సకాలంలో ఫిర్యాదు చేస్తున్న బాధితులు ● న్యాయం చేస్తున్న సైబర్ క్రైమ్ పోలీసులు



హైదరాబాద్ సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రోజు రోజుకూ సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన పెరుగుతోంది. పొరపాటున సైబర్ క్రిమినల్స్ చేతికి చిక్కి డబ్బులు పోగొట్టుకుంటున్న బాధితులు నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్(ఎన్‌సీఆర్‌పీ), 1930 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తున్నారు. పోలీసులు సకాలంలో స్పందించి సాంకేతిక ఆధారాలు సేకరించి సైబర్ నేరగాళ్లు కొట్టేసిన సొత్తును ఎక్కడో ఒకచోట సైబర్ నేరగాళ్ల ఖాతాల్లో ఫ్రీజ్ చేసి బాధితులకు న్యాయం చేస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల సిటీ సైబర్ క్రైమ్‌లో నమోదైన 6 కేసుల్లో పోలీసులు మొత్తం రూ.38 లక్షలు ఫ్రీజ్ చేశారు. ఆ మొత్తాన్ని కోర్టు అనుమతితో బాధితుల ఖాతాల్లో జమ చేసినట్లు సైబర్ క్రైమ్ డీసీపీ కవిత ధార బుధవారం తెలిపారు.

● మొదటి కేసులో..

నగరానికి చెందిన ఓ వ్యక్తిని కేవైసీ అప్‌డేట్ పేరుతో మోసం చేసిన సైబర్ నేరగాళ్లు అతడి ఖాతా నుంచి రూ. 2లక్షలు కొల్లగొట్టారు. బాధితుడు ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లో ఫిర్యాదు చేశాడు. అప్రమత్తమైన ఎన్‌సీఆర్‌పీ నోడల్ టీమ్ సభ్యులు శ్రీకాంత్ నాయక్, మహ్మద్ జావిద్, నరేష్ కుమార్ సాంకేతిక ఆధారాలు సేకరించారు. రూ. 1,75,185 ఫ్రీజ్ చేశారు.

● రెండో కేసులో..

ముంబై క్రైమ్ బ్రాంచి పోలీసులం అంటూ మాట్లాడి, మనీల్యాండరింగ్ కేసులో మీ పాత్ర ఉందంటూ బెదిరించిన సైబర్ నేరగాళ్లు నగరవాసి నుంచి రూ. 5.90 లక్షలు కొల్లగొట్టారు. బాధితుడు ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లో ఫిర్యాదు చేశాడు. డ్యూటీ ఆఫీసర్ ఎండీ జావిద్ సాంకేతికత ఆధారంగా నేరస్థుల బ్యాంక్ ఖాతాలను ఫ్రీజ్ చేశారు. రూ. 4.73 లక్షలు రికవరీ చేశారు.

● మూడో కేసులో..

ఈ కేసులోనూ బాధితుడిని క్రైమ్ బ్రాంచి పోలీసులం అంటూ బెదిరించిన సైబర్ నేరగాళ్లు రూ. 20,08,900 కొల్లగొట్టారు. బాధితుడు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయగా.. సైబర్ క్రైమ్ పోలీసులు స్పందించి నేరస్థుల ఖాతాలను ఫ్రీజ్ చేశారు. బాధితుడు పోగొట్టుకున్న మొత్తం సొత్తు రికవరీ చేశారు.

● నాలుగో కేసులో..

ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్‌లో అధిక లాభాలు వస్తాయంటూ నమ్మించిన సైబర్ నేరగాళ్లు నగరానికి చెందిన మహిళ నుంచి రూ. 9.40 లక్షలు కొల్లగొట్టారు. బాధితురాలు ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు వెంటనే స్పందించి నేరస్థుల ఖాతాల్లో ఉన్న రూ. 1.50 లక్షలు ఫ్రీజ్ చేశారు.

● ఐదో కేసులో..

ముంబై క్రైమ్ బ్రాంచి పోలీసులం అంటూ మాట్లాడి మనీల్యాండరింగ్ కేసులు నమోదయ్యాయని బెదిరించిన సైబర్ నేరగాళ్లు అంబర్‌పేటకు చెందిన వ్యక్తి నుంచి రూ. 18లక్షలు కొల్లగొట్టారు. బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. టెక్నికల్ టీమ్ రంగంలోకి దిగి నేరస్థుల బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.18 లక్షలు ఫ్రీజ్ చేశారు. కోర్టు అనుమతితో ఆ మొత్తాన్ని బాధితుడి ఖాతాలో జమ చేసినట్లు డీసీపీ తెలిపారు.

కాకతీయంలో తెలంగాణ కళావైభవం

● మంత్రి జూపల్లి కృష్ణారావు



నర్తకీమణి పద్మజారెడ్డిని అభినందిస్తున్న మంత్రి జూపల్లి

రవీంద్రభారతి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కాకతీయ రాజవంశం కాలం నాటి ప్రాచీన నృత్య సంప్రదాయాలను పునరుద్ధరించడంలో భాగంగా ప్రదర్శించిన కాకతీయం నృత్యరూపకం ప్రేక్షకుల్ని సమ్మోహన పరిచింది. కాకతీయ కళాఖ్యాతిని చాటుతూ సాగిన నృత్యనాటకం ఆహుతుల్ని మైమరిపించింది. ప్రముఖ నర్తకీమణి పద్మశ్రీ డాక్టర్ పద్మజారెడ్డి ప్రతిష్టాత్మకంగా రూపొందించిన కాకతీయం పార్ట్-3 నృత్యరూపకాన్ని బుధవారం రవీంద్రభారతిలో ప్రదర్శించారు. గత పదేళ్లుగా విస్తృత పరిశోధనలు చేసి తీర్చిదిద్దిన కాకతీయం రెండు భాగాలను ఇటు భారతదేశం, అటు అమెరికాలోని పలు వేదికలపై ప్రదర్శించి అభినందనలు అందుకున్న నర్తకి పద్మజారెడ్డి, సుసంపన్నమైన వారసత్వం, సుందరమైన నృత్య ప్రక్రియలను ప్రోత్సహించడంలో భాగంగా కాకతీయం పార్ట్-3ని ప్రదర్శించారు. ఈ నృత్యరూపకానికి పద్మజారెడ్డి నృత్యదర్శకత్వం వహించడంతో పాటు రుద్రమదేవి పాత్రలో నాట్యం చేశారు. డా.పప్పు వేణుగోపాలరావు రచించిన ఈ నృత్యరూపకానికి పద్మశ్రీ ఎల్లా వెంకటేశ్వర్లు సంగీతం అందించారు. ఐవీ రేణుకాప్రసాద్ నటువాంగం, గణేశరావు మృదంగం వాయించగా, జ్ఞానప్రసూన నరేష్ గానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు. నర్తకి పద్మజారెడ్డితో పాటు కళాకారులను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాకతీయం నృత్యరూపకంలో తెలంగాణ కళావైభవం కనిపిస్తోందన్నారు. తెలంగాణతో పాటు అన్ని రాష్ట్రాలు, దేశాల్లోనూ ఈ రూపకాన్ని ప్రదర్శించాలని, తెలంగాణ ప్రభుత్వం సహకారం అందజేస్తుందని తెలిపారు. కాకతీయం నృత్యాన్ని తెలంగాణ నృత్యంగా గుర్తింపు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఐసీసీఆర్ విశ్రాంత డైరెక్టర్ జనరల్ రాజశేఖర్, సీఎం ఓఎస్‌డీ వేముల శ్రీనివాసులు, కళ పత్రిక సంపాదకులు మహ్మద్ రఫీతో పాటు పలువురు ప్రముఖులు పద్మజారెడ్డిని అభినందించారు.

రైల్వే ప్రాజెక్ట్ పనులు పూర్తి చేయాలి : ఈటల



అరుణ్‌కుమార్ జైన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఈటల

హైదరాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలో ప్రతిపాదించిన రైల్వే అభివృద్ధి ప్రాజెక్టులను చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌ను కోరారు. ప్రజల నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకు చేపట్టాల్సిన రైల్వేస్టేషన్లు, రైల్ అండర్ బ్రిడ్జిలు, రైల్ ఓవర్ బ్రిడ్జిల పనులపై ఈటల బుధవారం రైల్ నిలయంలో జీఎం అరుణ్‌కుమార్‌తో చర్చించారు. ప్రధానంగా అల్వాల్ లెవల్ క్రాసింగ్4 గేట్ వద్ద రైల్వేస్టేషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. సుచిత్ర సర్కిల్‌లో రైల్వే బ్రిడ్జి వెడల్పు పనులను చేపట్టాలని, హైవేకు ఇరువైపులా రైల్వే పట్టాలపై సర్వీస్ రోడ్డు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. నేరేడ్‌మెట్-మౌలాలి రోడ్‌లోని అమ్ముగూడ లెవల్ క్రాసింగ్ వద్ద నిలిచిపోయిన రైల్ అండర్ బ్రిడ్జి పనులు పూర్తి చేయాలన్నారు.

'గద్దర్ ఆశయాలను కొనసాగిస్తాం'

పంజాగుట్ట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ప్రజాయుద్ధనౌక గద్దర్ ఆశయాలను కొనసాగిస్తామని వక్తలు పేర్కొన్నారు. గద్దర్ ఫౌండేషన్ చైర్మన్ గుమ్మడి సూర్యకిరణ్ అధ్యక్షతన బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆగస్టు 6న రవీంద్రభారతిలో గద్దర్ ప్రథమ వర్థంతి సందర్భంగా నిర్వహించనున్న సభ సన్నాహక సమావేశం జరిగింది. ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల వేదిక నాయకుడు గాదె ఇన్నయ్య, సీనియర్ పాత్రికేయుడు పాశం యాదగిరి, ఏపూరి సోమన్న, లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు భూక్యా కోట్యా నాయక్, పృథ్వీరాజ్ యాదవ్, ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్, కె.హెచ్.రాందాస్, తదితరులు మాట్లాడారు. గద్దర్‌తో తమకు ఉన్న అనుబంధం, అనుభవాలను వారు పంచుకున్నారు.

ధూల్‌పేట గల్లీగల్లీలో సోదాలు

(3వ పేజీ తరువాయి)

పోలీసులు రెండు నెలల నుంచి నిరంతర దాడులు నిర్వహిస్తున్నారు.

గంజాయి నిర్మూలనే లక్ష్యంగా ..

నార్కోటిక్ డ్రగ్‌గా ఉన్న గంజాయిని అరికట్టి గంజాయి నుంచి ధూల్‌పేట వాసులను రక్షించడానికి ఎక్సైజ్ శాఖ కమిషనర్ శ్రీధర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డిలు ప్రత్యేక దాడులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ మేరకు రెండు నెలల నుంచి ఎక్సైజ్ శాఖ పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ స్టేట్ టాస్క్‌ఫోర్స్, జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు 120 మంది సిబ్బందితో కలిసి 8 బృందాలుగా ఏర్పడి, 37ప్రాంతాల్లో గల్లీగల్లీలో, ఇంటింటికి సోదాలు నిర్వహిస్తున్నారు. గంజాయి అమ్మకందార్లు, కొనుగోలుదారులను కొందరిని గుర్తించి మూడు రోజుల పాటు కౌన్సెలింగ్ నిర్వహించారు. గంజాయిని వినియోగిస్తున్న యువతకు, వారి తల్లిదండ్రులకు దానివల్ల కలిగే నష్టాలు, కొత్తగా వచ్చిన చట్టాల వల్ల కలిగే ఇబ్బందులపై అవగాహన కల్పించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ జాయింట్ కమిషనర్లు ఖురేషి, శాస్త్రితో పాటు అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కుమార్, ఏఈఎస్‌లు శ్రీనివాసరావు, సౌజన్య, ధూల్‌పేట్ సీఐ మధుబాబుతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆధ్వర్యంలో..

హైదరాబాద్ ఎక్సైజ్ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ హెడ్ అంజిరెడ్డి ఆధ్వర్యంలో ఐదు బృందాలతో 50 మందికి పైగా ఎస్టీఎఫ్, డీటీఎఫ్, ఎన్‌ఫోర్స్ యంత్రాంగం కలిసి ధూల్‌పేటలో దాడులు నిర్వహించారు. బుధవారం రాత్రి 11 గంటల వరకు నిర్వహించిన దాడుల్లో 2 కేజీల గంజాయిని పట్టుకొని ఇద్దరిని అరెస్టు చేశారు. గంజాయి అమ్మకాలు, రవాణా, వినియోగం అంతం అయ్యేవరకు నిరంతర దాడులు నిర్వహించడానికి ఎక్సైజ్ శాఖ ప్రణాళికలు రూపొందించింది.

ఇద్దరు పంచాయతీ కార్యదర్శులపై కేసు నమోదు

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నిబంధనలను అతిక్రమించిన ఇద్దరు గ్రామ పంచాయతీ కార్యదర్శులపై అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. స్థానికుల ఫిర్యాదుతో అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు మండల పంచాయతీ అధికారి వినోద కార్యదర్శులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. తారామతిపేట గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 215, 16, 17 నిషేధిత భూదాన్ భూమిలో పంచాయతీ కార్యదర్శి రాజేష్ 21 ఇంటి నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేశాడు. సర్వేనంబర్ 469లో నిర్మించిన భారీ ఫంక్షన్‌హాల్‌కు అనుమతులతో పాటు ఇంటి నంబర్లను కేటాయించాడు. బాటసింగారం గ్రామ పరిధిలోని సింగరేణి కాలనీలో ఖాళీ స్థలాలకు(ఓపెన్‌ప్లాట్లకు) ఇంటి నంబర్లను కేటాయించి గ్రామపంచాయతీకి ట్యాక్స్ కట్టించారు. రెండు గ్రామాల్లో స్థానికులు పంచాయతీ కార్యదర్శులపై కలెక్టర్‌తో పాటు జిల్లా, మండల అధికారులకు ఫిర్యాదు చేశారు. జిల్లా అధికారులు విచారణకు ఆదేశించారు. కార్యదర్శులు నిబంధనలు అతిక్రమించినట్లు తేలింది. అదనపు కలెక్టర్ ఆదేశాలతో బుధవారం ఎంపీవో కార్యదర్శులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



మెడికవర్ ఆస్పత్రిలో హెయిర్, ఫేస్ క్లినిక్ ప్రారంభోత్సవంలో సినీనటి సిమ్రాన్, సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డా.శరత్‌రెడ్డి, డాక్టర్లు

మెడికవర్ ఆస్పత్రిలో అత్యాధునిక హెయిర్, ఫేస్ క్లినిక్

● ప్రారంభించిన సినీనటి సిమ్రాన్

హైదరాబాద్ సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కోరుకున్న రూపం ఆత్మవిశ్వాసం పెంచేందుకు దోహదం చేస్తుందని సినీనటి సిమ్రాన్ చౌదరి అన్నారు. హైటెక్‌సిటీలోని మెడికవర్ ఆస్పత్రిలో అత్యాధునిక హెయిర్, ఫేస్ క్లినికల్ సర్వీసెస్‌ను బుధవారం ఆమె ప్రారంభించారు. క్లినికల్ సర్వీసెస్ డైరెక్టర్, సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డా.శరత్‌రెడ్డి మాట్లాడుతూ అసాధారణమైన సేవలను అత్యంత సంరక్షణతో అందించడమే క్లినిక్ లక్ష్యమన్నారు. ప్లాస్టిక్, కాస్మెటిక్, హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డా.రాజశేఖర్ మాదల మాట్లాడుతూ ప్రపంచ స్థాయి సౌందర్య సేవలను అందించాలనే లక్ష్యం దిశగా క్లినిక్ ముందడుగు వేస్తుందన్నారు. కన్సల్టెంట్ డెర్మటాలజిస్ట్ డా.బి.విజయశ్రీ, ప్లాస్టిక్ సర్జన్ డి.మధువినయ్ కుమార్ మాట్లాడుతూ వినూత్న చికిత్సలు అందించేందుకు తమ బృందం కట్టుబడి ఉందన్నారు. మెడికవర్ ఆస్పత్రి ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హరికృష్ణ, చీఫ్ ఆఫ్ బిజినెస్ ఆపరేషన్స్ మహేష్ దెగ్లూర్కర్, డా.కొప్పిశెట్టి సత్యనాగరవితేజ పాల్గొన్నారు.

పీపీపీ పద్ధతిలో ఎలివేటెడ్ కారిడార్లు.?

(3వ పేజీ తరువాయి)

కీలకంగా మారనుంది. ఆ నివేదిక ఆధారంగానే ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణంపై స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి. హైదరాబాద్-కరీంనగర్ మార్గంలో సికింద్రాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్ నుంచి శామీర్‌పేట వరకు 18.1 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ కారిడార్‌ను ఆరు లేన్లతో నిర్మించాలని ప్రతిపాదించారు. ఈ నిర్మాణానికి 192.20ఎకరాల భూమి అవసరం ఉండగా, ఇందులో 113.48ఎకరాల వరకు డిఫెన్స్ భూములు, 83.72ఎకరాల వరకు ప్రైవేట్ భూములున్నాయి. ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి రూ.2,232కోట్ల వ్యయం అంచనా వేసి ఆ మేరకు పాలనాపరమైన అనుమతులిచ్చారు. అదేవిధంగా హైదరాబాద్-నాగ్‌పూర్ మార్గంలో సికింద్రాబాద్‌లోని ప్యారడైజ్ నుంచి కొంపల్లి అవతల వరకు ఆరు లేన్లుగా విస్తరించనున్నారు. ఆ మార్గంలో ముఖ్యమైన ప్రాంతాలైన తాడ్‌బండ్ జంక్షన్, బోయినపల్లి జంక్షన్‌లతో కలిపి 5.320 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించేందుకు రూ.1,580 కోట్ల వ్యయ అంచనాకు ప్రభుత్వం పాలనాపరమైన అనుమతులిచ్చింది. ఇందులో 600 మీటర్ల మేర బేగంపేట ఎయిర్‌పోర్టు వద్ద అండర్ గ్రౌండ్ టన్నెల్ ఏర్పాటు చేయనున్నారు. అయితే ప్యారడైజ్ నుంచి కొంపల్లి అవతల డెయిరీ ఫామ్ వరకు గల 18.35కిలోమీటర్లలో ఇప్పటికే సుచిత్ర జంక్షన్, పేట్ బషీర్‌బాద్, కొంపల్లి జంక్షన్లలో దాదాపు 5 కిలోమీటర్లకు పైగా ఫ్లై ఓవర్ల నిర్మాణాన్ని ఎన్‌హెచ్ఏఐ చేపట్టింది. మిగతా మార్గాన్ని పూర్తి చేసేందుకు హెచ్ఎండీఏ చర్యలు చేపట్టింది. 5.320కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి 73.16ఎకరాల భూమి అవసరముండగా, 55.85ఎకరాలను డిఫెన్స్ నుంచి 8.41ఎకరాలు ప్రైవేటు వ్యక్తుల నుంచి సేకరించాల్సి ఉన్నది.

పీపీపీ పద్ధతిలో నిర్మాణానికి అధ్యయనం

రెండు ఎలివేటెడ్ కారిడార్లను పీపీపీ పద్ధతిలో నిర్మాణం చేయడానికి అధ్యయనం చేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఓ కన్సల్టెన్సీని ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. కన్సల్టెన్సీ ద్వారా ఈ రెండు మార్గాల్లో పూర్తి స్థాయిలో సర్వే చేయనున్నారు. వాహనాల రాకపోకలను, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణ వ్యయాన్ని అంచనా వేయనున్నారు. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్ నుంచి శామీర్‌పేట వరకు 18.1 కిలోమీటర్ల మార్గంలో ఆదాయం వచ్చేందుకు గల అవకాశాలను పరిశీలన చేయనున్నారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్‌లో అయితే నిర్మాణానికి సాధ్యాసాధ్యాలపై కన్సల్టెన్సీ పూర్తిస్థాయిలో నివేదిక అందజేయాల్సి ఉంటుంది. క్షేత్రస్థాయిలో సర్వే చేసి ఆదాయ, వ్యయాలను అంచనా వేసేందుకు నిర్ణీత గడువు కూడా మూడు నెలలిచ్చారు. ఈ విధంగా రెండు ఎలివేటెడ్ కారిడార్లకు వేర్వేరుగా రెండు కన్సల్టెన్సీలను ఆహ్వానించారు. ఆయా కన్సల్టెన్సీలు అందజేసే నివేదిక ఆధారంగానే ఏ పద్ధతిలో ప్రభుత్వం ప్రాజెక్టును నిర్మాణం చేస్తుందో స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి. ఈ రెండు ప్రాజెక్టులను చేపట్టేందుకు రూ.3,812కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం పాలనా అనుమతులిచ్చినా.. కన్సల్టెన్సీలు అందించే నివేదిక ఆధారంగా వ్యయ అంచనాలు పెరిగితే మరోసారి పాలనాపరమైన అనుమతులివ్వాల్సి ఉంటుంది.

అక్క భర్తతో ప్రేమాయాణం

● కుటుంబసభ్యులు వద్దన్నందుకు ఆత్మహత్యాయత్నం
● చికిత్స పొందుతూ మృతి



ఇందిర(ఫైల్)

హయత్‌నగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): అక్క భర్తను ప్రేమించింది. బావ ఇంటికే వెళ్లింది. కుటుంబసభ్యులు సర్ది చెప్పి పంపించేందుకు ప్రయత్నించగా పురుగుల మందు తాగింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా వేటపాలెంకు చెందిన పాములపాటి ప్రసాద్ తాపీ మేస్త్రీ. కుటుంబ సభ్యులతో కలిసి రెండు సంవత్సరాల క్రితం కోహెడ గ్రామానికి వలస వచ్చి ఔటర్ రింగ్ రోడ్డు వద్ద గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారు. ఈయనకు ఇద్దరు కుమార్తెలు. పెద్దకుమార్తె తిరుపతమ్మను బాపట్ల జిల్లా కారంచేడు మండలం, స్వర్ణ గ్రామానికి చెందిన కొమరగిరి కల్యాణ్‌బాబు తాపీ మేస్త్రీకి ఇచ్చి వివాహం చేశారు. రెండో కుమార్తె ఇందిర(20) పదవతరగతి వరకు చదివి ఇంటి వద్దనే ఉంటున్నది. కల్యాణ్‌బాబు కూడా కుటుంబంతో కోహెడ గ్రామానికి వలస వచ్చి ఔటర్ రింగ్ రోడ్డు వద్ద గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో ఇందిర కల్యాణ్‌బాబును ప్రేమించింది. ఆదివారం అతడి ఇంటికి వెళ్లింది. ఇరువురి కుటుంబ పెద్దలు జోక్యం చేసుకుని ఇందిరను ఆమె ఇంటికి పంపేందుకు ప్రయత్నించారు. దీంతో ఇందిర సోమవారం ఉదయం 5 గంటలకు గుర్తు తెలియని పురుగుల మందు తాగింది. అపస్మారక స్థితికి చేరుకున్న ఆమెను కుటుంబసభ్యులు ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి ఏడుగంటలకు ఇందిర మృతిచెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు హయత్‌నగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కిమ్స్ ఆస్పత్రిలో అలర్జీ, అస్తమా క్లినిక్



అస్తమా క్లినిక్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ భాస్కర్‌రావు

రాంగోపాల్‌పేట్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ మినిస్టర్ రోడ్డులోని కిమ్స్ ఆస్పత్రిలో అలర్జీ, అస్తమా ఎక్సలెన్స్ సెంటర్‌ను ఆస్పత్రుల సీఎండీ డాక్టర్ భాస్కర్‌రావు బుధవారం ప్రారంభించారు. డాక్టర్ రమణ ప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో కిమ్స్ ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సంబిత్ సాహూ, పల్మోనాలజీ, ఈఎన్‌టీ వైద్యులు పాల్గొన్నారు.

'ఉస్మానియా'లో అరుదైన శస్త్ర చికిత్స

● తల్లి కాలేయాన్ని కుమారుడికి అమర్చిన వైద్యులు



కాలేయ మార్పిడి చేసుకున్న కుమారుడితో తల్లి

మంగళ్‌హట్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా ఆస్పత్రిలో బుధవారం మూడేళ్ల కుమారుడికి తల్లి కాలేయాన్ని అమర్చి వైద్యులు ప్రాణాలను కాపాడారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం కొండవనమాల గ్రామానికి చెందిన మోదుగు గుణశేఖర్, అమల దంపతులు. వీరి కుమారుడు మాస్టర్ చౌహాన్(3) పుట్టుకతోనే పిత్తాశయ ధమని, కాలేయ సమస్యలతో బాధపడుతున్నాడు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో చూపించినా ప్రయోజనం లేకపోవడంతో ఉస్మానియా ఆస్పత్రికి తీసుకువచ్చారు. సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ మధుసూదన్‌ను సంప్రదించారు. వైద్యులు చౌహాన్‌కు కాలేయ మార్పిడి చేయాలనడంతో తల్లి కాలేయాన్ని కుమారుడికి ఇచ్చేందుకు ఒప్పుకుంది. దీంతో సుమారు మూడు గంటల పాటు వైద్యులు శ్రమించి చౌహాన్‌కు శస్త్రచికిత్స విజయవంతం చేశారు. ప్రస్తుతం తల్లీకుమారుడు ఆరోగ్యంగా ఉన్నారు. వైద్యులను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్ అభినందించారు.

చిన్నారులను చంపేస్తున్నాయ్..!

(3వ పేజీ తరువాయి)

నిజాంపేట కార్పొరేషన్ పరిధిలో వీధి కుక్కల నియంత్రణకు స్వచ్ఛంద సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నాయి. వీధి కుక్కలను పట్టుకొని తీసుకెళ్లడం నుంచి శస్త్రచికిత్స(స్టెరిలైజేషన్), ఐదు రోజుల పాటు పర్యవేక్షణలో ఉంచడం, వాటికి అవసరమైన ఆహారం ఇవ్వడం ఎన్‌జీఓల బాధ్యత. ఇందుకుగాను ఒక్కో కుక్కకు రూ.1,500 నుంచి రూ.1,650 వరకు చెల్లిస్తున్నారు. బండ్లగూడ, మీర్‌పేట కార్పొరేషన్ల పరిధిలో యానిమల్ కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేసి.. అక్కడా వీధి కుక్కల నియంత్రణ బాధ్యతలు ఎన్‌జీఓకు అప్పగించారు. బోడుప్పల్, పీర్జాదిగూడ, బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్లు, జల్‌పల్లి, తుర్కయాంజల్, ఇబ్రహీంపట్నం, పెద్దఅంబర్‌పేట, ఆదిభట్ల తదితర మునిసిపాలిటీల్లో వీధి కుక్కల నియంత్రణ గాలికొదిలేశారు. దీంతో వాటి సంఖ్య క్రమేణా అధికమవుతోంది.

ఇలా...

● జీహెచ్ఎంసీ పరిధిలో గత పదేళ్లలో ఎనిమిది మంది చిన్నారులు వీధి కుక్కల దాడిలో మరణించారు.
● గ్రేటర్‌తోపాటు, పరిసర జిల్లాలకు చెందిన 3,36,767 మంది కుక్క కాటుతో నారాయణగూడలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్(ఐపీఎం)లో చికిత్స పొందారు. ఫీవర్ ఆస్పత్రిలో చికిత్స తీసుకున్న వారి సంఖ్య దీనికి అదనం.
● గత పదేళ్లలో కుక్కలకు సంబంధించి 3,60,469 ఫిర్యాదులు వచ్చాయి.

జీహెచ్ఎంసీలోనూ అంతే..

జీహెచ్ఎంసీలోనూ వీధి కుక్కల నియంత్రణ కాగితాలకే పరిమితమవుతోంది. ఏటా వేల సంఖ్యలో కుక్కలకు స్టెరిలైజేషన్, యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ చేస్తున్నామని అధికారులు చెబుతున్నా.. కుక్కల సంఖ్య గణనీయంగా పెరుగుతుండడం గమనార్హం. వాస్తవంగా నియంత్రణ చర్యలు చేపడితే.. ప్రతి ఏడాది కుక్కల సంఖ్య తగ్గాలి. గ్రేటర్‌లో అందుకు పూర్తి భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. 50 టీమ్‌ల ద్వారా నగరంలో కుక్కలను పట్టుకొని వ్యాక్సినేషన్, శస్త్రచికిత్సలు చేశామని బల్దియా వెటర్నరీ విభాగం చెబుతోంది. గత పదేళ్లలో 7.21 లక్షల కుక్కలకు స్టెరిలైజేషన్ చేశామని కాగితాల్లో చూపుతున్నారు. తదనుగుణంగానే కోట్లాది రూపాయలూ ఖర్చు చేశారు. కానీ, క్షేత్రస్థాయిలో కుక్కల సంఖ్య ఎక్కువగా కనిపిస్తుండడం గమనార్హం. ఇటీవల మణికొండ మునిసిపాలిటీలోని చిత్రపురికాలనీలో ఓ మహిళపై పదుల సంఖ్యలో కుక్కలు దాడికి యత్నించాయి. కొన్ని నిమిషాలపాటు వాటిని అదిలించిన ఆమె అదృష్టవశాత్తు బయటపడింది. ఆమె స్థానంలో చిన్నారులు ఉంటే పరిస్థితి ఎలా ఉండేదో..? గతేడాది ఫిబ్రవరిలో అంబర్‌పేటలో నాలుగేళ్ల బాలుడిని వీధి కుక్కలు దాడి చేసి చంపాయి. అంతకుముందు బంజారాహిల్స్‌లో నెలల చిన్నారి కుక్కల దాడిలో మరణించాడు.

శివారు ప్రాంతాల్లో కుక్కకాటు కేసుల్లో కొన్ని..

- దుండిగల్‌లోని బహదూర్‌పల్లి పదోవార్డులో ఇంట్లోకి చొరబడి రెండు సంవత్సరాల ఆరుషిని కుక్క కరిచింది.
- నిజాంపేట కార్పొరేషన్ పరిధిలోని విలేకరుల కాలనీలో సాయిచరణ్ (14)ను వెంబడించి వీధి కుక్క కరిచింది.
- బండారి లే అవుట్‌లోనూ చిన్నారి కుక్క కాటుకు గురైంది.
- కొంపల్లి మునిసిపాల్టీలో మే 31వ తేదీన సరితను కుక్క కరిచింది.
- మేడిపల్లిలో ఓ బాలుడిపై కుక్కలు దాడి చేశాయి. స్థానికులు సకాలంలో స్పందించడంతో ప్రాణాపాయం తప్పింది.
- పర్వతాపూర్ డంపింగ్ యార్డు సమీపంలోని బాలాజీ టౌన్‌షిప్‌లో తరచూ కుక్కకాటు ఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

కుక్కల బెడద ఎక్కువగా ఉన్న ప్రాంతాలు...

- బడంగ్‌పేట, మీర్‌పేట కార్పొరేషన్ల పరిధిలో: గుర్రంగూడ, నాదర్‌గుల్, మీర్‌పేట్, త్రివేణినగర్, జిల్లెలగూడ, బడంగ్‌పేట, బాలాపూర్.
- బోడుప్పల్, పీర్జాదిగూడ కార్పొరేషన్ల పరిధిలో: కేశవనగర్, బీఎల్ నగర్, చెంగిచెర్ల కబేళా, రాజీవ్‌నగర్, బొల్లిగూడ, కేశవనగర్.

వెంటపడి కరుస్తున్నాయి

ఇటీవల నన్ను కుక్క కరిచింది. కొంపల్లిలో కుక్కలు ఎక్కువగా ఉన్నాయని ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. సాయంత్రం, రాత్రి వేళల్లో బయటకు రావాలంటే భయపడాల్సిన పరిస్థితి. ఇక పాఠశాలలు, ట్యూషన్లకు వెళ్లి వచ్చే పిల్లలకు పెను ముప్పు పొంచి ఉంది. కుక్కల భయంతో పిల్లలను దగ్గరుండి తీసుకురావాల్సి వస్తోంది. రాత్రి వేళ వాహనాల వెంబడి పడుతున్నాయి.

- సరిత, కొంపల్లి

ఆంధ్రజ్యోతి
నవ్య 7
కుటుంబ కదంబం
గురువారం • 18 జూలై 2024

సెలబ్ ఫిట్

నటి మాత్రమే కాదు... మోడల్, డ్యాన్సర్, సింగర్, ప్రొడ్యూసర్. వెండితెరపైనే కాదు... నిజ జీవితంలోనూ విభిన్న పాత్రల్లో ఒదిగిపోతున్న అందాల తార ఆమె. చూడచక్కని రూపం... అద్భుతమైన నాట్యం... ప్రత్యేక పాటలకు పెట్టింది పేరు... నోరా ఫతేహి. 'ఎప్పుడూ ఇంత ఉత్సాహంగా... ఉల్లాసంగా కనిపిస్తారు... కారణమేంట'ని ఆ మధ్య ఎవరో అడిగితే... 'క్రమబద్ధమైన జీవనశైలి' అంటూ బదులిచ్చింది ఈ కెనడియన్ 'మనోహరి'.



మనోహరి

రాజమౌళి 'బాహుబలి'లో 'మనోహరి' పాటతో తెలుగువారికే కాదు... ప్రత్యేక పాటల తారగా అభిమానులకు దగ్గరైంది నోరా. అంతకముందు జూనియర్ ఎన్టీఆర్ 'టెంపర్'లో 'ఇట్టాగే రెచ్చిపోదాం' అంటూ కుర్ర హృదయాలను 'టెమ్ట్' చేసింది. 2014లో 'రోర్' చిత్రంతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన నోరా... ఆ మరుసటి ఏడాది 'బిగ్‌బాస్' హౌస్‌లో కనిపించింది. అదే ఆమెను అందరికీ పరిచయం చేసింది. తరువాత డ్యాన్స్ రియాలిటీ షో 'ఝలక్ దిక్ లాజా'లో పోటీపడింది. తరువాత అదే రియాలిటీ షోకు న్యాయనిర్ణేతగా వ్యవహరించింది. 'సత్యమేవ జయతే' హిందీ చిత్రంలో 'దిల్‌బర్' పాట నోరాను మరో ఎత్తుకు తీసుకువెళ్లింది. నాడు యూట్యూబ్‌లో ఆ పాట పెను సంచలనం. ఇరవై నాలుగు గంటల్లోనే ఇరవై మిలియన్లకు పైగా వీక్షించారు. భారత్‌లో అంతటి హిట్ అయిన తొలి హిందీ పాట అదే. 'దిల్‌బర్' అరబిక్ వెర్షన్ కోసం 'మొరాకన్ హిప్‌హాప్' బ్యాండ్‌తో జత కట్టింది నోరా. అంతర్జాతీయంగా పేరు తెచ్చుకోవాలన్న తపనతో 2019లో తన మొట్టమొదటి ఇంగ్లీష్ పాట 'పెపేట'ను విడుదల చేసింది. ఇందుకు టాంజానియా మ్యుజీషియన్, గీత రచయిత రేవానీతో కలిసి పని చేసింది. వీటన్నిటినీ మించిన అరుదైన అవకాశం 2022లో నోరాకు లభించింది. కతార్‌లో జరిగిన 'ఫిఫా' వరల్డ్ కప్ పాట 'లైట్ ద స్కై'లో మెరిసింది. ఇలా పాట... దానికి లయబద్ధమైన నాట్యం ఆమె ప్రయాణంలో కీలకమయ్యాయి. ఊహించని అవకాశాలెన్నో తెచ్చిపెట్టాయి.

నోరాది కెనడాలో స్థిరపడిన మొరాకో సంతతికి చెందిన కుటుంబం. కెనడాలో పుట్టి పెరిగిన ఆమె... టొరంటోలో ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తి చేసింది. 'యార్క్ యూనివర్సిటీ'లో పొలిటికల్ సైన్స్ చదివింది. తన నేపథ్యం ఏదైనా... తన హృదయం మాత్రం భారతీయమేనంటూ ఓ ఇంటర్వ్యూలో చెప్పింది. పాతికకు పైగా సినిమాలు, పలు వెబ్‌సిరీస్‌ల్లో కూడా నటించిన నోరా... తాను ఈ స్థాయికి రావడానికి ఎంతో కష్టపడ్డానంటోంది.

'మాది దిగువ మధ్యతరగతి కుటుంబం. కెనడా నుంచి భారత్‌కు వచ్చినప్పుడు ఇక్కడ నాకు ఎవరూ తెలియదు. వచ్చిన ప్రతి అవకాశాన్నీ వినియోగించుకొంటూ... నన్ను నేను నిరూపించుకున్నాను. అయితే పరిశ్రమ, సామాజిక మాధ్యమాల నుంచి వచ్చే ప్రతికూల పరిస్థితులను ఎదుర్కోవడం అంత సులభం కాదు. ఇక్కడ ఎవరినీ నిందించడానికి లేదు. నా కెరీర్ నా చేతుల్లోనే ఉందని భావించాను. నటిగా, మోడల్‌గా, న్యాయనిర్ణేతగా... వచ్చిన ఏ అవకాశాన్నీ వదల్లేదు. మానసిక ఒత్తిడికి గురి కాకుండా, బాధతో కుంగిపోకుండా ఉండేందుకు ఇది నాకు ఎంతో ఉపయోగపడింది. నా స్నేహితుల్లో చాలామందిని చూశాను. తమ చిత్రాలు ఆడకపోవడంతో మనోవేదనకు లోనయ్యారు. అవకాశాలు రానప్పుడు ఏడ్చారు. అలాంటి పరిస్థితుల్లోకి వెళ్లకుండా నాకు నేను ధైర్యం చెప్పుకొంటూ సాగుతున్నాను' అంటున్న నోరా ఎంత పని ఒత్తిడి ఉన్నా వ్యాయామాలకు, ఆహార నియమాలకు విరామం ఇవ్వదు. ఎందుకంటే అవే తనను మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉంచుతాయంటుంది.

వర్కవుట్ ఇలా...

'బాగా తినండి... బాగా కదలండి'... ఇది నోరా చెప్పే ఫిట్‌నెస్ పాఠం. ఫొటోషూట్స్ నుంచి రెడ్ కార్పెట్ వరకు... ఆరోగ్యం నుంచి అందం వరకు... తన దైనందిన జీవితానికి సంబంధించిన ఫొటోలు, రీల్స్‌ను ఎప్పటికప్పుడు ఆమె ఇన్‌స్టాలో పోస్ట్ చేస్తుంటుంది. అక్కడ ఆమెకు దాదాపు 47 మిలియన్ల మంది ఫాలోవర్స్ ఉన్నారు. ప్రతి పోస్ట్‌కూ కనీసం లక్షకు తగ్గని లైక్స్. మైమరిపించే ఆ రూపాన్ని కాపాడుకోవడానికి నోరా రోజూ వ్యాయామం చేస్తుంది. కానీ జిమ్‌కు వెళ్లేందుకు పెద్దగా ఆసక్తి చూపదు. సమయం, అవకాశాన్ని బట్టి కొన్నిసార్లు ఇంట్లోనే వర్కవుట్స్ పూర్తయిపోతాయి. ఆమె ఫిట్‌నెస్ మెనూలో నాట్యం కూడా ప్రధానమైనది.

నాట్యం: ఏ వయసువారికైనా దృఢంగా, ఆరోగ్యంగా, అందంగా ఉంచడంలో డ్యాన్స్‌కు మించిన ప్రత్యామ్నాయం లేనేది నోరా అభిప్రాయం. అరగంట నాట్యంవల్ల 130 నుంచి 250 కేలరీలు కరుగుతాయి. ఇది అరగంట జాగింగ్‌తో సమానం.

పిలెట్స్: ఉదయం డ్యాన్స్ తరువాత అరగంట పిలెట్స్. ఇందులో ఆరు వందల రకాలకు పైగా విభిన్నమైన ఎక్సర్‌సైజ్‌లు ఉన్నాయి. డ్యాన్స్‌లానే పిలెట్స్‌కు కూడా వయసుతో సంబంధంలేదు. ఎవరైనా సులువుగా చేసుకోవచ్చు. ఒత్తిడిని తగ్గించి, నాణ్యమైన జీవనప్రమాణాలను పెంచడంలో ఇవి ఎంతో దోహదపడతాయని పలు పరిశోధనల్లో తేలింది.

బెల్లీ డ్యాన్స్: నోరా వర్కవుట్స్‌లో బెల్లీ డ్యాన్స్‌ను కూడా చేర్చుకుంది. ఈ నాట్యాన్ని ఆమె ఎంతో ఆస్వాదిస్తుంది. దీని వల్ల సామర్థ్యం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి. జీర్ణక్రియ మెరుగవుతుంది. •



ఇదీ మెనూ..

ఆహార విషయంలో ఇదే తినాలనే నియమాలేవీ తాను పెట్టుకోలేదని నోరా పలు సందర్భాల్లో చెప్పింది. అయితే తీసుకొనే ఆహారం సమతులంగా ఉండేలా చూసుకొంటుంది. వ్యక్తిగత డైట్ కోచ్‌గా యాస్మిన్ కరాచీవాలాను పెట్టుకున్నప్పటికీ... తను సూచించే మెనూను పెద్దగా పట్టించుకోదు. పోషకాలు ఉన్నాయా లేదా అన్నదే ఆమెకు ప్రధానం. తీపి పదార్థాలను దూరం పెట్టింది. తాజా కాయగూరలు, ఆకుకూరలు, పండ్లకు అధిక ప్రాధాన్యం ఇస్తుంది. అప్పుడప్పుడూ పిజ్జాలు, బర్గర్లు, డజర్ట్స్ లాగించేస్తుంటుంది. ఇవి ఆమెకు ఇష్టమైన ఫుడ్. శరీరం డీహైడ్రేట్ కాకుండా పుష్కలంగా నీళ్లు తాగుతుంది.

- ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో ప్రొటీన్ ఫుడ్. అరటిపండ్లు, ఓట్స్, తేనె, గుడ్లు, ఎగ్‌వైట్.
- మధ్యాహ్న భోజనంలో బౌల్ నిండా ఉడకబెట్టిన కాయగూరలు, చికెన్‌తో అన్నం.
- రాత్రి డిన్నర్‌కు ఏదో ఒక నాన్‌వెజ్ ఐటెమ్ తప్పనిసరి.

సంకల్పం



కొత్త జ్యోతిర్మయి... అమెరికాలో ఉచిత తెలుగు 'పాఠశాల'ను ప్రారంభించారు. తెలుగులో మాట్లాడటం రాని అక్కడి పిల్లలతో 'పెద్దబాల శిక్ష'ను కంఠస్తం చేయిస్తున్నారు. తెలుగులో రాయడం అసలే తెలియని చిన్నారులతో సొంతూరులో ఉంటున్న వాళ్ల బామ్మ, తాతయ్యలకు ఉత్తరాలు రాయిస్తున్నారు. తెలుగునేల మీద మాతృభాషకు వన్నె తగ్గినా, పరాయి దేశంలో తెలుగు వెలుగులు పూయిస్తున్నారు. అగ్ర రాజ్యంలో పుట్టిన పిల్లలకు తెలుగు ఉగ్గు పడుతున్న జ్యోతిర్మయి పదిహేనేళ్ల 'పాఠశాల' అనుభవాలను నవ్యతో పంచుకున్నారిలా...

అమెరికాలో తెలుగు పాఠశాల

పదిహేనేళ్ల కిందట షార్లెట్ నగరంలో మేము నెలకొల్పిన 'పాఠశాల' ఇప్పుడు డెట్రాయిట్, కొలంబియా తదితర ప్రాంతాల్లో 32 తెలుగు బోధనా తరగతులు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు అమెరికాలో పుట్టి పెరిగిన ఆరువేల మందికిపైగా విద్యార్థులకు తెలుగులో మాట్లాడటం, రాయడం, చదవడం నేర్పించాం. కేవలం మాతృ భాష మీద మమకారంతో ఒక్క డాలరు కూడా ఫీజు తీసుకోకుండా, దీన్ని ఒక ఉద్యమంలా నిర్వహిస్తున్నాం. ఈ ఏడాది 250 మందికిపైగా విద్యార్థులు మా పాఠశాలలో తర్ఫీదు పొందుతున్నారు. నాతో మొదలైన ఈ సంస్థలో ఇప్పుడు ఉపాధ్యాయులు, ఇతర అడ్మినిస్ట్రేషన్ సిబ్బంది అంతా కలిపి డెబ్భైమందికిపైగా పని చేస్తున్నారు. వారంతా స్వచ్ఛందంగా సేవలందిస్తున్నారు. ఎన్నో కష్టాలు, మరెన్నో సవాళ్ళను దాటుకుంటూ... ఇన్నేళ్ళుగా పాఠశాల సేవలు అప్రతిహతంగా కొనసాగుతున్నాయంటే అదంతా వారందరి సమష్టి కృషి ఫలితమే!

ఆ సంఘటనే ప్రేరణ...

'పాఠశాల' ప్రారంభించడం వెనకున్న కారణం ఏమిటంటే, మాకు పొరుగునఉండే నా స్నేహితురాలి అమ్మానాన్న ఇండియా నుంచి వచ్చారని తెలిసి, ఒక రోజు వారింటికి వెళ్లాను. ఆరు నెలలు ఉందామని వచ్చిన ఆ పెద్దలు నెలరోజులకే తిరుగు ప్రయాణంకాడానికి సమాయత్తమవడం చూసి, అదేంటి అప్పుడే వెళుతున్నారు అని అనడిగాను. "మనవడు, మనవరాలితో గడపాలని గంపెడాశతో వచ్చాం. కానీ వాళ్ళ భాష మాకు రాదు, మా భాష వాళ్ళకు రాదు. పిల్లలను ముద్దుచేయబోతే కనీసం దగ్గరకు కూడా రావడంలేదు. మమ్మల్ని పరాయి వాళ్ళను చూసినట్టు చూస్తున్నారు" అంటూ బాధపడ్డారు. వారి ఆవేదన నా మనసును బాగా మెలిపెట్టింది. అమ్మమ్మ, నాయనమ్మల ప్రేమ మాధుర్యాన్ని ఆస్వాదించడంలోని ఆనందం మరెందులోనూ దొరకదు కదా! అది ఈతరానికి అందకుండా పోవడం నిజంగా బాధాకరమే. మరీ ముఖ్యంగా అమెరికాలో స్థిరపడ్డ తెలుగు కుటుంబాల్లోని చాలామంది పిల్లలు భాష సమస్య వల్ల బామ్మ, తాతయ్యల అనురాగానికి నోచుకోలేకపోవడం గమనించాను. ఆ లోటు పూడ్చడానికి నా వంతుగా 2019లో మా ఇంటిలోనే 'పాఠశాల' తెలుగు బోధన ప్రారంభించాను. కొద్దిరోజులకు అది ఇతర ప్రాంతాలకు విస్తరించింది.

ఇంటిలోనే పాఠశాల...

పాఠశాల ఒకే చోట ఉంటే, దూరప్రాంతాల నుంచి పిల్లల రాక, పోకలకు ఇబ్బంది అవుతుందని, నైబర్‌హుడ్ స్కూలింగ్ విధానాన్ని ఆశ్రయించాం. విద్యార్థులకు సులువుగా ఉండేలా, వాళ్ళ కాలనీలోనే ఒకరి ఇంట్లో పాఠశాల తరగతులు బోధించడం మొదలుపెట్టాం. ఈ సంగతి తెలిసి చుట్టు పక్కల వారంతా చేరడం మొదలుపెట్టారు. దాంతో తక్కువ సమయంలోనే ఎక్కువ మందికి చేరువయ్యాం. తరగతి గదిలో ప్రతి ఆరుగురు విద్యార్థులకు ఒక టీచర్ ఉంటారు. తెలుగు అంటే అమితాభిమానం కలిగినవారిని గుర్తించి, శిక్షణ ఇచ్చాం. ఇప్పటికీ ప్రతి ఏటా ఉపాధ్యాయులకు బోధనా పద్ధతులమీద శిక్షణా శిబిరాలు నిర్వహిస్తుంటాం. వారంతా స్వచ్ఛందంగా సేవలందిస్తున్నారు.

సస్పెన్స్ థ్రిల్లర్ కథలు కావాలన్నారు...

పిల్లలకు తెలుగు నేర్పించడాన్ని బాధ్యతగా గాక, మన భాష పట్ల వారికి ఆసక్తి కలిగేలా శిక్షణ ఇస్తాం. అదే మా బోధనా పద్ధతి. పంచతంత్ర కథలు చెబుతున్నప్పుడు, మాకు అవి ఆసక్తిగాలేవని చాలా మంది పిల్లలు అన్నారు. పైగా హాస్య కథలు కావాలని అడిగారు. వారి అభిరుచికి అనుగుణంగా 'చిట్టి తల్లికథలు' రాశాను.

అదంతా ఉపాధ్యాయుల గొప్పతనం

ప్రతి ఆదివారం ఒక గంట పాటు విద్యార్థులకు తరగతులుంటాయి. ఆ సమయంలోనే విద్యార్థులకు వారంలో నాలుగురోజులకు సరిపడా హోంవర్క్‌ను కూడా ఇస్తాం. పాఠశాలలో చేర్పించడంతో సరికాదు, కచ్చితంగా పిల్లలతో హోమ్‌వర్క్ చేయించాలన్న షరతు మీద అడ్మిషన్ ఇస్తాం. హోమ్‌వర్క్ అంటే తెలుగు పదాలు రాయడం, చిన్న సంఘటన మీద ఇంట్లో సంభాషించడం లాంటివన్నమాట. ఏడాది మధ్యలో మానేయడం, సమయానికి తరగతులు నిర్వహించలేకపోవడం లాంటివి చేయకూడదని మా ఉపాధ్యాయులతో ముందే ఒప్పందం కుదుర్చుకుంటాం. పాఠశాల వార్షికోత్సవం సమయంలో మేమంతా ఒకచోట కలుస్తాం. అంతవరకు వారు పిల్లలు నేర్చుకున్న భాషానైపుణ్యాలను ఆ సమయంలో నాటకాలు, పాటలు లాంటి వివిధ కళారూపాల ద్వారా ప్రదర్శిస్తారు.



వారి మాటలతో ఆత్మసంతృప్తి...

మా సొంతూరు ఒంగోలు. మా నాన్న బాలకృష్ణారెడ్డి గారు కవి, రచయిత కూడా కావడంతో మొదటి నుంచి ఇంట్లో సాహిత్య వాతావరణం ఉండేది. ఆయన చదివిన ప్రతి పుస్తకంలో... తనకు నచ్చిన వాక్యాలను నాకు చదివి వినిపించేవారు. అలా గణిత శాస్త్ర విద్యార్థిని అయిన నాకు చిన్ననాటి నుంచి తెలుగు సాహిత్యంతోనూ పరిచయం ఏర్పడింది. నా భర్త రఘునాథ్ తెలుగు కథలన్నా, నవలలన్నా ఇష్టంగా చదువుతారు. ఆయనతో పాటు మరెంతోమంది స్నేహితుల సహకారంతో దీన్ని ఒక ఉద్యమంలా నిర్వహిస్తున్నాం. ఇండియాలోని బామ్మ, తాతయ్యలకు ఉత్తరాలు రాయడాన్ని సిలబస్‌లో భాగంచేశాం. వ్యవహారిక పదాలను నేర్పిండంలో భాగంగా వారితో ఫోన్‌లో సంభాషించడాన్ని ప్రోత్సహిస్తున్నాం. దాంతో వారిలో మంచి మార్పును చూడగలిగాం. ఇదివరకు ఊరు వెళితే పరాయి దేశానికి వెళ్లినట్టు ఉండేది, ఇప్పుడు సొంతూరుకు వెళ్లినట్టు ఉంటుందని పిల్లలు చెబుతున్నప్పుడు... వారి అమ్మమ్మ, నాయనమ్మలతో గడిపిన విషయాలను మాతో పంచుకుంటున్నప్పుడు ... అవి వింటుంటే కలిగే ఆత్మసంతృప్తి, ఆనందం మాటలకు అందనిది.

• సొంత్వన్

తాతయ్య మాటలంటే ఇష్టం...

ఒకటి నుంచి నాల్గో తరగతి వరకు మా 'పాఠశాల'లో తెలుగు పాఠాలు బోధిస్తున్నాం. దానికి అవసరమైన పాఠ్య ప్రణాళికలను మేమే తయారు చేసుకుంటాం. ఏడాదికి నాలుగు పరీక్షలు నిర్వహిస్తాం. వార్షిక పరీక్షలో విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం ఆధారంగానే వాళ్ళను తర్వాత తరగతికి పంపిస్తాం. మా పాఠ్యాంశాలలో కుల, మత పరమైన ఆచారాలు, సంప్రదాయాలకు, విశ్వాసాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా మొదటి నుంచి జాగ్రత్తపడుతున్నాం. వాటి అనుబంధ సంస్థలు వేటితోనూ సంబంధం లేకుండా 'పాఠశాల'ను స్వతంత్రంగా నిర్వహిస్తున్నాం. మేము రూపొందించిన సిలబస్‌ను కేతు విశ్వనాథరెడ్డి గారిలాంటి విద్యావేత్తలు కొనియాడటం మరిచిపోలేని విషయం. గత వారం బాలల వ్యక్తిత్వ వికాస నిపుణుడు సీఏ ప్రసాద్ గారితో రెండు రోజులు తెలుగు బోధనా వర్క్‌షాప్ నిర్వహించాం. ఆ ముగింపు కార్యక్రమంలో ఓ ఆరేళ్ళ చిన్నారి అచ్చ తెలుగులో "నాకు ఇడ్లీ ఇష్టం, అంతకన్నా దోసె ఇష్టం, వాటికన్నా బర్గర్ ఇష్టం... వాటన్నింటికన్నా నాకు ఈ తాతయ్య మాటలంటే ఇంకా ఇష్టం" అంటూ ఆయన్ను హత్తుకుంది. అది చూసి మేమంతా నిర్ఘాంత పోయాం. అమెరికాలో పుట్టిన పిల్లలకు తెలుగుపట్ల ఉన్న మమకారానికి ఈ సంఘటన ఒక నిదర్శనం.

ఒలింపిక్స్

ఫ్యాషన్, ఆర్ట్‌కు స్వర్గధామం ప్యారిస్. ఈ మహానగరం ఇపుడు ఒలింపిక్స్ క్రీడలకు వేదికైంది. అయితే ఏంటీ అంటారా? ఒలింపిక్స్ క్రీడాకారులు వాడే టవల్స్, కర్చీఫ్‌లు, బీచ్ టవల్స్, మెత్తటి దిండ్లు.. మనోళ్లు చేసినవే. పశ్చిమ గోదావరి జిల్లాలోని సీతారాంపురం గ్రామానికి చెందిన 'జెజె లక్ష్మి అండ్ కంపెనీ'లోని మహిళలు చేసిన ఈ ఉత్పత్తులే ఇప్పుడు హాట్ టాపిక్. ఈ నేపథ్యంలో ఈ సంస్థ ప్రతినిధులతో పాటు ఉద్యోగులనూ 'నవ్య' పలకరించింది...



మన డిజైన్లు.. ప్యారిస్‌కు..!

నైపుణ్యానికి విలువ ఎక్కడైనా ఉంటుంది. సాధారణంగా ఒలింపిక్స్ క్రీడలు నిర్వహించే దేశాలు.. క్రీడాకారులకు కావాల్సిన అన్ని వనరులను కల్పించటం మామూలే. అయితే వారు ఉపయోగించే ఉత్పత్తులను అందించేందుకు కొందరు స్పాన్సర్లు ముందుకొస్తారు. ఆ స్పాన్సర్లు క్వాలిటీకే ప్రాధాన్యం ఇస్తారు. ఎక్కడా రాజీపడరు. ఈసారి పశ్చిమగోదావరి జిల్లాలోని సీతారాంపురం అనే ఓ గ్రామం.. పారిస్‌కే కొన్ని ఉత్పత్తులు ఎగుమతి చేసేంత స్థాయిలో ఎదిగింది.

ఎంతో పోటీని తట్టుకుని...

నాలుగేళ్లకోసారి జరిగే ఒలింపిక్స్ మార్కెట్‌ను క్యాష్ చేసుకునేందుకు ఎన్నో వ్యాపార సంస్థలు పోటీపడతాయి. ముఖ్యంగా ప్రపంచం నలుమూలలనుంచి క్రీడాకారులే కాదు.. వారిని స్పాన్సర్ చేసే సంస్థలు, క్రీడావిభాగంలో పని చేసే అధికారులు, మీడియా.. అన్నింటికి మించి క్రీడాభిమానుల కోలాహలం అంతా ఇంతా కాదు. ఇట్లాంటి ప్రదేశాల్లో సహజంగానే పోటీ ఎక్కువగా ఉంటుంది. పశ్చిమ గోదావరి జిల్లాలోని నరసాపురం మండలంలోని సీతారాంపురంలోని జె.జె.లక్ష్మి అండ్ కో కంపెనీ ఒకటి. ఇందులో అధికంగా మహిళలే ఉద్యోగులు. ఒలింపిక్స్‌కు మన ఉత్పత్తులు ఎగుమతి చేయాలనే లక్ష్యంతో ఈ సంస్థ పని చేసింది. క్వాలిటీ విషయంలో రాజీపడలేదు. ముఖ్యంగా ప్యారిస్‌లో ఓ డిజైనర్‌ను నియమించుకుంది. ఢిల్లీలోని ఈపీసీహెచ్ సహకారంతో పారిస్ ఎక్స్‌పోర్టు లైసెన్స్ తీసుకుని చేతితో తయారు చేసిన అల్లికలను (వంద డిజైన్లను) స్పాన్సర్స్‌కు పంపారు. వారు బీచ్ టవల్స్, టవల్స్, పిల్లోస్, పిల్లో కుషన్లను ఎంపిక చేశారు. అలా వందలాది సంస్థల పోటీ తట్టుకుని మరీ ఈ భారీ ఆర్డర్‌ను సంపాదించింది సంస్థ. దీంతో అక్కడ పని చేసే మహిళల ఆనందానికి అవధుల్లేవు.

గతాన్ని ఘనంగా...

నరసాపురం పేరు చెప్పగానే.. చేతితో తయారు చేసిన అల్లికలు గుర్తొస్తాయి. 1860 ప్రాంతంలో డచ్, బ్రిటీష్‌వాళ్లు వ్యాపారం కోసం మనదేశానికి వచ్చారు. వీళ్ల వల్లనే ఇక్కడి మహిళలకు లేసు అల్లికలు(చేతితో చేసినవి)పై అవగాహన కలిగింది. అప్పట్లో ఇక్కడి మహిళలు చేసిన లేసు అల్లికలను యూరప్ దేశాలకు ఎగుమతి చేసేవారు. అలా అల్లికలు నాంది పలికింది ఈ జిల్లానే. ఆ ప్రాంతానికి చెందిన కలవకొలను రామచంద్రుడు, పితాని వెంకన్న, సాంబమూర్తి లాంటి వ్యాపారస్తులు ఈ అల్లికలను విదేశాలకు ఎగుమతి చేసేవారు. ఒక్క సీతారాంపురం గ్రామంలోనే ఇరవై మందికి పైగా క్లాత్ ఉత్పత్తులు ఎక్స్‌పోర్ట్ చేసే వ్యాపారులు ఉన్నారు. వీరంతా దాదాపు కేంద్రప్రభుత్వం నుంచి ఉత్తమ అవార్డులు అందుకున్నవాళ్లే. ఏటా 150 కోట్లనుంచి 200 కోట్లు దాకా వ్యాపారం చేసేవారు. వేల మంది మహిళలకు ఉపాధి దొరికేదిక్కడ. అయితే కొవిడ్ సమయంలో ఈ పరిశ్రమ సంక్షోభంలో పడింది. ఆర్డర్లు లేకపోవటంతో చాలా సంస్థలు మూతపడ్డాయి. అయితే జెజె లక్ష్మి అండ్ కంపెనీ సంస్థ మాత్రం ఏమాత్రం బలహీనపడకుండా కొత్త ఉత్పత్తులపై దృష్టి మళ్లించింది. ఈపీడీసీహెచ్ సహకారంతో ఏకంగా పారిస్ వెళ్లి తమ సంస్థ ఉత్పత్తులను చూపించి అక్కడి స్పాన్సర్లను మెప్పించారు. దీంతో మూడేళ్ల నుంచీ ఈ పనిలోనే ఎక్కువ సమయం నిమగ్నమయ్యారు ఈ సంస్థ ఉద్యోగులు. కుషన్ పిల్లోస్, బీచ్ టవల్స్ నాప్కిన్లు, టవల్స్‌ను తయారు చేసి గడువుకు ముందే పంపారు. అక్కడ ఈ ఉత్పత్తులను చూసి ఈ సంస్థకు పారిస్, బ్రిటన్ వ్యాపారులు ప్రత్యేకంగా మరికొన్ని ఆర్డర్లు ఇచ్చారు. దీంతో ఈ మహిళలకు మంచి ఉపాధి దొరికినట్లయింది. దీంతో సీతారాంపురం అనే గ్రామం గతం కంటే ఘనకీర్తిని సంపాదించింది.

• మద్దాల మురళీధర్, నరసాపురం
ఫొటోలు: జీవన్‌కుమార్

శిక్షణ వల్లే మాకు ఉపాధి



లేసు మహిళలకు ఈపీసీహెచ్ ఇస్తున్న శిక్షణ వల్ల మాలాంటి మహిళలు ఎక్స్‌పోర్టు కంపెనీల్లో ఉద్యోగాలు దొరుకుతున్నాయి. గతంలో ఇంటి వద్ద కూర్చోని అల్లికలు చేసేవాళ్లం. దీని వల్ల నెలకు రెండు వేలు కూడా వచ్చేవి కాదు. శిక్షణ తీసుకోవడం వల్ల మా ఆదాయం వేలల్లో వెళ్లింది. అయితే ఆర్డర్లు ఉంటేనే మాకు పని దొరుకుతుంది. ప్రస్తుతానికి ఢోకా లేదు.

- దొంగ రేవతి, సీతారాంపురం

సంతోషంగా ఉంది



మేము తయారు చేసిన చేతి వృత్తులు ఒలింపిక్స్ జరిగే పారిస్‌కు వెళ్లడం చాలా సంతోషంగా ఉంది. ఈ ఆర్డర్ వల్ల మాకు ఓవర్ టైం పని లభించింది. విదేశాలకు వెళ్లే వస్తువుల తయారీలో మెలకువలు కూడా గుర్తించాం. 15 ఏళ్లుగా లేసు అల్లికల్లో ఉన్నా. రెండేళ్లుగా ఇక్కడ పనిచేయడం వల్ల కుట్టుల్లో నైపుణ్యం సంపాదించాం. అనుభవం పెరిగింది. రానున్న రోజుల్లో ఇలాంటి ఆర్డర్లు వస్తే మాలాంటి వారికి మంచి రోజులు లభిస్తాయి.

- ముస్కోడి పార్వతి, సీతారాంపురం

రెండేళ్లు ఉపాధి దొరికింది



కొవిడ్ తరువాత ఉపాధి లేక చాలా ఇబ్బందులు పడ్డాం. ఆ సమయంలో జేజే కంపెనీలో పని దొరికింది. పారిస్ ఆర్డర్ రావడంతో రెండేళ్లపాటు ప్రతి రోజు పని దొరికింది. నెలకు రూ.15 వేలు సంపాదిస్తున్నాం. ఇలాంటి ఆర్డర్ స్థానిక కంపెనీలకు వస్తే మాకు ఉపాధికి కరువుండదు.

- అరవ బేబి
సీతారాంపురం

కౌన్సెలింగ్

క్యాల్షియం తగ్గకుండా...

డాక్టర్.. నాకు ఇటీవలే ప్రసవం అయింది. బిడ్డకు ఐదో నెల. ఇప్పటికీ పాలిస్తూనే ఉన్నాను. చనుపాలివ్వడం ద్వారా తల్లి ఎముకలు బలహీనపడతాయని విన్నాను. ఇది ఎంతవరకూ నిజం? ముందుముందు నా ఎముకలు దృఢంగా ఉండాలంటే ఏం చేయాలి?

- ఓ సోదరి,
హైదరాబాద్



మీరు విన్నది నిజమే! చనుపాలతో తల్లి శరీరంలోని క్యాల్షియం పిల్లలకు వెళ్లిపోతూ ఉంటుంది. కాబట్టి తల్లుల ఎముకలు దృఢంగా ఉండాలంటే తీసుకునే ఆహారంలో క్యాల్షియం సరిపడేలా ఉండేలా చూసుకోవాలి. ఇందుకోసం పాలు, పెరుగు పుష్కలంగా తీసుకోవాలి. పిల్లలకు పాలిచ్చే తల్లులు పెరుగు తింటే పసికందుకు జలుబు చేస్తుందనేది అపోహ! బాలింతలు నిర్భయంగా పెరుగు తినొచ్చు. అలాగే నువ్వుల లడ్లు, ఆకుకూరలు, గుడ్లు, మాంసం, చికెన్, చేపలు లాంటి బలవర్థకమైన ఆహారం తీసుకోవాలి. ఇలాంటి ఆహారంతో ప్రసవం ద్వారా కోల్పోయిన రక్తం భర్తీ అవుతుంది. నీరసం, నిస్సత్తువలు ఆవరించకుండా ఉంటాయి. జీడిపప్పు, బాదం, పిస్తాలు కూడా తింటూ ఉండాలి. గర్భిణిగా ఉన్నప్పుడు మహిళలు బరువు పెరగడం సహజం. సాధారణ శరీర బరువుకు మించి 15 నుంచి 20 కిలోల బరువు పెరగడం అవసరం కూడా! ఈ బరువు చూసుకుని కంగారు పడవలసిన అవసరం లేదు. ప్రసవం తర్వాత బిడ్డకు పాలిస్తున్నంత కాలం తల్లుల బరువు క్రమేపీ తగ్గిపోతూ ఉంటుంది. కాబట్టి అదనంగా డైటింగ్ లాంటివి పాటించవలసిన అవసరం లేదు. ఆరు నెలలొచ్చాక బిడ్డకు పాలివ్వడం మానేయకూడదు. బిడ్డ తాగుతున్నంత కాలం పాలిస్తూనే ఉండాలి. అయితే అదే సమయంలో తల్లి తన ఆరోగ్యం మీద కూడా దృష్టి పెట్టాలి. తాజా పండ్లు, కూరగాయలు తీసుకోవాలి. ఎముకలను బలపరిచే వ్యాయామాలు డాక్టర్ల సూచన మేరకే చేయాలి.

- డాక్టర్ మృదుల
స్త్రీల వైద్యులు, హైదరాబాద్

DIKSUCHI

లా కోర్సులలో ప్రవేశానికి క్లాట్



దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ లా యూనివర్సిటీలలో ప్రవేశానికి ఉద్దేశించిన 'కామన్ లా అడ్మిషన్ టెస్ట్(క్లాట్) 2025' దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. దీని ద్వారా అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ లా ప్రోగ్రామ్‌లలో అడ్మిషన్స్ ఇస్తారు. ఈ టెస్ట్‌ను 'కన్సార్షియం ఆఫ్ నేషనల్ లా యూనివర్సిటీస్' నిర్వహిస్తుంది. హైదరాబాద్ నల్సార్, విశాఖపట్నం డీఎస్ఎన్ఎల్‌యూ సహా బెంగళూరు ఎన్ఎల్ఎస్ఐయూ, భోపాల్ ఎన్ఎల్ఐయూ, కొచ్చి ఎన్‌యూఏఎల్ఎస్, జోధ్‌పూర్ ఎన్ఎల్‌యూ, ఒడిశా ఎన్ఎల్‌యూఓ తదితర లా కళాశాలలు ఇందులో పార్టిసిపేట్ చేస్తున్నాయి. క్లాట్ 2025లో సాధించిన స్కోర్ ఆధారంగా అభ్యర్థుల ఛాయిస్‌ను అనుసరించి సీట్లను అలాట్ చేస్తారు. ఈ ఎగ్జామ్‌ను ఆఫ్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు.

అండర్ గ్రాడ్యుయేట్: ఇది అయిదేళ్ల వ్యవధి గల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ ప్రోగ్రామ్. గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు. 2025 మార్చి/ఏప్రిల్‌లో చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా అర్హులే.


యూజీ క్లాట్ 2025: ఇందులో మొత్తం 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఇంగ్లీష్‌లో 22 నుంచి 26 ప్రశ్నలు; కరెంట్ అఫైర్స్-జనరల్ నాలెడ్జ్‌లో 28 నుంచి 32 ప్రశ్నలు; లీగల్ రీజనింగ్‌లో 28 నుంచి 32 ప్రశ్నలు; లాజికల్ రీజనింగ్‌లో 22 నుంచి 26 ప్రశ్నలు; క్వాంటిటేటివ్ టెక్నిక్స్‌లో 10 నుంచి 14 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 120. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే పావు మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు.

పోస్ట్ గ్రాడ్యుయేట్: ఇది ఏడాది వ్యవధి గల ఎల్ఎల్ఎం ప్రోగ్రామ్. ద్వితీయ శ్రేణి మార్కులతో ఎల్ఎల్‌బీ/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. 2025 ఏప్రిల్/మేలో చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

పీజీ క్లాట్ 2025: ఇందులో మొత్తం 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. కాన్‌స్టిట్యూషనల్ లా, జ్యూరిస్ప్రుడెన్స్, అడ్మినిస్ట్రేటివ్ లా, లా ఆఫ్ కాంట్రాక్ట్, టార్ట్స్, ఫ్యామిలీ లా, క్రిమినల్ లా, ప్రాపర్టీ లా, కంపెనీ లా, పబ్లిక్ ఇంటర్నేషనల్ లా, ట్యాక్స్ లా, ఎన్విరాన్‌మెంటల్ లా, లేబర్ అండ్ ఇండస్ట్రియల్ లా అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 120. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే పావు మార్కు. కోత విధిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 15
- **క్లాట్ 2025 తేదీ:** డిసెంబరు 1
- **వెబ్‌సైట్:** www.consortiumofnlus.ac.in

ఓయూలో పార్ట్ టైమ్ పీజీ



హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహిస్తున్న యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ (యూసీఈ)-పార్ట్ టైమ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. కంటిన్యూయింగ్ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్(సీఈఈపీ) కింద ఎంఈ/ఎంటెక్ అడ్మిషన్స్ నిర్వహిస్తున్నారు. వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ఉద్దేశించిన ఈ ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇందులో ఆరు సెమిస్టర్లు ఉంటాయి. ఎంట్రెన్స్ టెస్ట్, కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. సివిల్, కంప్యూటర్ సైన్స్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, బయో మెడికల్, మైనింగ్ విభాగాలు అందుబాటులో ఉన్నాయి. ప్రతి ఇంజనీరింగ్ విభాగంలో 85 శాతం సీట్లను స్థానికులకు ప్రత్యేకించారు.

అర్హతలు: స్పెషలైజేషన్‌ను అనుసరించి సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో బీఈ/బీటెక్/ఏఎంఐఈ/ఏఎంఐఈటీఈ ఉత్తీర్ణులై ఉండాలి. జూన్ 30 నాటికి కనీసం ఏడాది అనుభవం ఉండాలి. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగానికి ఏదేని ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణులు; మాస్టర్స్ డిగ్రీ(ఫిజిక్స్/స్టాటిస్టిక్స్/మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్/అప్లయిడ్ స్టాటిస్టిక్స్/అప్లయిడ్ ఫిజిక్స్/జియో ఫిజిక్స్) పూర్తిచేసినవారు; ఎమ్మెస్సీ(కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్/కంప్యూటర్ అప్లికేషన్స్ అండ్ ఎలక్ట్రానిక్స్) ఉత్తీర్ణులు; ఎంసీఏ పూర్తిచేసిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. బయో మెడికల్ ఇంజనీరింగ్ విభాగానికి(బీఈ/బీటెక్)(బయో మెడికల్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్/ ఈఐఈ/ ఈసీఈ/బయోటెక్నాలజీ/మెడికల్ ఎలక్ట్రానిక్స్) ఉత్తీర్ణులు; ఎమ్మెస్సీ(ఎలక్ట్రానిక్స్/మెడికల్ ఎలక్ట్రానిక్స్/అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్/ఫిజిక్స్/మెడికల్ ఫిజిక్స్/బయో ఫిజిక్స్/బయో ఇన్ఫర్మాటిక్స్/బయో మెడికల్ ఇన్ఫర్మాటిక్స్/బయోటెక్నాలజీ) పూర్తిచేసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. మైనింగ్ ఇంజనీరింగ్ విభాగానికి మైనింగ్ అండ్ మెషినరీ ఇంజనీరింగ్/మైనింగ్ ఇంజనీరింగ్ విభాగాల్లో డిగ్రీ పూర్తిచేసినవారు అర్హులు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 14
- **ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** ఆగస్టు 25
- **వెబ్‌సైట్:** www.uceou.edu

డిప్లొమా ఇన్ రైల్వే ఇంజనీరింగ్

న్యూఢిల్లీలో కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ పర్మనెంట్ వే ఇంజనీర్స్(ఇండియా)- డిప్లొమా ఇన్ రైల్వే ఇంజనీరింగ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. ఇది కరస్పాండెన్స్ కోర్సు. ఇందులో ఇండియన్ రైల్వేస్‌కు సంబంధించిన స్ట్రక్చర్, ఫంక్షనింగ్ అంశాలు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌నకు కోల్‌కతాలోని ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్(ఇండియా) గుర్తింపు ఉంది.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి సైన్స్/కామర్స్/ఇంజనీరింగ్ విభాగాల్లో బీఎస్సీ/బీకామ్/బీఈ ఉత్తీర్ణులు; ఏదేని ఇంజనీరింగ్ విభాగంలో మూడేళ్ల డిప్లొమా ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్/సైన్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి బీఏ డిగ్రీ పూర్తిచేసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 31
- **వెబ్‌సైట్:** ipweindia.org.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/Fmev5rLలో చదవండి.



ప్రేక్షకులు గుర్తుపెట్టుకునే సినిమా



ఇటీవలే 'ఓమ్ భీమ్ బుష్' చిత్రంతో ప్రేక్షకులను పలకరించారు ప్రియదర్శి. ఆయన, నభానటేశ్ హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'డార్లింగ్'. 'వై దిస్ కొలవెరీ' అనేది ఉపశీర్షిక. అశ్విన్‌రామ్ దర్శకత్వంలో కె.నిరంజన్‌రెడ్డి, చైతన్య నిర్మించారు. సినిమా రేపు విడుదలవుతోన్న సందర్భంగా ఆయన మీడియాతో ముచ్చటించారు.

"దర్శకుడు ఈ కథ చెప్పినప్పుడు చాలా బాగా నచ్చింది. స్ర్కిప్ట్‌పై పూర్తి నమ్మకం ఉంది. సినిమాకు ఈ టైటిల్‌ను చాలా ప్రేమతో పెట్టాం. కపుల్స్ మధ్య జరిగే సంఘటనలని వినోదాత్మకంగా చూపించే ఈ సినిమా.. రిలేషన్‌షిప్‌లో ఉన్న వారితో పాటు అన్ని వర్గాలనూ ఆకట్టుకుంటుంది. ఇందులో నా ప్రపంచం, నభా ప్రపంచం చాలా వేరుగా ఉంటాయి. భిన్న ధృవాలైన మా ఇద్దరి మధ్య సీరియస్‌గా జరిగే సంఘటనలతో సాగే సన్నివేశాలను ప్రేక్షకులు ఫుల్‌గా ఎంజాయ్ చేస్తారు. స్ర్కీన్‌ప్లే చాలా వైవిధ్యంగా ఉంటుంది. 'డార్లింగ్' సినిమాను అందరూ చాలా కాలం గుర్తుపెట్టుకుంటారు" అని ప్రియదర్శి అన్నారు.

ఆగస్టులో భవనమ్ విడుదల



ప్రతిష్ఠాత్మక నిర్మాణసంస్థ సూపర్‌గుడ్ ఫిలిమ్స్ నిర్మిస్తున్న తాజా చిత్రం 'భవనమ్'. 'ది హాంటెడ్ హౌస్' అనేది ఉపశీర్షిక. ఆర్‌బీ చౌదరి, వాకాడ అంజన్‌కుమార్, వీరేంద్ర సిర్వీ నిర్మిస్తున్నారు. సప్తగిరి, ధన్‌రాజ్, షకలక శంకర్, అజయ్, మాళవిక సతీషన్, స్నేహా ఉల్లాల్ ప్రధాన తారాగణం. బాలాచారి కూరెళ్ల దర్శకత్వం వహిస్తున్నారు. బుధవారం మేకర్స్ 'భవనమ్' విడుదల తేదీని ప్రకటించారు. ఈ సస్పెన్స్ థ్రిల్లర్‌ను ఆగస్టు 9న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు తెలిపారు. ప్రేక్షకుల్ని భయపెట్టడంతో పాటు మంచి హాస్యంతో అలరిస్తుందని చిత్ర బృందం తెలిపింది. సినిమాటోగ్రఫీ: మురళీమోహన్‌రెడ్డి, ఎడిటర్: ఎన్టీఆర్.

'ఏం చేద్దామంటావ్ మరి'...
కల్లు కాంపౌండ్ పాటలో కేసీఆర్ ఊతపదం

● దర్శకుడు పూరి జగన్నాథ్‌పై కేసు నమోదు



రామ్ పోతినేని హీరోగా పూరి జగన్నాథ్ తెరకెక్కిస్తున్న 'డబుల్ ఇస్మార్ట్' చిత్రం వివాదంలో చిక్కుకుంది. ఈ సినిమా నుంచి ఇటీవలే విడుదలైన 'మార్ ముంత చోడ్ చింత' అనే పాటలో మాజీ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్‌రావు వాయిస్‌ను ఉపయోగించడంపై బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు అభ్యంతరం తెలుపుతున్నారు. కల్లు కాంపౌండ్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ గీతంలో 'ఏం చేద్దామంటావ్ మరి' అనే కేసీఆర్ పాపులర్ డైలాగ్‌ను రెండుసార్లు ఉపయోగించారు. వెంటనే పాట నుంచి ఆ హుక్‌లైన్‌ను తొలగించేలా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు ఎం. రజితారెడ్డి, జీ. సతీష్‌కుమార్ బుధవారం ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. 'పదేళ్లు తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా చేసిన కేసీఆర్ వాయిస్‌ను కల్లు కాంపౌండ్‌లో చిత్రీకరించిన ఐటమ్ సాంగ్‌లో ఉపయోగించడం తప్పు, ఇది కేసీఆర్‌ను అవమానించడమే కాక తెలంగాణ ప్రజల మనోభావాలనూ దెబ్బతీసేలా ఉంది' అని ఫిర్యాదులో పేర్కొన్నారు. 'మా ప్రాంత యాస, భాష, మా నాయకుడిని కించపరిచినా సహించేది లేదు, అవసరమైతే పూరి జగన్నాథ్ ఇంటిని ముట్టడిస్తామ'ని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. పాట రచయిత కాసర్ల శ్యామ్, సింగర్ రాహుల్ సిప్లిగంజ్‌పైనా సోషల్ మీడియాలో విమర్శలు వస్తున్నాయి. అయితే ఈ విమర్శలపై చిత్రబృందం ఇంతవరకూ స్పందించలేదు.

త్వరలోనే మీ ముందుకొస్తా



నటించిన అతికొద్ది చిత్రాలతోనే తన సూపర్ యాక్టింగ్‌తో.. మంచి టైమింగ్‌తో నటుడిగా స్పెషల్ ఇమేజ్ తెచ్చుకున్నారు నవీన్ పొలిశెట్టి. 2023లో విడుదలైన 'మిస్.శెట్టి, మిస్టర్ పొలిశెట్టి' చిత్రం తర్వాత ఆయన తెరపై కనిపించలేదు. ఈ విరామానికి గల కారణాన్ని ఆయన సోషల్ మీడియాలో షేర్ చేశారు.

"నేను మీ అందరితో ఓ వ్యక్తిగత విషయాన్ని పంచుకోవాలనుకుంటున్నాను. నేను చేస్తున్న సినిమాల గురించి అప్‌డేట్స్ లేవని అందరూ అడుగుతున్నారు. దానికి కారణం ఇటీవలే జరిగిన బైక్ ప్రమాదంలో నా చేతికి, కాలికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ గాయాల వల్లే నేను సినిమాలను అనుకున్న టైమ్‌కి మీ ముందుకు తీసుకురాలేకపోతున్నాను. ఈ విరామానికి నన్ను క్షమించండి. త్వరలోనే పూర్తిగా కోలుకుని మిమ్మల్ని తిరిగి ఎంటర్టైన్ చేస్తాను" అని పేర్కొన్నారు.

'సర్దార్-2' షూటింగులో స్టంట్‌మేన్ మృతి



తమిళ నటుడు కార్తీ హీరోగా నటిస్తున్న 'సర్దార్-2' చిత్రం షూటింగ్‌లో విషాదం చోటు చేసుకుంది. ఈ సినిమా కోసం ఒక ఫైట్ చిత్రీకరిస్తుండగా, 20 అడుగుల ఎత్తు నుంచి ఫైట్ ట్రైనర్ (స్టంట్‌మేన్) ఏళుమలై ప్రమాదవశాత్తు కిందపడటంతో తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషయాన్ని ఆ చిత్ర నిర్మాణ సంస్థ ప్రిన్స్ పిక్చర్స్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. స్థానిక సాలిగ్రామంలోని ప్రసాద్ స్టూడియోలో మంగళవారం ఫైట్ మాస్టర్ సూపర్ సుబ్బరాయన్ పర్యవేక్షణలో ఫైట్ రిహార్సల్ చేస్తుండగా ఈ సంఘటన జరిగింది. ఏళుమలై కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని నిర్మాత లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారు.

చెన్నై, (ఆంధ్రజ్యోతి)

ఆరోగ్యంగానే ఉన్నా

ఆర్.నారాయణమూర్తి



ప్రజానటుడు ఆర్.నారాయణమూర్తి స్వల్ప అస్వస్థతతో బుధవారం నిమ్స్ అనుపత్రిలో చేరారు. ఆయనను ప్రత్యేక విభాగంలో ఉంచి నిమ్స్ డైరెక్టర్ బీరప్ప ఆధ్వర్యంలో వైద్య బృందం వైద్య పరీక్షలు నిర్వహించారు. గతంలో ఆయనకు ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగి ఉండటంతో హృద్రోగ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ పరీక్షలను వైద్యులు చేసి, ప్రమాదం ఏమీ లేదని నిర్ధారించారు. గ్యాస్ట్రిక్ సమస్య అయి ఉంటుందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. నారాయణమూర్తికి ఏమైందంటూ సోషల్ మీడియాలో చర్చ జరుగుతుండడంతో 'నేను ఆరోగ్యంగా ఉన్నా.. అభిమానులూ ఆందోళన చెందకండి. దేవుడి దయ వల్ల బాగానే ఉన్నా. పూర్తిగా కోలుకున్న తర్వాత అన్ని వివరాలూ వెల్లడిస్తా' అని ఓ ప్రకటనలో తెలిపారు నారాయణమూర్తి.



తన భర్త నికొలై సచ్‌దేవ్‌తో కలసి వరలక్ష్మి బుధవారం హైదరాబాద్‌లో మీడియాతో ముచ్చటించారు. 'హైదరాబాద్ నాకు సెకండ్ హోమ్.. మీరంతా నాకు చాలా సపోర్ట్ చేశారు. ఇక ముందు కూడా ఇలానే సహకరించాలి' అని కోరారు వరలక్ష్మి

'బడ్డీ' వచ్చేది ఎప్పుడంటే..!




అల్లు శిరీష్ హీరోగా నటిస్తున్న 'బడ్డీ' చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని విడుదల కోసం తుదిమెరుగులు దిద్దుకుంటోంది. అడ్వెంచరస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకున్న ఈ చిత్రంలో గాయత్రీ భరద్వాజ్, ప్రిషా రాజేశ్ సింగ్ హీరోయిన్లు. శామ్ ఆంటోనీ దర్శకుడు. ఈ చిత్రాన్ని ఆగస్టు 2న విడుదల చేయనున్నట్లు నిర్మాతలు జ్ఞానవేల్ రాజా, అధన చెప్పారు. ఈ చిత్ర నిర్మాణం ఇండియన్ సిల్వర్ స్ర్కీన్ మీద కొత్త ప్రయత్నం అని వారు చెప్పారు. సంగీత దర్శకుడు హిప్ హాప్ తమిళ స్వరపరిచిన పాటలు మంచి ఆదరణ పొందాయని చెప్పారు.

టికెట్ రేట్లు తగ్గించాలి



వినోద్ కిషన్, అనూష కృష్ణ జంటగా రూపుదిద్దుకున్న 'పేకమేడలు' చిత్రం ఈ శుక్రవారం విడుదలవుతోంది. నీలగిరి మామిళ్ల దర్శకత్వంలో రాకేశ్ వర్రె నిర్మించారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో చిత్రాన్ని విడుదల చేస్తున్న నిర్మాత ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ 'పెద్ద సినిమాల టికెట్ రేట్లు ఎంత ఉన్నా ప్రేక్షకులు థియేటర్‌కు వస్తారు. ఇలాంటి చిన్న సినిమాలకు తక్కువ రేట్లు ఉండాలి. అందుకే టికెట్ రేటు వంద రూపాయలు పెట్టాం. ఇలాంటి మంచి సినిమాను ప్రేక్షకుల దగ్గరకు తీసుకెళ్లాలని పెయిడ్ ప్రీమియర్స్ కు రూ 50 పెట్టాం. సినిమా బాగుందని ప్రతి ఒక్కరూ చెప్పారు. ఈ సినిమా అందరికీ నచ్చుతుంది' అని చెప్పారు. చిత్ర నిర్మాత రాకేశ్ వర్రే మాట్లాడుతూ 'ఈ సినిమా విడుదల చేయడానికి ముందుకు వచ్చిన ధీరజ్‌కు ధన్యవాదాలు. అలాగే మా సినిమాకు సపోర్ట్ చేసిన రానా దగ్గుబాటి, అడవి శేష్, విష్వక్‌సేన్‌కు కృతజ్ఞతలు' అన్నారు. పెయిడ్ ప్రీమియర్స్‌కు వస్తున్న రెస్పాన్స్ చూసి చాలా ఆనందంగా ఉందని వినోద్ కిషన్ చెప్పారు.







బాధ్యతలు చేపట్టిన జ్ఞానేశ్వర్‌ను అభినందిస్తున్న స్పీకర్ ప్రసాద్ కుమార్

ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్‌గా బొర్రా జ్ఞానేశ్వర్ ప్రమాణ స్వీకారం

నార్సింగ్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో అతిపెద్ద సామాజికవర్గమైన ముదిరాజ్ కులం సామాజిక, ఆర్థిక పరిస్థితులపై కాంగ్రెస్ పార్టీకి, సీఎం రేవంత్‌రెడ్డికి పూర్తి అవగాహన ఉందని బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. హైదరాబాద్ సంక్షేమ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కో-ఆపరేటివ్ సొసైటీ కార్పొరేషన్ చైర్మన్‌గా బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, శ్రీహరి ముదిరాజ్, టీఎమ్ఆర్ఈఎల్ఎస్ అధ్యక్షులు ఎండీ ఫాహెం ఖురేషి, యూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నరసింహారెడ్డి, టీఎస్ఎఫ్‌సీవోఎఫ్ చైర్మన్ మెట్టు సాయికుమార్, మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ముదిరాజ్‌ల సమస్యలపై సానుకూలంగా స్పందించి కార్పొరేషన్ ఏర్పాటు చేసి తనను మొదటి చైర్మన్‌గా నియమించినట్లు తెలిపారు. మరోవైపు.. మాసబ్‌ట్యాంక్‌లోని సంక్షేమ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్‌గా జెరిపాటి జైపాల్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు మంత్రి పొన్నం ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు.

పాలన గాలికి వదిలి.. రాజకీయ కక్షలపై దృష్టి

» పరిమితి దాటి కేసీఆర్‌పై కాంగ్రెస్ దుష్ప్రచారం: కేటీఆర్

హైదరాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీ పాలనను గాలికొదిలేసి రాజకీయ కక్షలు, ప్రతీకార చర్యలపైనే దృష్టి పెట్టిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. కక్షలు, ప్రతీకారానికీ పరిమితులుంటాయని, వాటిని దాటి కేసీఆర్‌పై దుష్ప్రచారం చేస్తోందని బుధవారం ఒక ప్రకటనలో ఆయన ఆరోపించారు. రాజకీయాల్లో కక్ష సాధింపు, ప్రతీకారాలకు చోటు ఉండకూడదని కోరుకుంటానన్న కేటీఆర్.. ఇలాంటి ప్రయత్నాలు ఎక్కువ కాలం నిలబడవని సుప్రీంకోర్టు తాజాగా ఇచ్చిన తీర్పు స్పష్టం చేసిందన్నారు. విద్యుత్ కొనుగోళ్లకు సంబంధించి కేసీఆర్‌ను బద్నామ్ చేసేందుకు ప్రభుత్వం చేసిన ప్రయత్నాన్ని సుప్రీంకోర్టు తప్పు బట్టిందని ఆయన పేర్కొన్నారు.

ఆ ఎమ్మెల్యేలు మాజీలు అయ్యేంత వరకు నిద్రపోం

» మాజీ మంత్రి హరీశ్‌రావు

రామచంద్రాపురం, జూలై 17: బీఆర్ఎస్ నుంచి గెలుపొంది కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలు మాజీలు అయ్యేంతవరకు వదిలేది లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. పటాన్‌చెరు నియోజవర్గ పరిధి రామచంద్రాపురంలోని జీహెచ్ఎంసీ 111 డివిజన్ కార్పొరేటర్ వి.సింధూఆదర్శరెడ్డి నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పార్టీ మారారని కార్యకర్తలు అధైర్య పడవద్దని, పార్టీని మరింత బలోపేతం చేసేందుకు పని చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రుణమాఫీ జీవోలో ఒక విధంగా మంత్రులు చెప్పేది మరో విధంగా ఉందన్నారు. పాస్‌బుక్ ఉన్న రైతులందరికి రుణమాఫీ చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

ఉద్యోగులకు పీఆర్సీని ప్రకటించాలి: నర్సిరెడ్డి

హైదరాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు వెంటనే పీఆర్సీని ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే మంజూరు చేయాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం జరిగిన యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కర్ణాటక ప్రభుత్వం 27.5% ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ ప్రకటించిందని, తెలంగాణలోనూ అదే తీరుగా పీఆర్సీ అమలు చేయాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు, సరెండర్ లీవులను చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి తదితరులు పాల్గొన్నారు. కాగా, జీవో 317 కారణంగా సొంత జిల్లాలను వదలి వెళ్లిన నాన్ స్పౌజ్‌లకు న్యాయం చేయాలని సబ్ కమిటీ చైర్మన్ దామోదర రాజనర్సింహకు నాన్ స్పౌజ్ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి సక్కుబాయి వినతి పత్రం అందజేశారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి: నిరంజన్ రెడ్డి

హైదరాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : అధికారం చేపట్టగానే రైతులందరికీ రుణమాఫీ చేస్తామని కాలయాపన చేసిన కాంగ్రెస్ సర్కారు డబ్బులు వేసే సమయంలో ఆంక్షలు ఎందుకు పెట్టింది.. ఎన్నికల సమయంలో ఈ ఆంక్షల గురించి ఎందుకు చెప్పలేదని మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ప్రశ్నించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం విడుదల చేసిన రుణమాఫీ మార్గదర్శకాలు గందరగోళంగా ఉన్నాయన్నారు. ఎటువంటి ఆంక్షలు లేకుండా.. రైతులందరికీ ఒకేసారి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. పట్టాదారు పాసు పుస్తకం ఉన్న ప్రతిఒక్కరి బ్యాంకు ఖాతాలో రుణమాఫీ డబ్బులు వేయాలని.. లేదంటే కాంగ్రెస్ మోసం చేసినట్లేనని నిరంజన్‌రెడ్డి అన్నారు. విద్యుత్ విచారణ చైర్మన్ బాధ్యతల నుంచి తప్పుకొన్నా కూడా.. జస్టిస్ నరసింహారెడ్డి తన స్థాయి మరిచి అనుచిత వ్యాఖ్యలు చేశారని బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ ఆరోపించారు. కేసీఆర్‌పై, ఎమ్మెల్సీ కవితపై ఆయన చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు.

విదేశీ విద్యార్థులకు నిధుల కేటాయింపులేవి?

» బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్

హైదరాబాద్, జూలై 17(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ పరిషత్ ద్వారా ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లిన విద్యార్థులకు కాంగ్రెస్ ప్రభుత్వం రెండో దశ నిధులు విడుదల చేయడం లేదని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. సకాలంలో నిధులు అందక విదేశాల్లో చదువుతున్న విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వయం ఉపాధి కింద రుణాలు ఇస్తామని చెప్పినా అవి కూడా ఇవ్వడం లేదన్నారు. వేద పాఠశాలలకు అందాల్సిన సహకారం కూడా అందడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం బ్రాహ్మణుల సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. వచ్చే బడ్జెట్‌లో బ్రాహ్మణ పరిషత్‌కు నిధులు కేటాయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఒక్క చాన్స్ ప్లీజ్

» కొత్త మెడికల్ కాలేజీల్లో లోటుపాట్లు

సరిదిద్దుకుంటామని ఎన్ఎంసీకి సర్కారు అప్పీల్

హైదరాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న 8 మెడికల్ కాలేజీలకు అనుమతులివ్వబోమని జాతీయ వైద్య కమిషన్(ఎన్ఎంసీ) స్పష్టం చేసిన నేపథ్యంలో తమకు మరో అవకాశం ఇవ్వాలని సర్కారు అప్పీల్‌కు వెళ్లింది. వర్చువల్ తనిఖీలు చేసే సమయానికి లోటుపాట్లను సవరించుకుంటామని అందులో పేర్కొంది. కొత్త మెడికల్ కాలేజీల్లో లోటుపాట్ల గురించి ప్రస్తావిస్తూ ప్రధానంగా అధ్యాపకులు లేరని, అనుమతులివ్వబోమని ఎన్ఎంసీ ఆ కళాశాలల ప్రిన్సిపాళ్లకు జూలై తొలివారంలో లేఖ రాసిన సంగతి తెలిసిందే. ఎన్ఎంసీ నిబంధన మేరకు 50 సీట్లతో ఏర్పాటు చేసే వైద్య కళాశాలలో 14 మంది ప్రొఫెసర్లు, 20 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 25 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉండాలి. ఒక్కోచోట 50 ఎంబీబీఎస్ సీట్లు ఉండేలా ఏర్పాటు చేస్తున్న 8 కాలేజీల్లో అధ్యాపకులే లేరు. దాంతో వైద్య ఆరోగ్యశాఖ యుద్ధప్రాతిపదికన అధ్యాపకుల భర్తీపై దృష్టి సారించింది. ఈ కళాశాలలకు పదోన్నతులపై అసోసియేట్ ప్రొఫెసర్లను పంపించింది. నిబంధనలకు తగ్గట్లు 6కాలేజీల్లో 20 మంది వరకు అసోసియేట్ ప్రొఫెసర్లు చేరారు. కానీ గద్వాల, నారాయణపేట్ మెడికల్ కాలేజీల్లో చేరేందుకు మాత్రం అసోసియేట్ ప్రొఫెసర్లు ఆసక్తి చూపలేదు. పదోన్నతులు తీసుకున్నారు కానీ హైదరాబాద్‌కు దూరంగా ఉండే ఆ కళాశాలల్లో పనిజేయబోమని తేల్చిచెప్పారు. తమను బలవంతంగా అక్కడికి పంపారంటూ హైకోర్టును ఆశ్రయించి, స్టే తెచ్చుకునే పనిలో ఉన్నారు.

సింగరేణిలో ఇద్దరు కార్మికుల సజీవ సమాధి

మరమ్మతు పనులు చేస్తుండగా కూలిన మట్టి

మరో ఇద్దరు కార్మికులకు తీవ్ర గాయాలు

రామగుండం-3 డివిజన్ ఓసీపీ-2లో ఘటన

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విచారం

రామగిరి/హైదరాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులో ప్రమాదం సంభవించింది. పైపులైన్ లీకేజీ మరమ్మతు చేస్తున్న ఇద్దరు కార్మికులు సజీవ సమాధి అయ్యారు. మరో ఇద్దరు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలంలోని రామగుండం-3 డివిజన్ పరిధి ఓసీపీ-2లో ఈ ఘటన చోటుచేసుకుంది. క్వారీలోని సౌత్‌కోల్ ఏరియాలో సైడ్‌వాల్ లోపల పైపులైన్ లీకేజీ అవుతుండడంతో బుధవారం నలుగురు కార్మికులు మరమ్మతు పనులు చేపట్టారు. అయితే హైవాల్‌లో బురద మట్టి(ఓబీ) వర్షానికి నానిపోయి ఒక్కసారిగా కార్మికులపై కూలింది. దీంతో సింగరేణి టెక్నీషియన్(ఫిట్టర్) ఉప్పుల వెంకటేశ్వర్లు(58), జనరల్ మజ్దూర్ కార్మికుడు గాదం విద్యాసాగర్(55) ఆ మట్టిలో కూరుకుపోయి ప్రాణాలు కోల్పోయారు. కాగా, కూలిన మట్టిలో వచ్చిన బండరాళ్లు అక్కడే పనిచేస్తున్న మరో ఇద్దరు జనరల్ మజ్దూర్ కార్మికులు శ్రీనివాస్‌రాజు, మాదాం సమ్మయ్యకు తగలడంతో.. వారికి తీవ్రగాయాలయ్యాయి. క్వారీలోని మిగతా కార్మికులు ఘటనా స్థలానికి చేరుకొని కూలిన మట్టిని షావల్ సహాయంతో తొలగించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. గాయపడ్డ కార్మికులకు తొలుత స్థానిక సెంటినరీ కాలనీలోని డిస్పెన్సరీలో ప్రథమ చికిత్స అందించి.. తర్వాత గోదావరిఖని ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుల్లో.. ఉప్పుల వెంకటేశ్వర్లు హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొప్పూరు గ్రామానికి చెందిన వ్యక్తి కాగా, గాదం విద్యాసాగర్ గోదావరిఖనికి చెందిన వ్యక్తి. ప్రమాద ఘటనపై సింగరేణి సీఎండీ బలరాం విచారణకు ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కాగా, సింగరేణి కార్మికులు మృతి చెందిన ఘటనపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్మికుల భద్రత విషయంలో పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.



వెంకటేశ్వర్లు, విద్యాసాగర్(ఫైల్)

గ్రీన్ ఫీల్డ్ హైవేకు నిరసన రంగు!

నాగపూర్-విజయవాడ హైవేకు భూములిచ్చేది లేదు

» అలైన్‌మెంట్ మార్చండి.. లేదంటే మార్కెట్ ధర ఇవ్వండి

» రైతుల డిమాండ్.. భూపాలపల్లిలో సర్వే పనుల అడ్డగింత

భూపాలపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నాగపూర్-విజయవాడ గ్రీన్ ఫీల్డ్ ఫోర్‌లైన్ కంట్రోల్డ్ యాక్సెస్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణానికి భూములిచ్చేది లేదని రైతులు తెగేసి చెబుతున్నారు. తమవి ఏడాదికి రెండు పంటలు పండే నల్లరేగడి భూములని, భూములిచ్చేస్తే తమ బతుకుదెరువు ఏం కావాలి? అని ప్రశ్నిస్తున్నారు. ఎలైన్‌మెంట్‌ను మార్చాలని కొందరు డిమాండ్ చేస్తుంటే.. మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లిస్తే భూములిచ్చేందుకు అభ్యంతరం లేదని ఇంకొందరు చెబుతున్నారు. ఈ మేరకు భూపాలపల్లి జిల్లాకు సంబంధించి చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి మండలాల్లో మొత్తం 14 గ్రామాల్లోని 200 మంది రైతులకు చెందిన 130 హెక్టార్ల భూసేకరణకు అధికారులు సర్వేకు ప్రయత్నించగా రైతులు అడ్డు తగులుతున్నారు. భారత్ మాల పరియోజన పథకంలో భాగంగా నిర్మించ తలపెట్టిన ఈ గ్రీన్ ఫీల్డ్, బ్రౌన్ ఫీల్డ్ హైవేను హైబ్రీడ్ యాన్యుటీ మోడల్(హామ్)లో నిర్మించనున్నారు. ఇందులో భాగంగా మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం నర్వ నుంచి మహబూబాబాద్ జిల్లా వెన్నారం వరకు 216.57 కిలోమీటర్ల నిడివిలో గ్రీన్‌ఫీల్డ్ ఫోర్ లైన్ రోడ్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ అధికారులకు ముచ్చెమటలు పట్టిస్తోంది. మంచిర్యాల నుంచి ఖమ్మం జిల్లా వెంకటాయపాలెం వరకు మొత్తం 1,157 హెక్టార్ల భూమి అవసరమవుతుందని నిర్ధారించారు. మంచిర్యాల నుంచి వరంగల్ వరకు మొత్తం 108.34 కిలోమీటర్ల నిడివికి గానూ 589 హెక్టార్లు అవసరమవుతుండగా ఆ భూమిని సేకరించేందుకు అధికారులు నోటిఫికేషన్ ఇచ్చి సంబంధిత భూ యజమానులైన రైతులకు నోటీసులు జారీ చేశారు. భూపాలపల్లి జిల్లాలోని చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి మండలాల్లోని రైతులు భూములిచ్చేది లేదని చెబుతున్నారు. 'పెద్దంపల్లిలో నాకు 1.20 ఎకరాలుంది. ఇందులోంచి 18 గుంటలు ప్రభుత్వం గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం తీసుకుంటోంది. వ్యవసాయం తప్ప వేరే జీవనాధారం లేని మేం ఉన్న భూమి కాస్తా పోతే ఎట్లా బతికేది? ప్రభుత్వం ఎకరానికి రూ.4.20 ధర కల్పిస్తామనడం చాలా బాధకరం. మార్కెట్ ధరకు అదనంగా 10 శాతం కలిపి పరిహారం ఇవ్వాలి. లేదంటే అంతే భూమి మరో చోటైనా ఇప్పిస్తే ఈ భూమి ఇచ్చేస్తా' అని పెద్దంపల్లికి చెందిన శాస్త్రాల కిరణ్ పేర్కొన్నారు.



మొగుళ్లపల్లిలో అధికారులతో వాగ్వాదానికి దిగిన రైతులు (ఫైల్)

మార్కెట్ ధర కల్పిస్తేనే భూమిస్తా



నాకు ఆశిరెడ్డిపల్లిలో 3.20 ఎకరాల సాగు భూమి ఉంది. గ్రీన్‌ఫీల్డ్ హైవేలో రెండెకరాలు పోతోంది. ప్రభుత్వం ఎకరానికి రూ.4.20 లక్షలు ఇస్తా అంటోంది. రెండెకరాల్లో 2 పంటలు పండిస్తే రూ.2లక్షల వరకు లాభమొస్తది. అలాంది నేను రూ.4లక్షలకు భూమిని ఎట్లా ఇయ్యాలే. మార్కెట్ ధర ఎకరానికి రూ.30లక్షల వరకు ఉంది. దానికి అనుగుణంగా ధర కల్పిస్తేనే ప్రభుత్వానికి భూమిచ్చేస్తా.

-బండారి మల్లయ్య, ఆశిరెడ్డిపల్లి

అర్బిట్రేషన్ కోరుతూ కేసు ఫైల్ చేయలేదు

గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతుల్లో ఎవ్వరూ అర్బిట్రేషన్ కోరుతూ మా వద్ద ఎలాంటి కేసు ఫైల్ చేయలేదు. ప్రభుత్వం ఇస్తున్న పరిహారం సరిపోకపోతే కలెక్టర్ వద్ద కేసు ఫైల్ చేస్తే విచారణ చేసి పరిహారం పెంచే ప్రయత్నం చేస్తాం. అప్పటికీ మేం పెంచే పరిహారం భూనిర్వాసితులకు సరిపోకపోతే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. గ్రీన్ ఫీల్డ్ హైవే భూసేకరణకు సంబంధించిన అంశాలపై చర్చించేందుకు సంబంధిత అధికారులతో ఈ నెల 15న సమీక్ష నిర్వహిస్తున్నాం.

-భవేశ్ మిశ్రా, జయశంకర్‌భూపాలపల్లి కలెక్టర్

ఘట్‌కేసర్-యాదాద్రి ఎంఎంటీ 'ఎస్'

» 33 కి.మీ రైల్వేలైన్ నిర్మాణం పరంగా ముందడుగు

» 60ఎకరాల భూసేకరణకు త్వరలోనే నోటిఫికేషన్

» రద్దీ, చార్జీల పరంగా ప్రయాణికులకు ఊరట

» భువనగిరి ఆర్డీవోకు భూసేకరణ బాధ్యతలు

యాదాద్రి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి యాదగిరిగుట్ట క్షేత్రానికి వెళ్లే భక్తులకు రద్దీ పరంగా త్వరలోనే ఊరట లభించే అవకాశాలున్నాయి. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సహా గ్రేటర్ పరిధిలో వివిధ ప్రాంతాల నుంచి రైళ్లలోనూ నారసింహుడి సన్నిధికి భక్తులు వెళ్లొచ్చు! ఈ మేరకు ఏడేళ్లగా పెండింగ్‌లో ఉన్న ఘట్‌కేసర్-యాదగిరిగుట్ట (రాయగిరి) ఎంఎంటీఎస్ రైలు మార్గం విస్తరణ పనుల్లో కీలక ముందడుగు పడనుంది. 33 కి.మీ మేర రైలు మార్గం నిర్మాణానికి భూసేకరణ కోసం త్వరలోనే రైల్వేశాఖ నోటిఫికేషన్ జారీ చేయనుంది. ఇందుకు 60 ఎకరాలు అవసరమవుతాయని ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అప్పట్లో యాదాద్రి ఆలయ పునర్నిర్మాణ పనులు మొదలవ్వడం.. నిర్మాణం పూర్తయ్యాక భక్తుల సంఖ్య భారీగా పెరుగుతుందనే అంచనాతో ఘట్‌కేసర్ దాకా ఉన్న ఎంఎంటీఎస్ లైన్‌ను రాయగిరి రైల్వే స్టేషన్ దాకా విస్తరించాలని అప్పటి బీఆర్ఎస్ సర్కారు నిర్ణయించింది. కేంద్ర, రాష్ట్ర భాగస్వామ్యంతో నిర్మించేందుకు 2016-17లో రూ.330 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి పంపగా కేంద్రం సరేనంది. తర్వాత రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వమే పట్టించుకోకపోవడంతో విస్తరణ పనులను రైల్వేశాఖ పెండింగ్‌లో పెట్టింది. అయితే భక్తుల సౌకర్యార్థం ఘట్‌కేసర్-రాయగిరి వరకు ఎంఎంటీఎస్ సేవలను విస్తరించాలని స్థానిక ప్రజాప్రతినిధులంతా కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. కేంద్రం అనుకూలంగా స్పందించింది. రాష్ట్ర ప్రభుత్వం వాటా లేకుండానే ఎంఎంటీఎస్ సేవలను విస్తరించేందుకు 2023లో నిర్ణయం తీసుకుంది. ఈక్రమంలో భూ సేకరణ కోసం త్వరలోనే టెండర్లు పిలవాలని రైల్వేశాఖ నిర్ణయించింది. రైల్‌వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌బీఎన్ఎల్) ద్వారా పనులు చేపట్టనున్నారు. అయితే అంచనా వ్యయం రూ.330 కోట్ల నుంచి రూ.412 కోట్లకు పెరగడం గమనార్హం.

భూసేకరణ బాధ్యతలు భువనగిరి ఆర్డీవో

ఘట్‌కేసర్ నుంచి రాయగిరి వరకు ఎంఎంటీఎస్ సేవలు విస్తరించనున్న నేపథ్యంలో భూసేకరణ అధికారిగా భువనగిరి ఆర్డీవోను నియమించాం. బీబీనగర్, భువనగిరి మండలాల్లోని పలు గ్రామాల నుంచి రైల్వేలైన్ ఏర్పాటు కానుంది. ఆయా గ్రామాల వారీగా భూసేకరణ కోసం సర్వే చేపట్టనున్నాం.

- హనుమంతు కె.జెండగే, కలెక్టర్, యాదాద్రి భువనగిరి జిల్లా

కొత్త ఎక్సైజ్ స్టేషన్లు ఇంకెప్పుడు?

14 స్టేషన్ల ఏర్పాటుకు గతంలోనే నిర్ణయం

131 కొత్త పోస్టులు, 8 చెక్‌పోస్టుల మంజూరు

నాలుగేళ్లు దాటుతున్నా అమలు కాని జీవో 94

హైదరాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ శాఖలో కొత్త స్టేషన్ల ఏర్పాటుకు ఇంకా మోక్షం కలగడంలేదు. ఇందుకు సంబంధించి నాలుగేళ్ల కిందటే జీవో విడుదలైనా ఎక్కడి గొంగడి అక్కడే అన్న చందంగా పరిస్థితి ఉంది. నకిలీ మద్యాన్ని అరికట్టడంతోపాటు లోటుపాట్లను అధిగమించేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఒకటి, జీహెచ్ఎంసీ పరిధిలో 13 ఎక్సైజ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. వీటితోపాటు 8 చెక్‌పోస్టులు, డిస్టిలరీ, కొత్త డిపోలు, ఎన్‌ఫోర్స్‌మెంట్, జిల్లా టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసేందుకు వీలుగా జీవో 94ను 2020 ఆగస్టులో విడుదల చేసింది. అడిషనల్ కమిషనర్, జాయింట్ కమిషనర్, ముగ్గురు డిప్యూటీ కమిషనర్లు, నలుగురు అసిస్టెంట్ కమిషనర్లు, 12 మంది సూపరింటెండెంట్లు, 18 మంది ఇన్‌స్పెక్టర్లు, 18 మంది సీనియర్ అసిస్టెంట్లు, 19 మంది కానిస్టేబుళ్లు, 25 ఆఫీస్ సూపరింటెండెంట్ పోస్టులతో కలిపి మొత్తం 131 పోస్టులను అదనంగా మంజూరు చేసింది. కొత్త వాహనాల కొనుగోలుకు అనుమతులు ఇచ్చింది. కానీ, జీవో 94 అమలైతే తమ ఆదాయానికి గండి పడుతుందని భావించి కొందరు ఉన్నతాధికారులు ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. గత ప్రభుత్వంలోని ఓ మంత్రి అండదండలతో జీవో అమలు కాకుండా అడ్డుకున్నారన్న ఆరోపణలున్నాయి. వాస్తవానికి ఆబ్కారీ శాఖ ద్వారా ఏడాదికి రూ.25వేల కోట్లకుపైగా ఆదాయం వస్తోంది. ఇందులో మూడోవంతు ఆదాయం జీహెచ్ఎంసీ పరిధిలోని దుకాణాల ద్వారానే సమకూరుతోంది. అక్రమ, నకిలీ మద్యం కేసులు కూడా నగరంలోనే ఎక్కువగా నమోదవుతున్నాయి. ఇక్కడ ఎక్సైజ్ స్టేషన్ల సంఖ్య పెంచితే అక్రమ, నకిలీ మద్యాన్ని అరికట్టే అవకాశం ఉంటుంది. తద్వారా పర్యవేక్షణ మరింత సులభం కావడంతోపాటు కొత్త పోస్టులతో మరింతమంది ఉద్యోగులకు పదోన్నతులు దక్కనున్నాయి. అంతేకాదు.. ఏటా రూ.3వేల కోట్ల మేర ఆదాయం పెరిగే అవకాశం ఉంటుందని ఆబ్కారీ శాఖ వర్గాలు చెబుతున్నాయి.

ఆగస్టు 15 తర్వాతే ఉద్యోగుల సమస్యలపై దృష్టి

» సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి

దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టీజీవో అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, టీఎన్‌జీవో కార్యదర్శి ముజీబ్ నేతృత్వంలో ఉద్యోగ సంఘాల ప్రతినిధులు బుధవారం ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డిని కలిశారు. పెండింగ్‌లో ఉన్న 4 డీఏలు, పీఆర్సీ వంటి అంశాలపై ఉద్యోగుల డిమాండ్లను నరేందర్‌రెడ్డికి వివరించారు. ఉద్యోగులకు సంబంధించిన సమస్యలన్నీ తమ దృష్టిలో ఉన్నాయని, ప్రస్తుతం రుణమాఫీ మీద ప్రభుత్వం దృష్టిసారించినందున ఆగస్టు 15 తరువాత ఉద్యోగుల సమస్యలపై సమావేశం అవుతామని ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో వేం నరేందర్ రెడ్డి చెప్పారు.

దాశరథి జయంత్యుత్సవాలను ఏడాదంతా జరపండి

» ప్రభుత్వానికి కేవీ రమణాచారి విజ్ఞప్తి

» ఆయన ఖైదీగా ఉన్న నిజామాబాద్ జైలును చారిత్రక ప్రదేశంగా తీర్చిదిద్దాలి: కిషన్‌రావు



హైదరాబాద్ సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నిజాం నిరంకుశ పాలనపై అక్షరాల 'అగ్నిధార'ను కురిపించిన కవి.. 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అంటూ ఈ నేల అస్తిత్వ గానాన్ని ఎలుగెత్తి చాటిన స్వాతంత్ర్య సమరయోధుడు.. అక్షర చైతన్య వారధి, పోరాటాల సారథి.. దాశరథి కృష్ణమాచార్య. ఆ తేజోమూర్తి శత జయంతి సంవత్సరం ఈ నెల 22 నుంచి మొదలుకానుంది. ఈ సందర్భంగా ఆ మహనీయుడి సాహిత్య స్ఫూర్తిని స్మరించుకోవడంతో పాటు, ఒక ప్రత్యేక కమిటీని నియమించి ఆయన గురించి ఈ తరానికి తెలియజేసేలా ఏడాది పొడవునా వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని.. తెలంగాణ ప్రభుత్వ మాజీ సాంస్కృతిక సలహాదారు కేవీ రమణాచారి ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అలాగే.. దాశరథి ఖైదు అనుభవించిన నిజామాబాద్ జైలును చారిత్రక ప్రదేశంగా తీర్చిదిద్దాలన్న ప్రయత్నం ఇంతవరకు ముందుకు సాగకపోవడం విచారకరమని.. ఆయన శతజయంతి సందర్భంగా అయినా, దీన్ని పూర్తిచేయాలని ప్రముఖ కవి ఆచార్య తంగెడ కిషన్‌రావు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. దాశరథి విగ్రహాన్ని రాజధాని నడిబొడ్డున ప్రతిష్ఠించడంతో పాటు ఏదైనా బహిరంగ ప్రదేశానికి ఆయన పేరు పెట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కాగా, బీఆర్ఎస్ ప్రభుత్వం 2015 నుంచి దాశరథి జయంతిని అధికారికంగా నిర్వహించే సంప్రదాయానికి నాంది పలికిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా ఏటా జూలై 22న సాహిత్య రంగంలో విశేష సేవలందిస్తున్న ఒక కవిని గుర్తించి, రవీంద్ర భారతి వేదికగా సత్కరించి దాశరథి సాహితీ పురస్కారంతో పాటు రూ. 1,01,116 నగదును అందిస్తున్నారు. ఈ ఏడాది కూడా దాశరథి జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు సర్కారు సన్నాహాలు చేస్తోంది. ఆ క్రమంలోనే ఆచార్య ఎన్.గోపీ అధ్యక్షతన అవార్డు ఎంపిక కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. మరో రెండు రోజుల్లో ఈ అవార్డుకు ఎంపికైన వ్యక్తి పేరును ప్రకటించనున్నారు.

పదోన్నతి పోస్టింగ్ ఇవ్వకుండానే... బదిలీల జాబితాలో పేర్లు..!

» ఈవోల బదిలీలు, పోస్టింగ్స్ ఉత్తర్వులు రేపు విడుదల?

» ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా చూడలన్న పలువురు ఈవోలు

హైదరాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): దేవాదాయ శాఖలో ఇటీవల కొందరు ఈవోలకు పదోన్నతులు వచ్చినా పోస్టింగ్ ఇవ్వలేదని పైగా బదిలీల జాబితాలో వారి పేర్లు నమోదు చేయడం వల్ల నిబంధనల ప్రకారం బదిలీల్లో అవకాశం ఉన్నవారికి అన్యాయం జరుగుతోందని పలువురు ఈవోలు వాపోతున్నారు. దేవాదాయ శాఖలో ఇటీవల పలువురు ఈవోలకు గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1కు, గ్రేడ్-3 నుంచి గ్రేడ్-2కు పదోన్నతులు లభించాయి. పదోన్నతులు వచ్చి రోజులు గడుస్తున్నా వారి హోదాకు తగ్గ పోస్టింగ్స్ ఇప్పటి వరకు ఇవ్వలేదు. పైగా బదిలీల జాబితాలో వారి పేర్లు నమోదు చేశారు. శుక్రవారం ఈవోల బదిలీలు, పోస్టింగ్స్‌కు సంబంధించి అధికారిక ఉత్తర్వులు వెలువడనున్న నేపథ్యంలో గ్రేడ్-1 ఈవోలుగా పదోన్నతి పొందిన వారు తమకు తగిన ప్రాంతంలో పోస్టింగ్ దక్కించుకునేందుకే ఉన్నతాధికారులతో కుమ్మక్కై ఈ విధానానికి పాల్పడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై దేవాదాయ శాఖ మంత్రి దృష్టి సారించి బదిలీల్లో అక్రమాలు, ఆరోపణలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని ఈవోలు కోరుతున్నారు.

వైద్యశాఖ బదిలీల్లో మోసం!

(మొదటిపేజీ తరువాయి)

వెల్లువెత్తుతున్నాయి. నిబంధనల ప్రకారం గుర్తింపు పొందిన సంఘాలలో అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శి, ట్రెజరర్‌లకు బదిలీల నుంచి మినహాయింపు ఉంటుంది. వైద్య ఆరోగ్య శాఖలో ప్రస్తుతం టీఎన్‌జీవో, టీజీవో సంఘాలకు మాత్రమే ప్రస్తుతం గుర్తింపు ఉంది. కానీ కాంగ్రెస్ అనుబంధ సంఘంగా ఉన్న ఐఎన్‌టీయూసీ(పబ్లిక్ హెల్త్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్)-3194 కింద కొందరు నేతలు ఒక్కో జిల్లా నుంచి 10-15 మందికి అలా మొత్తం రాష్ట్రవ్యాప్తంగా 300-350 మంది ఉద్యోగులకు ఆఫీస్ బేరర్లుగా తప్పుడు పత్రాలిచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఈ సంఘానికి ఎటువంటి గుర్తింపు లేదని వైద్యారోగ్యశాఖ ఉద్యోగులు, ఇతర సంఘాల నేతలు చెబుతున్నారు.

జిల్లాలను బట్టి వసూళ్ల పర్వం:

ఆఫీస్ బేరర్లుగా తప్పుడు పత్రాలిచ్చేందుకు ఆయా జిల్లాను బట్టి ఉద్యోగుల నుంచి డబ్బులు వసులు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ లాంటి జిల్లాల్లో రూ.3-4లక్షల వరకు, ఇతర జిల్లాల్లో అక్కడి పరిస్థితులను బట్టి రూ.25-50 వేల వరకు వసూలు చేసినట్లు తెలుస్తోంది. మొత్తంగా ఈ వ్యవహారంలో కోటిన్నర నుంచి రెండు కోట్ల వరకు వసూళ్లు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. సదరు సంఘం నేతల నుంచి ఆఫీస్ బేరర్ల పత్రాలు పొందిన వారిలో హెల్త్ అసిస్టెంట్ ఫీమేల్, మల్టీపర్పస్ హెల్త్‌సూపర్‌వైజర్ (ఎంపీహెచ్ఎస్)ఫీమేల్, మల్టీపర్పస్ హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్(ఎంపీహెచ్ఇవో), పబ్లిక్ హెల్త్‌నర్స్ (పీహెచ్ఎన్), ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్ట్, రేడియోగ్రాఫర్స్, అసిస్టెంట్ పారామెడికల్ ఆఫీసర్, మెడికల్ సోషల్ వర్కర్స్ ఉన్నారు.

దందాను ఆపి.. విచారణ చేపట్టాలి

అధికార పార్టీ అనుబంధ సంఘం పేరుతో జరిగిన ఈ దందాను ఆపాలని వైద్య ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ఇంతమంది ఆఫీస్‌బేరర్ల పేరిట బదిలీల నుంచి మినహాయింపు కోరుతుంటే ప్రజారోగ్య సంచాలకులు ఏం చేస్తున్నారని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ఈ దందాలో ఉన్నతాధికారులకు పాత్ర ఉందని ఆరోపిస్తున్నారు. దీనిపై తక్షణమే విచారణ జరిపించాలని, నిబంధనల మేరకు గుర్తింపు పొందిన సంఘాల్లోని ముగ్గురు లేదా నలుగురికే బదిలీల నుంచి మినహాయింపునివ్వాలని కోరుతున్నారు. సాధారణ ఉద్యోగుల బదిలీ హక్కులను కాపాడాలని, తప్పుడు పత్రాలను ఇస్తున్న సంఘంపై కఠిన చర్యలు తీసుకోవాలని సర్కారును తెలంగాణ వైద్య ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కర్నాటి సాయిరెడ్డి డిమాండ్ చేశారు.

ఇవేం బదిలీలు?

» ట్రాన్స్‌ఫర్లపై ప్రభుత్వ వైద్యుల్లో అసంతృప్తి

హైదరాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖలో బదిలీల పర్వం తీవ్ర గందరగోళానికి దారితీస్తోంది. ముఖ్యంగా వైద్యవిద్య సంచాలకుల(డీఎంఈ) పరిధిలోని బదిలీలపై అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డీఎంఈ పరిధిలో సాధారణ బదిలీ ప్రక్రియలో భాగంగా తప్పనిసరిగా ట్రాన్స్‌ఫర్ అయ్యే జాబితాను రూపొందించారు. ఇందులో ఉన్నవారంతా బదిలీల కోసం దరఖాస్తు చేసుకోమన్నారు. దాంతో ఇష్టంలేని అభ్యర్థులు కూడా బదిలీల కోసం అప్లై చేశారు. ఆ జాబితాలో ఉన్న వారందర్నీ నిర్బంధంగా బదిలీ చేస్తామని అధికారులు చెబుతున్నారని వైద్యులంటున్నారు. ముందు రెండు సంవత్సరాలకు పైగా పనిచేసిన వారిని బదిలీలకు దరఖాస్తు చేసుకోమన్నారని, తీరా చేశాక.. మ్యాండేటరీ జాబితాలో లేకపోతే బదిలీలు ఉండవంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ ఆ జాబితాలో లేకున్నా బదిలీ కావాలంటే.. ప్రభుత్వ ఉద్యోగి అయిన భార్య/భర్త ఉండాలి. భర్త చనిపోయి ఉండటం, ఒంటరి మహిళగా ఉండటం, మెడికల్ గ్రౌండ్ అంటే క్యాన్సర్ ఇతర దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులై ఉండాలి.. అప్పుడే ట్రాన్స్‌ఫర్‌కు అర్హులని అంటున్నారు. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న వందలో ఐదుగురికి కూడా న్యాయం జరుగుతుందన్న నమ్మకం లేదని తెలంగాణ ప్రభుత్వ బోధనాస్పత్రుల వైద్యుల సంఘం ప్రతినిధి డాక్టర్ మాదల కిరణ్ అసంతృప్తి వ్యక్తం చేశారు.

వైకల్య సర్టిఫికెట్ కోసం నకిలీ రేషన్ కార్డు

» వెలుగులోకి పూజా ఖేద్కర్ మరిన్ని మోసాలు



పుణె, న్యూఢిల్లీ, జూలై 17: వివాదాస్పద ట్రైనీ ఐఏఎస్ పూజా ఖేద్కర్ మోసాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటికే ఆమె శిక్షణను ప్రభుత్వం నిలిపివేయడంతోపాటు తగిన చర్యలు తీసుకునేందుకు ఆమెను లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్(ఎల్‌బీఎస్ఎన్ఏఏ)కు రావాలని ఆదేశించింది. ఐఏఎస్‌కు ఎంపికవడానికి దివ్యాంగుల రిజర్వేషన్‌ను ఆమె దుర్వినియోగం చేయడంపై దర్యాప్తు చేపట్టిన అధికారులు.. ఆమె దివ్యాంగ సర్టిఫికెట్ పొందడానికి నకిలీ రేషన్‌కార్డును చూపించారని, అందులో పేర్కొన్న అడ్రస్ కూడా తప్పుడు అడ్రస్ అని తాజాగా గుర్తించారు. పుణెలోని యశ్వంత్‌రావ్ చవాన్ మెమోరియల్(వైసీఎం) ఆస్పత్రి నుంచి వైకల్య సర్టిఫికెట్ పొందడానికి ఆమె పింప్రి చించ్వాడ్ ప్రాంతంలోని ప్లాట్ నంబరు-53, దెహు-అలాండి, తల్వాడే అనే అడ్రస్‌లో నివాసం ఉన్నట్టు దరఖాస్తులో పేర్కొన్నారు. అయితే, ఆ అడ్రస్‌లో థర్మోవెరిట ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ అనే మూతపడిన కంపెనీ ఉందని అధికారులు తాజాగా గుర్తించారు. పింప్రి చించ్వాడ్ మున్సిపాలిటీ పన్నుల విభాగం సమాచారం మేరకు ఆ కంపెనీ పేరిట రూ.2.7 లక్షల బకాయిలు ఉన్నాయి. నకిలీ రేషన్‌కార్డు పొందడానికి కూడా పూజా అదే అడ్రస్‌ను ఉపయోగించుకున్నట్టు తేలింది. మరోవైపు ఒక ఆడి కారు కొనుగోలుకు కూడా అదే అడ్రస్‌ను ఇచ్చినట్టు వెలుగులోకి వచ్చింది. తాను లోకోమోటర్ అనే వైకల్యంతో బాధపడుతున్నానంటూ ఆమె 2022 ఆగస్టు 24న వైఎంసీ ఆస్పత్రి నుంచి వైకల్య సర్టిఫికెట్ పొందారు. ఆమెకు మోకాలిలో 7% వైకల్యం ఉన్నట్టు ఆ సర్టిఫికెట్‌లో వైద్యులు పేర్కొన్నారు. మరోవైపు 2020 వరకు మహారాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు డైరెక్టర్‌గా పనిచేసిన పూజా తండ్రి దిలీప్ ఖేద్కర్ ఆదాయానికి మించి ఆస్తులను కూడగట్టారంటూ ఏసీబీ మంగళవారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. పూజా ఖేద్కర్ కుటుంబం నివసిస్తున్న భవనం వద్ద అక్రమ నిర్మాణానికి సంబంధించి పుణె మున్సిపల్ కార్పొరేషన్(పీఎంసీ) నోటీసు జారీ చేయడంతో ఆ నిర్మాణాన్ని తొలగించినట్టు ఒక అధికారి బుధవారం వెల్లడించారు. కాగా, భూ వివాదం, రైతును గన్‌తో బెదిరించినట్టు కేసు నమోదైనప్పటి నుంచి పూజ తల్లిదండ్రులు అదృశ్యంలో ఉన్నారు.

నకిలీ సర్టిఫికెట్లతో మరో యువ ఐఏఎస్..

2016 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి అసిఫ్ కె.యూసుఫ్(కేరళ) ఓబీసీ కేటగిరిలో రిజర్వేషన్ లబ్ధి పొందేందుకు ఆదాయ సర్టిఫికెట్‌ను ఫోర్జరీ చేసినట్టు తాజాగా వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశం మేరకు రాష్ట్ర యంత్రాంగం విచారణ చేపట్టింది. క్రీమీలేయర్ స్థాయి కంటే తక్కువ ఆదాయం ఉందంటూ తప్పుడు సమాచారంతో ఆయన ఓబీసీ సర్టిఫికెట్ పొందినట్టు దర్యాప్తులో తేలింది. యూసుఫ్ 2015 సివిల్ సర్వీసెస్ పరీక్షలో 215వ ర్యాంక్ సాధించారు. పూజా ఖేద్కర్, యూసుఫ్ వ్యవహారాలు వెలుగులోకి రావడంతో దేశవ్యాప్తంగా ఇలాంటి వేలాది కేసులపై లోతైన దర్యాప్తు చేపట్టాలని డిమాండ్లు వస్తున్నాయి.

లోకం తీరు



ఏపీకి అంటార్కిటికాతో భౌగోళిక సంబంధాలు!

న్యూఢిల్లీ, జూలై 17: ఆంధ్రప్రదేశ్‌కు దక్షిణ అమెరికా, ఆఫ్రికా, ఆస్ట్రేలియా, అంటార్కిటికాతో భౌగోళిక సంబంధాలున్నాయని హైదరాబాద్‌లోని ఎన్‌జీఆర్ఐ పరిశోధకుల బృందం తెలిపింది. అంటార్కిటికా, భారత్ ఒకప్పుడు ఒకే భూభాగంగా ఉండేవని, 150 కోట్ల సంవత్సరాల క్రితం అది విచ్ఛిన్నమై ఉంటుందని పేర్కొంది. వందల కోట్ల సంవత్సరాల క్రితం భారత్, తూర్పు అంటార్కిటికా ప్రాంతాలకు మధ్య భారీ ఘర్షణ జరిగినట్టు తమ పరిశోధనల్లో బలమైన ఆధారాలను గుర్తించామని వెల్లడించింది. భారత ఉపఖండానికి, అంటార్కిటికాకు మధ్య ఉన్న పురాతన భౌగోళిక సంబంధాన్ని వెలుగులోకి తెచ్చే క్రమంలో ఈ బృందం కొత్త, ఆసక్తికర విషయాలను కనుగొంది. ఏపీలోని దర్శి, అద్దంకి ప్రాంతాల కింద దాగిఉన్న శిఖరాన్ని గుర్తించింది.

2600 ఉద్యోగాలకు 25 వేలమంది!

» ముంబయి విమానాశ్రయం వద్ద తీవ్ర రద్దీ

ముంబయి, జూలై 17: విమానాశ్రయ లోడర్ ఉద్యోగాల కోసం ఎయిర్ ఇండియా ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ లిమిటెడ్ ముంబయి విమానాశ్రయం వద్ద చేపట్టిన భర్తీ కార్యక్రమం మంగళవారం దాదాపు తొక్కిసలాట వంటి పరిస్థితికి దారితీసింది. దీంతో దరఖాస్తులు ఇచ్చి వెళ్లిపోవాలని నిర్వాహకులు అభ్యర్థులను కోరాల్సి వచ్చింది. 2600 ఉద్యోగాల కోసం ఏకంగా 25000 మందికి పైగా రావడంతో ఈ పరిస్థితి నెలకొంది. చివరికి తమకు 25,000 దరఖాస్తులు అందినట్లు నిర్వాహకులు ప్రకటించారు. 200 మందిని ఇంటర్వ్యూలకు ఎంపిక చేశామన్నారు. ఈ సందర్భంగా ఇంటర్వ్యూ కేంద్రం వద్దకు వేలాది మంది పరుగులు తీస్తోన్న దృశ్యాలు, వాహనాలు, చెట్లపైకి ఎక్కి అక్కడికి వెళ్లేందుకు ప్రయత్నిస్తోన్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో కనిపించాయి. కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ప్రియాంక దీన్ని దృష్టిలో ఉంచుకొని బుధవారం 'ఎక్స్'లో ఒక పోస్టు చేశారు. కొద్ది రోజుల క్రితం ప్రధాని మోదీ ముంబయిలో మాట్లాడుతూ దేశంలో కోట్లమందికి ఉపాధి కల్పించి తాము రికార్డులు బద్దలు కొట్టామని పేర్కొన్నారన్నారు. అదే ముంబైకి వేలాది మంది నిరుద్యోగులు కేవలం కొన్ని ఉద్యోగాల కోసం వచ్చారని, ఇలా దేశంలో నిరుద్యోగం రికార్డులు బద్దలయ్యాయని ఎద్దేవా చేశారు.

నిరుద్యోగులకు నెలకు రూ. 6 నుంచి 10 వేలు

» కొత్త పథకాన్ని ప్రారంభించిన మహారాష్ట్ర సర్కారు

పుణె, జూలై 17: మహారాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. 'లాడ్లా భాయ్ యోజన' అనే పేరుతో ప్రకటించిన ఈ స్కీమ్ ద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగ శిక్షణతో పాటు స్టైపెండ్‌ను అందించనుంది. విద్యార్హతలను బట్టి ప్రతి నెలా స్టైపెండ్‌ను జమ చేయనున్నారు. పండరిపురంలో జరిగిన ఓ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ఈ పథకాన్ని ప్రకటించారు. 18-35 ఏళ్ల వయసు గల మహారాష్ట్రకు చెందిన వారు అర్హులు కాగా, 12 వ తరగతి, డిగ్రీ పూర్తిచేసినవారు ఈ పథకం ద్వారా లబ్ధి పొందనున్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు శిక్షణను అందించనున్నారు. ఆరు నెలల ఇంటర్న్‌షిప్ కాలంలో అర్హులైన వారికి భృతిని అందజేస్తారు. 12వ తరగతి పాసైన వారికి నెలకు రూ. 6 వేలు, డిప్లొమా చేసినవారికి నెలకి రూ. 8 వేలు, డిగ్రీ/పీజీ పూర్తిచేసినవారికి రూ. 10 వేల చొప్పున స్టైపెండ్‌ను చెల్లించనున్నారు.

అసోంలో 40 శాతానికి ముస్లిం జనాభా: హిమంత

న్యూఢిల్లీ, జూలై 17: అసోంలో మారుతున్న జనాభా నిష్పత్తి తనకో పెద్ద సమస్యగా మారిందని ఆ రాష్ట్ర సీఎం హిమంత బిశ్వ శర్మ అన్నారు. ప్రస్తుతం అసోంలో ముస్లిం జనాభా 40శాతానికి చేరిందని, 1951లో ఇది 12% మాత్రమేనని చెప్పారు. 'ఇప్పటికే మేం చాలా జిల్లాలు కోల్పోయాం. ఇది నాకు రాజకీయ అంశం కాదు.. జీవన్మరణ సమస్య' అని తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అసోంలో మత ఘర్షణలకు బంగ్లాదేశ్ నుంచి వచ్చిన మైనారిటీలే కారణమని పేర్కొన్నారు. అసోంలో మొత్తం 14 లోక్‌సభ సీట్లు ఉన్నాయి. ఇటీవలి ఎన్నికల్లో బీజేపీ-ఏజీపీ-యూపీపీఎల్ కూటమి 11 స్థానాలు గెలుచుకోగా, మిగిలిన 3 సీట్లను కాంగ్రెస్ దక్కించుకుంది. ఈశాన్య రాష్ట్రాల్లో కొంత పట్టుకోల్పోయిన బీజేపీ అక్కడ మొత్తం 24 స్థానాలకు గాను 15 సీట్లు గెలుచుకుంది. దీంతో.. 'ఈశాన్య రాష్ట్రాల్లో ఒక మతం మా ప్రభుత్వానికి పూర్తి వ్యతిరేకంగా పనిచేసింది' అని హిమంత వ్యాఖ్యానించారు.

రత్నభాండాగారంలో పురాతన విగ్రహాలు

భువనేశ్వర్, జూలై 17: పూరీ జగన్నాథ ఆలయంలోని రత్నభాండాగారం లోపలి గదిలో విలువైన లోహాలతో రూపొందించిన పురాతన విగ్రహాలను అధికారుల బృందం గుర్తించింది. వీటి గురించిన వివరాలు పాత జాబితాల్లో ఎక్కడా లేకపోవడం గమనార్హం. 'పురాతనమైన చిన్న విగ్రహాలు... బహుశా 5 నుంచి 7 వరకూ ఉండొచ్చు. గత నాలుగు దశాబ్దాలుగా ఎవరూ పట్టించుకోకపోవడంతో దాదాపు నల్లగా మారిపోయాయి. మేం ఎవ్వరమూ వాటిని తాకలేదు. వెంటనే ఒక దీపం వెలిగించి వాటికి పూజలు చేశాం. గురువారం వాటిని కూడా తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌కు తరలిస్తాం' అని రత్నభాండాగారంలోని ఖజానాను పర్యవేక్షించడానికి ఒడిశా ప్రభుత్వం నియమించిన 11 మంది సభ్యుల కమిటీ చైర్మన్ జస్టిస్ బిశ్వనాథ్ రథ్ చెప్పారు.

యూపీలో పోలీసు నిబంధనలపై ఒవైసీ మండిపాటు

హైదరాబాద్,జులై 17(ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లో ఆహార పదార్థాలు, తినుబండారాలు విక్రయించే దుకాణాల, బండ్ల యజమానులు విధిగా తమ పేరుతో బోర్డు రాయించుకోవాలన్న ఆ రాష్ట్ర పోలీసుల ఆదేశాలపై మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మండిపడ్డారు. కుట్రలో భాగంగానే యోగీ ప్రభుత్వం ఇదంతా చేస్తోందని, ముస్లిం దుకాణాల నుంచి ఆహార, వస్తు సామగ్రి కొనుగోలు చేయకూడదనే ఉద్దేశంతోనే ఇలాంటి నిబంధనలు అమలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి నిబంధనలనే దక్షిణాఫ్రికాలో వర్ణవివక్ష అని, హిట్లర్ జర్మనీలో 'జుడెన్‌బాయ్‌కాట్' అని పిలిచేవారని బుధవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు.

ఏడాదికి 2 సార్లు సీబీఎస్ఈ 12వ తరగతి పరీక్షలు!

న్యూఢిల్లీ, జూలై 17: సీబీఎస్ఈ పాఠశాలల్లో 12వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఏడాదికి రెండు సార్లు ప్రధాన పరీక్షలు(బోర్డు ఎగ్జామ్స్) నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. జాతీయ విద్యా విధానం 2020లోని జాతీయ పాఠశాల విద్యా ప్రణాళిక సిఫారసులను అమలు చేయాలని భావిస్తోంది. ఈ మేరకు 2026 జూన్ నుంచి ఏడాదికి రెండు సార్లు పరీక్షల నిర్వహణ చేపట్టేందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని కేంద్ర విద్యా శాఖ సీబీఎస్ఈని ఆదేశించింది. సీబీఎస్ఈ 12వ తరగతి విద్యార్థులకు ప్రస్తుతం ప్రతీ ఏటా ఫిబ్రవరి- మార్చి నెలల్లో ప్రధాన పరీక్షలు నిర్వహించి మే నెలలో ఫలితాలు ప్రకటిస్తున్నారు. ఆశించిన స్థాయిలో మార్కులు సాధించని విద్యార్థులకు జూలైలో జరిగే సప్లమెంటరీ పరీక్షలు రాసే అవకాశం ఇస్తున్నారు.

అణ్వస్త్రాలున్న పూర్తి ఇస్లామిక్ దేశం యూకే: వాన్స్

న్యూఢిల్లీ, జూలై 17: "లేబర్ పార్టీ అధికారంలోకి రావడంతో యునైటెడ్ కింగ్‌డమ్(యూకే) అణ్వస్త్రాలు కలిగిన మొట్టమొదటి 'పూర్తి ఇస్లామిక్ దేశం'గా మారింది" అంటూ అమెరికా రిపబ్లికన్ పార్టీ ఉపాధ్యక్ష అభ్యర్థి జేడీ వాన్స్ వివాదాస్పద, సంచలన వ్యాఖ్యలు చేశారు. గతవారం యూకేలోని కన్జర్వేటివ్ పార్టీ నేతల సదస్సులో వాన్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "అణ్వస్త్రాలు కలిగిన పూర్తి ఇస్లామిక్ దేశం ఏదని నాకు, నా మిత్రుడికి మధ్య చర్చ జరిగింది. మొదట ఇరాన్, పాకిస్థాన్ అని అనుకున్నాం. కానీ, లేబర్ పార్టీ అధికారంలోకి రావడంతో యూకే అణ్వస్త్రాలు కలిగిన 'పూర్తి ఇస్లామిక్ దేశం'గా మారిందని నిర్ణయానికి వచ్చాం" అని వ్యాఖ్యానించారు. వాన్స్‌ను ట్రంప్ రిపబ్లికన్ పార్టీ ఉపాధ్యక్ష అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత ఈ వ్యాఖ్యలు వైరల్ అయ్యాయి.

ఇన్‌స్టాలో దుబాయ్ యువరాణి ట్రిపుల్ తలాక్

న్యూఢిల్లీ, జూలై 17: దుబాయ్ యువరాణి షైకా మెహ్రా ఇన్‌స్టాగ్రామ్ వేదికగా విడాకులు ప్రకటించారు. దుబాయ్ రాజు కుమార్తె అయిన షైకా.. తన భర్త మొహమ్మద్ బిన్ రషీద్ నుంచి విడిపోతున్నట్లు మంగళవారం సామాజిక మాధ్యమం ద్వారా తెలిపారు. భర్తకు ట్రిపుల్ తలాక్‌తో విడాకులు ఇస్తున్నట్లు ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశారు. "ప్రియమైన భర్త, మీరు ఇతరుల సహచర్యం కోరుకున్నందుకు మీకు విడాకులు ఇవ్వాలని నిర్ణయించుకున్నా. మీకు విడాకులు ఇస్తున్నా. మీ మాజీ భార్య" అని ఇన్‌స్టాలో సంచలన పోస్టు చేశారు. షైకీ, మనా దంపతులకు మొదటి బిడ్డ పుట్టిన రెండు నెలలకే ఆమె విడాకులు తీసుకుంటున్నట్లు ప్రకటించడం చర్చనీయాంశమైంది. దుబాయ్ పాలకుడు, యూఏఈ ప్రధాని షేక్ మొహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్ కుమార్తె షైకా మెహ్రాకు, దుబాయ్ వ్యాపార వేత్త షేక్ మనా బిన్ కు 2023 మేలో వివాహం జరిగింది.

స్థానిక కోటాపై వెనక్కి!

(మొదటి పేజీ తరువాయి)



పక్కన పెడుతున్నామని సీఎం సిద్దరామయ్య బుధవారం రాత్రి ప్రకటించారు. ఈ అంశంపై తీవ్ర వివాదాలు తలెత్తడంతో బిల్లును వాయిదా వేస్తున్నామని సీఎం బుధవారం రాత్రి 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ప్రైవేట్ సంస్థలు, పరిశ్రమల్లో రిజర్వేషన్ల అంశానికి సంబంధించి కేబినెట్ తీర్మాన నిర్ణయాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. రానున్న మంత్రివర్గ సమావేశంలో సుదీర్ఘ చర్చల అనంతరం తదుపరి నిర్ణయాన్ని ప్రకటిస్తామని పేర్కొన్నారు. పారిశ్రామిక వర్గాల ఆందోళనపై డీసీఎం శివకుమార్ కూడా స్పందించారు. ఐటీ ఉద్యోగాల విషయంలో తాము జోక్యం చేసుకునేది లేదని స్పష్టం చేశారు. ఈ అంశంలో ఎలాంటి మినహాయింపు ఇవ్వాలో వారు ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రైవేట్ ఉద్యోగాల్లో 75% స్థానికులకే ఇవ్వాలని, మేనేజ్‌మెంట్ ఉద్యోగాల్లోనూ 50% ఇవ్వాలని రాష్ట్ర కేబినెట్ సోమవారం తీర్మానించింది. గురువారం నుంచి జరిగే శాసనసభ సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టి, ఆమోదించాలని భావించింది. అయితే ఈ నిర్ణయంపై పారిశ్రామిక నిపుణుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ పరిశ్రమల్లో సీ, డీ గ్రూప్ ఉద్యోగాలు వందశాతం కన్నడిగులకే తప్పనిసరి చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుందంటూ 'ఎక్స్'లో పోస్టు చేసిన సీఎం సిద్దరామయ్య, కాసేపటికే దాన్ని డిలీట్ చేశారు.

బోర్డులో ప్రభుత్వ అధికారులంటారా

ప్రైవేట్ సంస్థల్లో కన్నడిగులకు ఉద్యోగ రిజర్వేషన్ కల్పించేలా కేబినెట్‌లో తీర్మానించిన బిల్లును మార్చాలని ప్రముఖ పారిశ్రామికవేత్త, ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్ఓ మోహన్‌దాస్ పాయ్ అన్నారు. ఇదో నియంతృత్వమైన బిల్లు అని, రాజ్యాంగ వ్యతిరేకమైదని అభిప్రాయపడ్డారు. 'ప్రైవేట్ కంపెనీల్లో నియామకాల బోర్డులో ప్రభుత్వ అధికారులు వచ్చి కూర్చుంటారా..? ఇంటర్వ్యూ వేళ అభ్యర్థుల భాషను పరీక్షించి నియమించుకోవాలా? ఇటువంటి బిల్లు ముందుకు రావడం అసాధ్యం' అని ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. కర్ణాటక ప్రభుత్వ నిర్ణయాన్ని బయోకాన్ చైర్మన్ కిరణ్ మజుందార్‌షా తప్పుబట్టారు. ఐటీ బీటీ సంస్థలకు నిపుణులు అవసరమని, స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలనడం టెక్ సంస్థలకు నష్టం కలిగిస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. సాంకేతిక రంగంలో కర్ణాటక ముందంజలో ఉందని, దాన్ని ప్రభావితం చేసే బిల్లును అనుమతించకూడని సూచించారు. ప్రభుత్వ నిర్ణయం బెంగళూరులోని ఐటీ, గ్లోబల్ కంపెనీలకు నష్టం కలిగిస్తుందని ప్రముఖ పారిశ్రామికవేత్త, అసోచామ్ కర్ణాటక కో-చైర్మన్ ఆర్‌కే మిశ్రా అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం మేధావితనం చూపుతోందని, ఏ మాత్రం ముందుచూపు లేకుండా తీసుకున్న ఈ నిర్ణయం భారతీయ ఐటీ కంపెనీలను, గ్లోబల్ కేపబులిటీ సెంటర్స్‌ను బెదిరించేలా ఉందని ఆరోపించారు.

పునరాలోచన చేయాలి: నాస్కామ్

రాష్ట్రంలో పారిశ్రామిక రంగం పురోగతికి ఇటువంటి బిల్లులు అడ్డంకిగా మారతాయని నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీస్ కంపెనీస్ (నాస్కామ్) అభిప్రాయపడింది. ఇలాంటి నిర్ణయాలు ఉద్యోగులపైనా ప్రభావం చూపుతాయని, కర్ణాటకకు ఉండే గ్లోబల్ బ్రాండ్‌కు ఎదురుదెబ్బ తగులుతుందని పేర్కొంది. అంతర్జాతీయ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్న సమయంలో ఇలంటి నిబంధలతో అవి వెనక్కి పోయే ప్రమాదం ఉందని, ఈ నిర్ణయంపై పునరాలోచన చేయాలని ప్రభుత్వాన్ని కోరింది. ఇటువంటి ఆంక్షలతో నిపుణులైన అభ్యర్థులకు కొరత ఏర్పడి, సాఫ్ట్‌వేర్ కంపెనీలు తరలిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై చర్చించడానికి రాష్ట్ర అధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేయాలని కోరింది.

మా రాష్ట్రానికి రండి: లోకేశ్

అమరావతి, జూలై 17(ఆంధ్రజ్యోతి): కర్ణాటక ప్రభుత్వ నిర్ణయంపై నాస్కామ్ అసంతృప్తి వ్యక్తం చేసిన నేపథ్యంలో.. నాస్కామ్ ఆంధ్రప్రదేశ్‌కు రావాలని ఆ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ఆహ్వానించారు. 'మీ అసంతృప్తిని అర్థం చేసుకుంటున్నాం. మీ కంపెనీలను విస్తరించాలన్నా, మార్చుకోవాలనుకున్నా (రీలొకేట్) మా విశాఖపట్నంలోని ఐటీ, ఏఐ, డేటా సెంటర్ క్లస్టర్‌కు ఆహ్వానం పలుకుతున్నాం. ప్రభుత్వం వైపు నుంచి ఎలాంటి ఆంక్షలు ఉండవు' అని తెలిపారు.

నైపుణ్యం లేని కన్నడిగులకు శిక్షణ: పాటిల్

ప్రైవేటు సంస్థల ఉద్యోగాల్లో స్థానికులకు రిజర్వేషన్ అంశం దుమారం రేపడంతో భారీ పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్ బెంగళూరులో బుధవారం మీడియాతో మాట్లాడారు. పరిశ్రమల్లో కన్నడిగులకు కొన్ని కేటగిరీల ఉద్యోగాలు కల్పించినా, పారిశ్రామికవేత్తల ఆశయాలకు భంగం కలగకుండా చర్యలు ఉంటాయని చెప్పారు. దీనిపై సీఎంతోపాటు పలువురు నిపుణులతో చర్చిస్తామని పేర్కొన్నారు. నైపుణ్యం లేని కన్నడిగులకు శిక్షణలు ఇచ్చి.. ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ప్రస్తుత శాసనసభ సమావేశాల్లోనే బిల్లును ప్రవేశపెట్టి చట్టం తెస్తామని కార్మికమంత్రి సంతోష్‌లాడ్ పేర్కొన్నారు. కాగా, బిల్లుపై అందరి అభిప్రాయాలు తీసుకుంటామని ఐటీ బీటీ శాఖ మంత్రి ప్రియాంక్ ఖర్గే వెల్లడించారు. ఇదిలాఉండగా, కన్నడిగులకు రిజర్వేషన్ల నిర్ణయంపై కర్ణాటక రక్షణ వేదిక (కరవే) వ్యవస్థాపక అధ్యక్షుడు నారాయణ గౌడ హర్షం వ్యక్తం చేశారు.



రీల్స్ చేస్తూ ఆర్టీసీ బస్సు డ్రైవింగ్

» ఎడ్లబండిని ఢీ కొట్టడంతో కాడెద్దుల మృతి

బెంగళూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో వైరల్ అయ్యేందుకు రీల్స్ చేస్తూ ఓ ఆర్టీసీ డ్రైవరు కాడెద్దుల ప్రాణాలు తీశాడు. కర్ణాటక రాష్ట్రం హుబ్బళ్లి నుంచి బాగల్కోటకు కేఎస్ ఆర్టీసీ బస్సును నడుపుతున్న డ్రైవర్.. రీల్స్‌ను పోస్ట్ చేసే ప్రయత్నంలో ముందు వెళుతున్న ఎడ్లబండిని బుధవారం ఢీ కొట్టాడు. దీంతో రెండు ఎద్దులు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాయి. బండిలో ఉన్న ఇద్దరు రైతులకు తీవ్ర గాయాలయ్యాయి. బస్సులోని ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు.

పని పూర్తయ్యాక ఐటీ సిస్టమ్స్ లాగౌట్ చేయండి

» అధికారులకు ప్రధాని మోదీ సూచన



న్యూఢిల్లీ, జూలై 17: గత కొన్నేళ్లుగా ప్రభుత్వ వ్యవస్థలపై సైబర్ దాడులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ సీనియర్ అధికారులకు ఓ సూచన చేశారు. రోజూ పని పూర్తయిన తర్వాత ఐటీ సిస్టమ్స్‌ను లాగౌట్ చేయాలన్నారు. "రోజూ పని పూర్తయిన తర్వాత మీరు మీ ఐటీ సిస్టమ్స్‌ను లాగౌట్ చేస్తారా? సైబర్ సెక్యూరిటీకి ఇది చాలా ముఖ్యం" అని మోదీ ఇటీవల జరిగిన సమావేశంలో నొక్కి చెప్పినట్టు ఓ చానల్ పేర్కొంది. అలాగే రోజు చివర్లో అన్ని సిస్టమ్స్ లాగౌట్ అయినదీ లేనిదీ చూసే బాధ్యతను ప్రతి ఆఫీసులో ఒక వ్యక్తికి అప్పగించాలని సూచించినట్టు తెలిపింది. ఇంటికి వెళ్లే ముందు తన సిస్టమ్‌ను తానే లాగౌట్ చేస్తానని మోదీ చెప్పినట్లు పేర్కొంది.

చెలరేగుతున్న వియత్నాం హ్యాకర్లు

బెంగళూరు, జూలై 17: భారతీయ వాట్సాప్ వినియోగదారులను లక్ష్యంగా చేసుకొని వియత్నామీ హ్యాకర్లు చెలరేగిపోతున్నారు. నకిలీ ట్రాఫిక్ చలానాలను వాట్సాప్‌ఎకు పంపుతున్నారు. దానిని క్లిక్ చేయగానే 'వ్రాంబా' రకానికి చెందిన మాల్‌వేర్ ఫోన్‌లో ఇన్‌స్టాల్ అవుతుంది. ఏపీకే ఫైల్ ద్వారా ఓ యాప్ ఫోన్‌లో లోడ్ అవుతుంది. అది ఫోన్‌లోని కాంటాక్టులు, మెసేజ్‌లకు యాక్సెస్ అడుగుతుంది. దాని ద్వారా సదరు ఫోన్ యజమాని ఆర్థిక లావాదేవీలపై హ్యాకర్లు పట్టుసాధిస్తున్నారు. ఇప్పటి వరకూ 4,400 ఆండ్రాయిడ్ ఫోన్లు ఇలా హ్యాకర్ల బారిన పడ్డాయి. బాధితులు సుమారుగా రూ.16 లక్షలకు పైచిలుకు డబ్బులు కోల్పోయారు.

ప్రైవేటు రంగంలోనూ ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి: అథవాలే

న్యూఢిల్లీ, జూలై 17: ప్రైవేటు రంగంలోని ఉద్యోగాల్లో కూడా ఓబీసీ, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్ర సామాజిక న్యాయం, సాధికారిత శాఖ సహాయ మంత్రి రామ్‌దాస్ అథవాలే కోరారు. "ఎస్సీ, ఎస్టీకి చెందిన ఎంతో మంది ప్రైవేటు రంగంలోని ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారు. కాని వారికి ఎలాంటి రిజర్వేషన్లు లేవు. త్వరలోనే ప్రభుత్వ రంగంలోని సంస్థలు ప్రైవేటుగా మారే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రైవేటు రంగంలోని ఉద్యోగాల్లో ఓబీసీలకు కోటా కల్పించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను మా రిపబ్లికన్ పార్టీ డిమాండ్ చేస్తోంది" అని అన్నారు.

'సబ్‌కా సాత్..సబ్‌కా వికాస్' అక్కర్లేదు

కోల్‌కతా, జూలై 17: పశ్చిమ బెంగాల్ బీజేపీ సీనియర్ నేత సువేందు అధికారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ నినాదమైన 'సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్' అనవసరమన్నారు. దాని బదులు 'మాతో ఎవరో..వారితోనే మేము' అనే నినాదాన్ని ప్రతిపాదించారు. పార్టీలో మైనారిటీ మోర్చా కూడా అనవసరమన్నారు. రాష్ట్రంలో మైనారిటీల మద్దతు లేకపోవడం వల్లే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సీట్లు తగ్గిపోయాయని పేర్కొన్నారు.

యూపీ బీజేపీలో ముసలం

సీఎం యోగి, డిప్యూటీ సీఎం కేపీ మౌర్య మధ్య విభేదాలు

» ప్రభుత్వం కంటే పార్టీ పెద్దదని వ్యాఖ్యానించిన మౌర్య
» యోగి తీరుకు నిరసనగా క్యాబినెట్ భేటీలకూ డుమ్మా
» ప్రధాని మోదీని కలిసిన యూపీ బీజేపీ చీఫ్ భూపేంద్ర



న్యూఢిల్లీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీలు ఎన్నికల్లో విజయాలు సాధించినంతవరకూ అంతా బాగున్నట్టే అనిపిస్తుంది! కానీ.. ఒక్కసారి ఓటమి ఎదురైతే.. పార్టీల్లో లోపాలు, అంతర్గత విభేదాలు ఒక్కసారిగా బయటపడతాయి. ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో అనుకున్న స్థాయిలో సీట్లు రాకపోవడం.. 33 సీట్లకే పరిమితం కావడంతో యూపీ బీజేపీలో ఇప్పుడు అదే జరుగుతోంది. సీఎం యోగి ఆదిత్యనాథ్, ఉప ముఖ్యమంత్రి కేశవ్‌ప్రసాద్ మౌర్య మధ్య చాలాకాలంగా ఉన్న విభేదాలు ఎన్నికల ఫలితాల నేపథ్యంలో మరింత పెరిగాయి. యూపీలో లోక్‌సభ ఎన్నికల్లో సీట్లు తగ్గడానికి యోగి పనితీరే కారణమనే విమర్శలు జోరందుకున్నాయి. ఈ క్రమంలోనే.. "ప్రభుత్వం కంటే పార్టీ పెద్దది. పార్టీ కంటే ఎవరూ పెద్ద కాదు" అని కేపీ మౌర్య చేసిన వ్యాఖ్య సంచలనం సృష్టించింది. ఆయన ఆ వ్యాఖ్యలు యోగి ఆదిత్యనాథ్‌ను ఉద్దేశించే చేశారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అలాగే. యోగి ఆదిత్యనాథ్ వైఖరికి నిరసనగా ఇటీవలికాలంలో ఆయన క్యాబినెట్ సమావేశాలకు కూడా హాజరు కావట్లేదు. ఈ పరిణామాల నేపథ్యంలో ఆయన ఢిల్లీకి చేరుకుని పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను కలిశారు. ఆయనొక్కరే కాదు.. యూపీ బీజేపీకి చెందిన పలువురు నేతలు కొద్దిరోజులుగా ఢిల్లీలో తిష్టవేసి జాతీయ నాయకత్వాన్ని కలిసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు.. యూపీ బీజేపీ చీఫ్ భూపేంద్ర చౌదరి కూడా ఢిల్లీలో నడ్డాను, ప్రధాని మోదీని కలిశారు. సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ అనుకున్నస్థాయిలో సీట్లు సాధించలేకపోవడానికి బాధ్యత వహిస్తూ సారథ్య బాధ్యతల నుంచి తాను తప్పుకొంటానని ఆయన మోదీకి చెప్పినట్టు సమాచారం. ఈ విషయం తెలియగానే కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రధాని నివాసానికి చేరుకున్నారు. ఈ అంశంతోపాటు.. యూపీలో పార్టీ ప్రక్షాళన, ఇతర కీలక అంశాల గురించి, తదుపరి కార్యాచరణ ప్రణాళిక గురించి వారు చర్చించినట్టు తెలిసింది. జాట్ సామాజికవర్గానికి చెందిన భూపేంద్రచౌదరి స్థానంలో.. ఒక ఓబీసీ నేతను పార్టీ సారథిగా నియమించి 2027 ఎన్నికలకు వెళ్లేందుకు బీజేపీ సిద్ధమైనట్టు విశ్వసనీయవర్గాల ద్వారా తెలుస్తోంది. అలాగే.. 2017లో పార్టీ రాష్ట్ర సారథిగా అద్భుత విజయాన్ని కట్టబెట్టిన కేపీ మౌర్య ఓబీసీ కావడం, ఆయనకు ఆరెస్సెస్ మద్దతు కూడా బలంగా ఉండడంతో.. రాష్ట్రంలో నెలకొన్న సంక్షోభాన్ని సరిదిద్దేందుకు ఆయనకు పార్టీలో మంచి పదవి కట్టబెట్టే అవకాశం ఉందని సమాచారం.

అజిత్ పవార్‌కు 'మహా' షాక్

» నలుగురు ఎన్సీపీ నేతల రాజీనామా
» శరద్ పార్టీలో చేరతారని ప్రచారం

ముంబై, జూలై 17: మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలవేళ అజిత్ పవార్ నేతృత్వంలోని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీకి (ఎన్సీపీ) ఎదురుదెబ్బ తగిలింది. నలుగురు ముఖ్యమైన నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేశారు. త్వరలో వారంతా శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ (ఎస్పీ)లో చేరే అవకాశం ఉంది. ఇటీవల ముగిసిన లోక్‌సభ ఎన్నికల్లో ఎన్సీపీ మహారాష్ట్రలో చతికిలబడింది. ఆ పార్టీ ఒక్క ఎంపీ సీటును మాత్రమే దక్కించుకుంది. ఎన్సీపీకి చెందిన కొందరు ఎమ్మెల్యేలు తమ సంప్రదింపుల్లో ఉన్నారని ఎన్సీపీ(ఎస్పీ) అధ్యక్షుడు శరద్ పవార్ ఇటీవల ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే ఆ పార్టీ నుంచి రాజకీయ వలసలు మొదలయ్యాయి. పింప్రీ-చించ్వాడ్ యూనిట్ చీఫ్ అజిత్ గవహానే, యశ్ శనే, రాహుల్ భోస్లే, పంకజ్ భలేకర్‌లు ఎన్సీపీకి రాజీనామా చేశారు. తిరిగి శరద్ పవార్ శిబిరంలోకి వెళ్లే ఆలోచనలో అజిత్ పవార్ క్యాంపునకు చెందిన మరికొందరు నేతలు కూడా ఉన్నట్టు వార్తలు వస్తున్నాయి. ఇదిలాఉండగా, లోక్‌సభ ఎన్నికల్లో ఎన్సీపీతో పొత్తే బీజేపీని మహారాష్ట్రలో ముంచిందని ఆర్ఎస్ఎస్ సంచలన వ్యాఖ్యలు చేసింది. ఆర్ఎస్ఎస్‌కు చెందిన మరాఠా వారపత్రిక 'వివేక్'లో దీనిపై ఒక విశ్లేషణాత్మక వ్యాసం ప్రచురించారు. అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీతో చేతులు కలిపినప్పటినుంచి మహారాష్ట్ర ప్రజల దృష్టిలో బీజేపీ ప్రతిష్ఠ తగ్గిపోవడం మొదలైందని ఆ వ్యాసంలో స్పష్టం చేశారు.

12 మంది మావోయిస్టుల మృతి

» గడ్చిరోలిలో ఎన్‌కౌంటర్.. మృతుల్లో తిప్పగడ్డ దళం ఇన్‌చార్జి ఆత్రం లక్ష్మణ్

చర్ల/మహదేవపూర్, జులై 17: దండకారణ్యంలో మరోసారి నెత్తురోడింది. మహారాష్ట్ర-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని గడ్చిరోలి అడవుల్లో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 12 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఘటనలో సీ-60 బలగాలకు చెందిన ఒక ఎస్సై, మరో జవాన్ గాయపడ్డారు. పోలీసులు ఘటనా స్థలం నుంచి అత్యంత అధునాతన తుపాకులను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఉదయం గడ్చిరోలి ఎస్పీ నీలోత్పల్ కథనం ప్రకారం.. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని గడ్చిరోలి, కాంకేర్ జిల్లాల అడవుల్లో 12 నుంచి 15మంది మావోయిస్టులు సమావేశమైనట్లు పోలీసులు సమాచారం అందుకున్నారు. దీంతో సీ-60 బలగాలు ఉదయం 7 గంటల సమయంలో కూంబింగ్ ప్రారంభించారు. 10 గంటల సమయంలో వారికి నక్సలైట్లు తారసపడ్డారు. ఆరు గంటల పాటు ఇరువైపులా కాల్పులు జరిగాయి. సాయంత్రం 4 గంటల సమయంలో నక్సల్స్ వైపు నుంచి కాల్పులు నిలిచిపోవడంతో.. బలగాలు ముందుకు దూసుకెళ్లాయి. అక్కడ 12 మంది మావోయిస్టుల మృతదేహాలను, మూడు ఏకే-47 తుపాకులు ఇతర ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాయి. మృతుల్లో గడ్చిరోలి డివిజన్ కమిటీ సభ్యుడు, తిప్పగడ్డ దళ ఇన్‌చార్జి ఆత్రం లక్ష్మణ్ అలియాస్ ఆత్రం విశాల్ మృతిచెందినట్లు ఎస్పీ వివరించారు. అతను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందినవాడని అనుమానిస్తున్నారు. మిగతా 11 మంది నక్సల్స్‌ను గుర్తించాల్సి ఉందని తెలిపారు. కాగా.. గడిచిన ఏడు నెలల్లో దండకారణ్యంలో 10 భారీ ఎన్‌కౌంటర్లు జరగ్గా.. 148 మంది మావోయిస్టులు మృతి చెందారు. మావోయిస్టు పార్టీ ప్రతీ సంవత్సరం జూలై 28 నుంచి వారంరోజుల పాటు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను నిర్వహిస్తుంది. ఈ ఏడాది వరుస ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో 20 రోజుల ముందుగానే వారోత్సవాలు నిర్వహించేందుకు పార్టీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ క్రమంలోనే భారీ ఎన్‌కౌంటర్ జరగడంతో వారికి గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లయింది.

పంచెకట్టుతో వచ్చాడని రైతుకు నో ఎంట్రీ..!

» బెంగళూరులో అన్నదాతకు అవమానం

బెంగళూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరంలోని జీటీ వరల్డ్ మాల్‌లో సినిమా చూసేందుకు వచ్చిన రైతుకు అవమానం జరిగింది. పంచె కట్టుతో వచ్చాడని ఆ రైతుని సిబ్బంది లోనికి వెళ్లకుండా అడ్డుకోవడం వివాదానికి దారితీసింది. కర్ణాటకలోని హావేరి జిల్లాకు చెందిన నాగరాజు అనే వ్యక్తి తన తల్లిదండ్రులతో కలిసి మంగళవారం మాగడి రోడ్డులోని జీటీ మాల్‌కు సినిమాకు వెళ్లారు. పంచెకట్టుతో ఉన్న నాగరాజు తండ్రిని చూసి ప్రవేశ ద్వారం వద్ద సిబ్బంది లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. నాగరాజు జీటీ మాల్ సిబ్బందితో అరగంటకుపైగా వాదించినా వారు అంగీకరించ లేదు. వాగ్వాదం జరుగుతున్న సమయంలో కొందరు వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. అవి వైరల్ అయ్యాయి. జీటీ మాల్ సిబ్బంది తీరుపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమైంది. రైతు సంఘాలు, కన్నడ సంఘాల సభ్యులు బుధవారం పంచెకట్టుతో వెళ్లి జీటీ మాల్ ముందు నిరసన తెలిపారు.

పండగలా మాఫీ

(మొదటిపేజీ తరువాయి)

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులు, టీపీసీసీ నాయకులతో జరిగిన సమావేశంలో రుణ మాఫీపై సంబరాల నిర్వహణకు సంబంధించి ఆయన దిశానిర్దేశం చేశారు. "పార్టీకి నష్టమని తెలిసీ.. ఆనాడు సోనియాగాంధీ సాహసోపేత నిర్ణయం తీసుకున్నారు. మాటకు కట్టుబడి తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారు. గాంధీ కుటుంబం మాట ఇస్తే అది శిలాశాసనం. రైతు రుణమాఫీ చేస్తామని 2022 మే 6న వరంగల్ సభలో రాహుల్ గాంధీ మాట ఇచ్చారు. ఆయన మాట ఇచ్చారంటే అది చేసి తీరుతారన్న నమ్మకాన్ని ప్రజలకు కలిగించడం మన బాధ్యత" అని వ్యాఖ్యానించారు. దేశంలో ఏ రాష్ట్రం కూడా రూ.31వేల కోట్లతో రుణ మాఫీ అమలు చేయలేదని, తెలంగాణలో జరుగుతున్న ఈ కార్యక్రమంపై జాతీయ స్థాయిలో చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ రైతులకు రాహుల్ గాంధీ ఇచ్చిన గ్యారెంటీని అమలు చేశామని పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావించాలని కాంగ్రెస్ ఎంపీలకు సూచించారు. గతంలో కేసీఆర్ పదేళ్ల పాటు అధికారంలో ఉండి కూడా రైతులకు సంబంధించిన రూ.28వేల కోట్ల రుణాలను మాఫీ చేయలేక పోయారన్నారు. కానీ.. ఆగస్టు 15లోగా రుణ మాఫీ చేస్తామని పార్లమెంట్ ఎన్నికల ప్రచారం సందర్భంగా తాము హామీ ఇచ్చామని తెలిపారు. ఆర్థిక నిపుణులు సైతం ఇప్పటికిప్పుడు రుణ మాఫీ కష్టమని, ప్రభుత్వానికి ఇబ్బందులు ఎదురవుతాయని చెప్పారని గుర్తు చేశారు. కానీ, ఆ ఇబ్బందులను అధిగమించి రుణ మాఫీ హామీని నిలబెట్టుకున్నామంటూ సగర్వంగా ప్రజలకు చాటాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మంచి పనిని వివరించాలని పార్టీ ముఖ్య నాయకులు, టీపీసీసీ కార్యవర్గానికి సూచించారు.



ప్రజాభవన్‌లో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్, చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల

7 నెలల్లోనే రుణ మాఫీ చేస్తున్నాం: భట్టి

ఆగస్టు నెల దాటకుండానే రూ.2లక్షల మేర రుణ మాఫీని పూర్తి చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రుణ మాఫీని చేపట్టేందుకు నిద్ర లేని రాత్రులు గడిపామని, రూపాయి.. రూపాయి పోగుచేసి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామని వెల్లడించారు. రేషన్ కార్డులు లేని 6 లక్షల మంది రైతు కుటుంబాలకూ రుణ మాఫీ వర్తింపజేస్తామన్నారు. ఈ అంశాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. మిగులు బడ్జెట్‌తో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్.. రూ.లక్ష మేర రుణ మాఫీని నాలుగు వాయిదాల్లో పూర్తి చేసిందని గుర్తు చేశారు. రూ.7లక్షల కోట్ల అప్పులు ఉండగా అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఏడు నెలల వ్యవధిలోనే రూ. 2లక్షల మేర రైతుల రుణాలను మాఫీ చేస్తోందన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. ఐదు గ్యారెంటీలు అమలు చేస్తున్నామని, అయితే అనుకున్నంతగా ఈ పథకాలపై ప్రచారం జరగట్లేదన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ చేస్తుందని వివరిస్తూ ప్రజల హృదయాలను గెలవాలని సూచించారు. కాగా, రుణాల మాఫీకి శ్రీకారం చుడుతున్న నేపథ్యంలో ప్రజా భవన్‌లో బుధవారం ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చరణ్ కౌశిక్ తదితరులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

11.42 లక్షల మంది ఖాతాల్లోకి నగదు

సీఎం చేతుల మీదుగా 20 మందికి చెక్కులు

రూ.7వేల కోట్లను సిద్ధంగా ఉంచిన సర్కారు

హైదరాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతు రుణాల మాఫీకి రంగం సిద్ధమైంది. గురువారం సాయంత్రం 4గంటలకు ముహూర్తం ఖరారైంది. తొలి విడతలో రూ.లక్ష లోపు రుణాలను కాంగ్రెస్ ప్రభుత్వం మాఫీ చేయనుంది. సచివాలయంలోని ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి బటన్ క్లిక్ చేయగానే.. నేరుగా రైతుల ఖాతాల్లోకి ఏకకాలంలో రుణ మాఫీ సొమ్ము జమ కానుంది. సుమారుగా 11.42 లక్షల మంది లబ్ధిదారులకు రుణ మాఫీ కింద సుమారుగా రూ.7వేల కోట్లను ప్రభుత్వం వెచ్చించనుంది కాగా, రైతులను మూడు కేటగిరీలుగా విభజించి రుణ మాఫీ చేయాలని సర్కారు నిర్ణయించింది. తొలి విడతలో రూ.లక్ష లోపు, రెండో విడతలో రూ.1.50లక్షల వరకు, మూడో విడతలో రూ.2లక్షల వరకు రుణాలను మాఫీ చేయనుంది. బ్యాంకులు, పీఏసీఎస్‌ల నుంచి ఇప్పటికే సేకరించిన వివరాలన్నింటినీ నేషనల్ ఇన్‌ఫర్మేటిక్ సెంటర్‌లో విశ్లేషిస్తున్నారు. మొత్తంగా రుణ మాఫీ పరిధిలోకి వచ్చే రైతు కుటుంబాలు 40లక్షలు ఉన్నట్లు లెక్క తేలింది. రూ.లక్షలోపు రుణాలు ఉన్న రైతుల వివరాలను జిల్లాల వారీగా బుధవారం సాయంత్రమే కలెక్టర్లు, డీఏవోలకు పంపించారు. మరోవైపు.. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం ఉదయం 10గంటలకు ప్రజాభవన్‌లో రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఇందులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతోపాటు ఆర్థిక, వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. రూ.లక్ష లోపు రుణమాఫీకి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశంపై బ్యాంకర్లకు సీఎం దిశానిర్దేశం చేయనున్నారు. మాఫీ అయిన మేరకు మళ్లీ కొత్తగా పంట రుణాలు ఇవ్వడంపై ఆదేశాలు ఇవ్వనున్నారు. కాగా, రైతు బంధు మాదిరిగానే ఈ-కుబేర్ సాఫ్ట్‌వేర్ సాయంతో రుణమాఫీ నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఈ మేరకు వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి... ఇప్పటికే ప్రొసీడింగ్స్ తీసి ట్రెజరీకి పంపించారు. రుణ మాఫీకి శ్రీకారం చుట్టే కార్యక్రమంలో భాగంగా రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలకు చెందిన 20 మంది రైతులకు సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు కలిసి చెక్కులు పంపిణీ చేయనున్నారు. అనంతరం వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి రైతులను ఉద్దేశించి మాట్లాడనున్నారు. కాగా, ఈ నెలాఖరులోపు రూ. 1.50లక్షల వరకు ఉన్న రుణాలు, ఆగస్టు మొదటివారంలో రూ. 2లక్షల వరకు ఉన్న రుణాలను మాఫీ చేసేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించుకుంది. మొత్తం రుణమాఫీకి రూ.31వేల కోట్లు అవసరమవుతాయని అంచనాలు ఉండగా.. ప్రస్తుతం వెచ్చిస్తున్న రూ.7వేల కోట్లు కాకుండా, మరో రూ.24వేల కోట్లను ప్రభుత్వం సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. ఖరీఫ్ సీజన్‌లోనే రుణ మాఫీ పూర్తి చేస్తే... మళ్లీ రైతులు పంట రుణం తీసుకునే అవకాశం ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. అనుకున్నది అనుకున్నట్లు జరిగితే పంద్రాగస్టులోపు రైతులు రుణ విముక్తులు కానున్నారు. కాగా, గురువారం సాయంత్రం 4గంటలకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతు వేదికలు, మండల కేంద్రాల్లో సంబరాలు చేపట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చింది. రుణ మాఫీ నిధులు జమ చేసిన రైతులను ఉద్దేశించి సీఎం రేవంత్ మాట్లాడనున్న నేపథ్యంలో రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లను సిద్ధం చేశారు. ఎక్కడికక్కడ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు ఈ సంబరాల్లో పాల్గొననున్నారు.

'విద్యుత్ కొనుగోలు విచారణ కమిషన్'కు కొత్త చైర్మన్‌పై నేడు ఉన్నతస్థాయి భేటీ

» 22కల్లా నియామకం పూర్తి చేయాలని సర్కారు యోచన

హైదరాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో విద్యుత్ కొనుగోలు ఒప్పందాల్లో అవకతవకలు జరిగాయన్న అభియోగాలపై నియమించిన విచారణ కమిషన్ చైర్మన్ పదవి నుంచి జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి తప్పుకోవడంతో ఆ బాధ్యతలు ఎవరికి అప్పగించాలనే దానిపై ప్రభుత్వం గురువారం ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించనుంది. హైకోర్టు మాజీ న్యాయమూర్తులు లేదా మాజీ ప్రధాన న్యాయమూర్తులు, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తుల్లో ఒకరికి విచారణ బాధ్యతలు అప్పగించాలనే యోచనలో ప్రభుత్వం ఉంది. కమిషన్‌కు కొత్త చైర్మన్ కోసం హైకోర్టు రిజిస్ట్రార్‌కు లేఖ రాయాలని ఇప్పటికే నిర్ణయించారు. కాగా, కమిషన్ విచారణలో ఇప్పటికే పలు ప్రక్రియలు పూర్తయ్యాయి. ఈ నెలాఖరున కమిషన్ గడువు కూడా తీరనుంది. ఈ నేపథ్యంలోనే న్యాయవివాదాలతో కమిషన్ చైర్మన్ తప్పుకోవడంతో విచారణ మళ్లీ మొదటికి వచ్చినట్లైంది. 22వ తేదీ కల్లా కమిషన్ చైర్మన్ నియామకం పూర్తిచేయాలని ప్రభుత్వం యోచిస్తోంది.

కుక్కలపై ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ నెంబర్

» పశు వైద్యులు, స్వచ్ఛంద సంస్థలతో నిపుణుల కమిటీ

» అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు

» కుక్కల దాడిలో రెండేళ్ల చిన్నారి మృతిపై దిగ్భ్రాంతి

హైదరాబాద్, జూలై 17(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జవహర్ నగర్‌లో వీధికుక్కల దాడిలో రెండేళ్ల బాలుడు మృతి చెందడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను చాలా కలచివేసిందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని బుధవారం అధికారులను ఆదేశించారు. చిన్నారులపై తరచూ కుక్కల దాడులు పెరుగుతున్న నేపథ్యంలో.. అధికారులను అప్రమత్తం చేసిన సీఎం, స్థానికుల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు కాల్ సెంటర్ లేదా టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కుక్కల దాడులపై అధ్యయనం చేయాలని, బ్లూ క్రాస్, ఇతర స్వచ్ఛంద సంస్థలు, వెటర్నరీ డాక్టర్లతో నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. కుక్కల బెడదను అరికట్టడానికి గాను వాటికి టీకాలు వేయడం, ఇతర భద్రతా పద్ధతులను అనుసరించాలన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని పట్టణ ఆరోగ్య కేంద్రాలు, రాష్ట్రంలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రుల్లో కుక్కకాటు బాధితులకు వైద్యం అందించేందుకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని వైద్య ఆరోగ్యశాఖను ముఖ్యమంత్రి ఆదేశించారు. కుక్కల దాడి ఘటనలను అరికట్టేందుకు అన్ని బస్తీలు, కాలనీ సంఘాలు సహకరించాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ, మున్సిపల్ అధికారులను సీఎం రేవంత్ కోరారు.



కాలిఫోర్నియా విశ్వవిద్యాలయ ఆర్థికశాస్త్ర ఆచార్యుడు కార్తిక్ మురళీధరన్‌తో సీఎం రేవంత్, ఉప ముఖ్యమంత్రి భట్టి

సీఎంను కలిసిన కాలిఫోర్నియా యూనివర్సిటీ ప్రొఫెసర్

కాలిఫోర్నియా విశ్వవిద్యాలయ ఆర్థికశాస్త్ర ఆచార్యుడు(టాటా చాన్స్‌లర్స్ ఆఫ్ ఎకనామిక్స్) కార్తిక్ మురళీధరన్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. బుధవారం జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పలు అంశాలపై వీరిద్దరు కాసేపు ముచ్చటించారు. వీరి వెంట ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా ఉన్నారు.

4 నెలల్లో నైనీ బొగ్గు బ్లాక్ నుంచి ఉత్పత్తి

» ప్రణాళికా బద్ధంగా పని చేయాలి:భట్టి విక్రమార్క

సింగరేణి సంస్థకు ఒడిశాలో కేటాయించిన నైనీ బొగ్గు బ్లాక్‌కు నుంచి మరో నాలుగు నెలల్లో ఉత్పత్తి ప్రారంభించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన సచివాలయంలో సంబంధిత అధికారులతో ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం తరపున తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. బొగ్గు బ్లాక్‌కు ఉత్పత్తికి సంబంధించి మిగిలిన పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రం బయట సింగరేణి చేపడుతున్న తొలి ప్రాజెక్టు అయిన నైనీలో బొగ్గు ఉత్పత్తికి ప్రణాళికా బద్ధంగా పని చేయాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు.

పాస్‌బుక్ ఆధారంగానే రుణమాఫీ: దుద్దిళ్ల

ఆమనగల్లు/కడ్తాల్, జూలై 17(ఆంధ్రజ్యోతి): రైతు రుణమాఫీకి రేషన్ కార్డు ప్రామాణికం కాదని, పాస్‌బుక్ ఆధారంగానే రుణమాఫీ చేయనున్నట్లు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ భవనాన్ని బుధవారం మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి తదితరులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం సర్వారెడ్డిపల్లి గ్రామంలో బహుళజాతి కంపెనీల సహకారంతో రూ.800ల కోట్లతో వెయ్యి ఎకరాలలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించినట్లు ఆయన తెలిపారు. రుణమాఫీ విషయంలో ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందనితెలిపారు. విపక్షాల నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని, వారి మాటలను నమ్మొద్దన్నారు.



మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌తో మంత్రి సీతక్క, ఎమ్మెల్యే పద్మావతి ఉత్తమ్

మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన నేరెళ్ల శారద

హైదరాబాద్, రాంగోపాల్‌పేట్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద బుధవారం హైదరాబాద్ బుద్ధ భవన్‌లోని కమిషన్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శారద మాట్లాడుతూ... తనను మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నియమించిన సీఎం రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణను అత్యాచార రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రులు సీతక్క, శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి తదితరులు శారదను సన్మానించారు.

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు రూ.719 కోట్లు

» కేంద్ర బొగ్గు గనుల మంత్రి కిషన్‌రెడ్డి

న్యూఢిల్లీ, జూలై 17(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన రైల్వేస్టేషన్‌గా అభివృద్ధి చేస్తున్నట్లు కేంద్ర బొగ్గు గనుల మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు రూ.719 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు బుధవారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. స్టేషన్‌లో కొనసాగుతున్న నిర్మాణపనులకు సంబంధించిన చిత్రాలను పంచుకున్నారు. ఇప్పటికే నిర్మాణపనులు 30 శాతం వరకు పూర్తయ్యాయని తెలిపారు.

రుణమాఫీకి ఎన్‌సీడీసీ రుణం?

» 5 వేల కోట్ల కోసం సర్కారు ప్రయత్నాలు

హైదరాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రుణమాఫీకి జాతీయ సహకార అభివృద్ధి సంస్థ(ఎన్‌సీడీసీ) రుణం తీసుకోవాలని సర్కారు నిర్ణయించింది. ఈ నెల 18 నుంచి రైతుల రుణ మాఫీ పథకాన్ని అమలు చేయాలని సంకల్పించిన రేవంత్ సర్కారు.. ఆర్థిక వనరులను సమకూర్చుకునే దిశలో తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే రైతు రుణ మాఫీ పథకానికి మొత్తం రూ.31 వేల కోట్లు అవసరమవుతాయని ప్రాథమిక అంచనా. ఇప్పటికే భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) నిర్వహించే ఈ-వేలం ద్వారా ప్రతినెల సేకరించే మార్కెట్ రుణాలు, రాష్ట్ర రాబడుల నుంచి కొంత మేర నిధులను ఆదా చేస్తూ.. రుణమాఫీ కోసం దాదాపు రూ.10 వేల కోట్లకు పైగా ఖజానాలో జమ చేసినట్లు తెలిసింది. ఈ క్రమంలో మరో రూ.5000 కోట్లను సేకరించేందుకు ఎన్‌సీడీసీ రుణాలను తీసుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతోంది. ఈ రుణం నిధులను జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ)ల ద్వారా రుణమాఫీకి వినియోగించాలని యోచిస్తోంది. అయితే.. ఎన్‌సీడీసీ నుంచి ఇంకా రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి ఆమోదం లభించలేదని తెలుస్తోంది. కేంద్ర సహకార శాఖను పర్యవేక్షిస్తున్న కేంద్ర హోంమంత్రిత్వ శాఖ మంత్రి అమిత్‌షాతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. రాష్ట్రంలోని 9 జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు, 908 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్) ద్వారా రైతులకు ఇచ్చిన పంట రుణాలు దాదాపు రూ.5000 కోట్ల వరకు ఉన్నాయి. ఈ బ్యాంకులు, సంఘాలు తెలంగాణ సహకార అపెక్స్ బ్యాంక్(టీజీసీఏబీ)కు అనుసంధానమై ఉంటాయి. అందుకే ఎన్‌సీడీసీ నుంచి ముందుగా టీజీసీఏబీ ఈ రూ.5 వేల కోట్ల రుణాన్ని తీసుకునేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. టీజీసీఏబీ నుంచి జిల్లా సహకార బ్యాంకులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు రుణం సొమ్మును మళ్లించాలని సర్కారు భావిస్తోంది. దేశంలో సహకార రంగాన్ని బలోపేతం చేయడానికి ఏర్పాటు చేసిన ఎన్‌సీడీసీ.. రాష్ట్రాల్లోని టీజీసీఏబీ వంటి బ్యాంకులకు రుణాలు ఇస్తుంటుంది. కానీ.. ఈసారి రాష్ట్ర ప్రభుత్వమే మధ్యవర్తిత్వం నెరపుతూ టీజీసీఏబీకి రూ.5000 కోట్ల వరకు రుణంగా ఇప్పించాలని ప్రయత్నిస్తోంది. ఈ రుణం లభిస్తే.. రుణమాఫీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి పెద్ద ఊరటే..!

రుణమాఫీ చరిత్రాత్మక నిర్ణయం

» ప్రతి గ్రామంలో వేడుకలు: మంత్రి పొన్నం

రైతులకు రూ. 2లక్షల మేర ఒకే సారి రుణమాఫీ చేయడం చరిత్రాత్మక నిర్ణయమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ నిర్ణయంలో క్యాబినెట్ మంత్రిగా తన పాత్ర ఉండడం.. ఒక రైతు బిడ్డగా తన జీవితంలో అత్యంత సంతోషకరమైన అంశమన్నారు. గ్రామ గ్రామాన రుణ మాఫీ వేడుకలు జరపాలని కార్యకర్తలను కోరారు.

ప్రజావాణి ఫిర్యాదులకు ట్రాకింగ్!

» ఫిర్యాదు ఏ దశలో ఉందో తెలుసుకునేందుకు అర్జీదారుకు అవకాశం

» పరిష్కారం సరిగాలేదని భావిస్తే ఆన్‌లైన్‌లో అప్పీల్‌కు వెళ్లే చాన్స్

హైదరాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం త్వరలో 'ప్రజావాణి' ఫిర్యాదులకు ట్రాకింగ్ సౌకర్యాన్ని కల్పించనుంది. అలాగే ఫిర్యాదు చేసిన తర్వాత జరిగిన పరిష్కారం సరిగాలేదని సదరు ఫిర్యాదుదారు భావిస్తే అప్పీల్‌కు వెళ్లేందుకు అవకాశం కల్పించనుంది. ఇందుకు అవసరమైన సాంకేతికతను అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో 'ప్రజావాణి' కార్యక్రమాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ప్రతి మంగళ, శుక్రవారాల్లో ప్రజాభవన్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల ప్రజలు వచ్చి తమ సమస్యలు పరిష్కరించాలంటూ అర్జీ పెట్టుకుంటున్నారు. ఇలా వచ్చిన దరఖాస్తులను అధికారులు ఆన్‌లైన్ చేయడంతోపాటు ప్రతి ఫిర్యాదుకు ఒక ఐడీ నంబర్‌ను కేటాయిస్తూ దాన్ని అర్జీదారు ఫోన్‌కు సందేశం రూపంలో పంపుతున్నారు. అయితే సదరు ఫిర్యాదు ఏ దశలో ఉన్నదో ఫిర్యాదుదారుడు తెలుసుకునే అవకాశం లేదు. ప్రస్తుతం ప్రజావాణిని పర్యవేక్షిస్తున్న అధికారులకే ఆ అధికారం ఉంది. దీంతో తమ ఫిర్యాదు ఏ దశలో ఉందో తెలుసుకునేందుకే చాలా మంది ప్రజావాణి నిర్వహిస్తున్న రోజుల్లో వస్తున్నట్టు అధికారులు గుర్తించారు. ఈ సమస్యకు పరిష్కారంగా ఫిర్యాదు ఏ దశలో ఉందనేది తెలుసుకునేందుకు వీలుగా అర్జీదారుడికే లాగిన్ అవకాశం కల్పించాలని నిర్ణయించారు. దీనికోసం ఫిర్యాదు చేసినప్పుడు కేటాయించిన ఐడీ నంబర్‌నే లాగిన్ ఐడీగా ఉపయోగించేందుకు వీలుగా అధికారులు పోర్టల్‌ను అందుబాటులోకి తేనున్నారు. త్వరలోనే దీన్ని అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు ఫిర్యాదు ఇచ్చాక లభించిన పరిష్కారంపై సదరు అర్జీదారుడు సంతృప్తి చెందకుంటే అదే ఫిర్యాదుపై అప్పీల్‌కు వెళ్లే అవకాశం కల్పించనున్నారు. ఫిర్యాదుదారులు నేరుగా ఆన్‌లైన్‌లోనే అప్పీల్‌కు వెళ్లేలా పోర్టల్‌ను అందుబాటులోకి తేనున్నట్టు అధికారిక వర్గాల ద్వారా తెలిసింది. కాగా ట్రాకింగ్, అప్పీల్‌తోపాటు మరో ప్రత్యేక సౌకర్యాన్ని అధికారులు ప్రజావాణి పోర్టల్‌లో అందుబాటులోకి తీసుకురానున్నట్టు సమాచారం. ఫిర్యాదును స్వీకరించాక వీలైనంత త్వరగా పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కానీ ఫిర్యాదుల్లో కొన్నింటి పరిష్కారం జరగడంలేదు. పరిష్కారంకాని వాటిపై అర్జీదారులు పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇకపై పరిష్కారమైన సమస్యను ఏ విధానంలో పరిష్కరించారు, దానికి కారణాలను తెలిపేలా, అదే సమయంలో కొన్ని ఫిర్యాదులు ఎందుకు పరిష్కారంకాలేదు, అందుకు గల కారణాలేంటనే వివరాలను తెలుపుతూ.. సంబంధిత పత్రాలను స్కాన్ చేసి పోర్టల్‌లో అందుబాటులో ఉంచేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దీంతో ఫిర్యాదుదారుడి సమస్యకు సంబంధించిన అన్ని వివరాలు ఆన్‌లైన్‌లోనే అందుబాటులో ఉండనున్నాయి. తద్వారా ప్రజావాణి కూడా మరింత పారదర్శకంగా ఉంటుందని అధికారికవర్గాలు అంటున్నాయి

ఏడాదిలో పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి!

2025 డిసెంబరు నాటికి పూర్తి చేయడమే లక్ష్యం

» వచ్చే బడ్జెట్‌లో11 వేల కోట్లు అడుగుతాం

» ఇచ్చంపల్లి ప్రాజెక్టుపై చర్చిస్తాం: ఉత్తమ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఆదిత్యనాథ్‌దాస్, రాహుల్ బొజ్జా

హైదరాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఈ ఆర్థిక సంవత్సరంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణ పనులకు రూ.11 వేల కోట్లు కేటాయించాల్సిందిగా ఆర్థికశాఖకు ప్రతిపాదనలు అందజేస్తామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మధ్యంతర బడ్జెట్‌లో రూ.28 వేల కోట్లను నీటిపారుదల శాఖకు కేటాయించగా.. అందులో రూ.18 వేల కోట్లు గత ప్రభుత్వం ప్రాజెక్టుల కోసం చేసిన అప్పులకే చెల్లించాల్సి వస్తోందన్నారు. మిగిలిన నిధుల్లో రూ.2 వేల కోట్లు వేతనాలు/ఇతర ఖర్చులకు అవుతాయని, రూ.8 వేల కోట్లు మాత్ర మే పనులకు కేటాయించే వీలుంటుందని తెలిపారు. ఇవి కాకుండా.. గత ప్రభుత్వం రూ.9 వేల కోట్ల దాకా పెండింగ్ బిల్లులు వదిలేసిపోయిందని పేర్కొన్నారు. దాంతో ప్రాజెక్టుల పనులు జరగాలంటే మరో రూ.11 వేల కోట్లు కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. బుధవారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రాజెక్టులపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ఈ ఏడాది 6.50 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టును సాగులోకి తేవడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఆ దిశగా పనులు ముమ్మరం చేస్తున్నామని, ఈ ఏడాది చివరి కల్లా పూర్తయ్యే ప్రాజెక్టులను ఏ-కేటగిరీలో చేర్చామని వెల్లడించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టును సాధించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇచ్చంపల్లి వద్ద రిజర్వాయర్ నిర్మించి ఆ ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ద్వారా 195 టీఎంసీలను కాళేశ్వరం ఎత్తిపోతల పథకం కింద తరలించడానికి వీలు కల్పిస్తామన్న ఎన్‌డబ్ల్యూడీఏ ప్రతిపాదనపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి ఉత్తమ్ చెప్పారు. సమ్మక్కసాగర్ (తుపాకులగూడెం) బ్యారేజీకి ఛత్తీస్‌గఢ్ నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) తెప్పించుకోవడానికి వీలుగా సంప్రదింపుల ప్రక్రియను ముమ్మరం చేశామన్నారు. ఇక నీటిపారుదల శాఖలో పదోన్నతుల ప్రక్రియను న్యాయ నిపుణుల సలహా తీసుకున్నాక చేపడతామని తెలిపారు. ఆరు నూరైనా పదోన్నతుల ప్రక్రియను ముందుకు తీసుకెళతామని, వివాదాలేమున్నా సంప్రదింపులతో పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం పునర్వ్యవస్థీకరణతో నీటిపారుదల శాఖను కుప్పకూల్చిందని, దీనిని సమీక్షిస్తామని అన్నారు. ఇక ఈ నెలాఖరున సదర్‌మట్ ప్రాజెక్టును సీఎం ఎ.రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని, ఆగస్టు 15న సీతారామ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన రాజీవ్ కెనాల్‌ను ప్రారంభిస్తారని ఉత్తమ్ చెప్పారు. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సదర్‌మట్‌లో మిగిలిన పనులన్నీ సత్వరమే పూర్తిచేయాలన్నారు.

20న ఢిల్లీకి మంత్రి ఉత్తమ్

కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీలపై జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్‌ఏ) అధికారులతో సమావేశం కావడానికి నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి 20న ఢిల్లీకి వెళ్లనున్నారు. ఎన్‌డీఎస్‌ఏ మధ్యంతర నివేదిక అమలు, పూర్తిస్థాయి నివేదికపై సంస్థ చైర్మన్‌తో సమావేశం కానున్నారు. మరోవైపు ఎన్‌డీఎస్‌ఏ మధ్యంతర నివేదిక అమలు స్థితిగతులపై మంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌డీఎస్ఏ చైర్మన్ అనిల్‌జైన్‌తో మంత్రి ఫోన్‌లో మాట్లాడారు. బ్యారేజీలపై తుది నివేదికను సత్వరమే అందించాలని కోరారు.

డ్రగ్స్ కట్టడికి గట్టి నిఘా!

టాస్క్‌ఫోర్స్ తరహాలో యాంటీ డ్రగ్స్ కంట్రోల్ టీంలు

» వరంగల్‌లో ప్రయోగాత్మకంగా ప్రారంభం

» గంజాయి, డ్రగ్స్ విక్రయం వినియోగ ప్రదేశాలు బ్లాక్ స్పాట్‌లుగా గుర్తింపు



హైదరాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డ్రగ్స్ అనే పదం వినిపించవద్దని, డ్రగ్స్‌పై ఉక్కు పాదం మోపాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో పోలీస్ శాఖ మరింత కట్టుదిట్టమైన చర్యలకు ఉపక్రమించింది. డ్రగ్స్ కట్టడికి ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో(టీజీ న్యాబ్)తోపాటు శాంతిభద్రతల పోలీసులు డ్రగ్స్ నియంత్రణ కోసం ప్రత్యేకంగా పనిచేస్తున్నారు. ఇవి కాకుండా జిల్లాలు, పోలీసు కమిషనరేట్ల పరిధిలో టాస్క్‌ఫోర్స్, ఎస్‌ఓటీ తరహాలో డ్రగ్స్ కట్టడికి యాంటీ డ్రగ్స్ కంట్రోల్ టీంలను రంగంలోకి దింపుతున్నారు. ఒక రిజర్వు ఇన్‌స్పెక్టర్ నేతృత్వంలో అవసరం మేరకు ఇద్దరు, ముగ్గురు ఎస్సైలు, కానిస్టేబుళ్లతో ప్రత్యేకంగా యాంటీ డ్రగ్స్ కంట్రోల్ టీంలను ఏర్పాటు చేస్తున్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రయోగాత్మకంగా ఈ టీమ్‌లను ఏర్పాటు చేశారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు తీసుకునేందుకు అనువైన ప్రదేశాలు ఎక్కడ ఉన్నాయో గుర్తించి.. అక్కడ యాంటీ డ్రగ్ కంట్రోల్ టీమ్‌లు తనిఖీలు చేస్తాయి. అలాగే గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలు విక్రయించేందుకు అవకాశం ఉన్న ప్రాంతాలతోపాటు, విద్యాసంస్థలు, థియేటర్లు, ఇతర ప్రాంతాల్లో ఈ టీమ్‌లు నిరంతరం నిఘా కొనసాగిస్తాయి. ఆయా ప్రాంతాల్ని బ్లాక్ స్పాట్‌లుగా గుర్తిస్తారు. అవసరాన్ని బట్టి స్థానిక పోలీసులతో సమన్వయం చేసుకుని దాడులు నిర్వహించి నిందితుల్ని అదుపులోకి తీసుకుంటారు. ఇక ఇటీవల బెంగళూరు రేవ్ పార్టీ తనిఖీల్లో పాల్గొన్న స్నిఫర్ డాగ్స్ పోలీస్‌లకు తనిఖీల్లో ఎంతో సహకారం అందించాయి. హైదరాబాద్‌లోని పబ్‌లపై దాడుల సమయంలోనూ రాష్ట్ర పోలీస్, టీజీ న్యాబ్ బృందాలు కె9 స్నిఫర్ స్క్వాడ్ సేవల్ని ఉపయోగిస్తున్నారు. ప్రత్యేకంగా శిక్షణ పొందిన కె9 స్క్వాడ్ జాగిలాలు హెరాయిన్, కొకైన్, ఎండీఎంఏ వంటి అన్ని రకాల సింథటిక్ డ్రగ్స్‌ను ఒక గ్రాము కంటే తక్కువ మోతాదులో ఉన్నా, అవి ఎక్కడ దాచినా ఇట్టే వాసనతో పసిగట్టేస్తాయి.

డ్రగ్ అండ్ డ్రైవ్ పరీక్షలు!

డ్రగ్స్ ఫ్రీ రాష్ట్రంగా తెలంగాణను మార్చడంలో భాగంగా టీజీ న్యాబ్‌ను రాష్ట్ర ప్రభుత్వం బలోపేతం చేసింది. పూర్తి స్థాయి డైరెక్టర్ నియామకంతోపాటు న్యాబ్ పనితీరును సీఎం స్వయంగా ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. డ్రగ్స్ కట్టడి విషయంలో ప్రభుత్వం స్పష్టమైన వైఖరితో ఉందని అందుకు తగ్గట్లుగా న్యాబ్ పనిచేస్తోందని డైరెక్టర్ సందీప్ శాండిల్య తెలిపారు. ఎవరివద్దనైన డ్రగ్స్ గంజాయి ఉన్నట్లు తెలిస్తే.. డయల్-100, 87126 71111 నెంబరుకు సమాచారం అందించాలని ఆయన సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తరహాలో ఇకపై హైదరాబాద్, శివారు ప్రాంతాలు, పబ్‌ల పరిసర ప్రాంతాల్లో డ్రగ్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.



సల్బత్తాపూర్ గ్రామంలో కూలిన ఇంటి వద్ద దీనంగా కాశవ్వ

శతాధిక వృద్ధురాలికి ఎంత కష్టం!

- వర్షాలకు కూలిపోయిన ఇల్లు
- ఎప్పుడు పడిపోతోందో తెలియని అదే ఇంట్లోని మరో భాగంలో నివాసం

వికారాబాద్/బంట్వారం, జూలై 17: ఆ అవ్వ వయస్సు వందేళ్లపైనే! నా అనేవాళ్లెవరూ లేరు. చాలా ఏళ్లుగా ఇంట్లో ఒంటరిగా ఉంటున్న ఆ పండుటాకుకు ఇప్పుడు ఆ ఇల్లూ లేకుండా పోయింది. వర్షాలకు తడిసి ఇంట్లోని ఓ భాగం కూలిపోయింది. ఎప్పుడు కుప్పకూలుతుందో తెలియని అదే ఇంట్లో ఆమె బిక్కుబిక్కుమంటూ ఉంటోంది. వికారాబాద్ జిల్లా, బంట్వారం మండలం సల్బత్తాపూర్ గ్రామానికి చెందిన ఈడిగి కాశవ్వ అనే శతాధిక వృద్ధురాలికి వచ్చిన కష్టమిది. అప్పుడెప్పుడో 60 ఏళ్ల క్రితం భర్తతో కలిసి కాశవ్వ సల్బత్తాపూర్‌కు వచ్చింది. ఆమె కూతురు, భర్త చనిపోయారు. ఐదేళ్ల క్రితం దాకా చిన్న కిరాణ దుకాణం, టీ కొట్టు నిర్వహించుకుంటూ బతికేది. వృద్ధాప్య సమస్యలు పెరగడం, శరీరం సహకరించకపోవడంతో ఇంట్లోనే ఉంటోంది. బంధువులు రెండు పూటలా భోజనం పంపిస్తే తింటోంది. నాలుగైదు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో కాశవ్వ ఇల్లు ఒక వైపు పూర్తిగా కూలిపోయింది. ఆ సమయంలో కాశవ్వ బయటే ఉండటంతో ప్రమాదం తప్పింది. మిగతా భాగం ఇంటి గోడలూ శిథిలమై పోవడంతో ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఉన్న ఇంటిని పూర్తిగా తొలగించి.. ఓ గూడు ఏర్పాటు చేయిస్తే బాగుటుందని కాశవ్వ కోరుకుంటోంది. ఇందుకు ప్రభుత్వం, దాతల నుంచి సాయం కోసం ఎదురుచూస్తోంది.

నేటి నుంచి డీఎస్సీ పరీక్షలు

హైదరాబాద్, జులై 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ పరీక్షలను గురువారం నుంచి నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 56 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆగస్టు 5 వరకు జరిగే ఈ పరీక్షలు కొనసాగనున్నాయి. 11,062 ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. సుమారు 2.79 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారు. వారిలో బుధవారం రాత్రి వరకు 2.48 లక్షల మంది తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారు. 2.30 గంటల పాటు జరిగే పరీక్షలో 160 ప్రశ్నలు ఉంటాయి. వీటికి 80 మార్కులు కేటాయించారు. టెట్ ద్వారా మరో 20 మార్కులు వెయిటేజీలో భాగంగా కలపనున్నారు. డీఎస్సీ పరీక్షలను రాష్ట్రం యూనిట్‌గా నిర్వహిస్తున్నారు. ఫలితాలు విడుదల చేసి, మెరిట్ జాబితాను మాత్రం జిల్లాల వారీగా ప్రకటిస్తారు. నియామకాలు కూడా జిల్లా యూనిట్‌గా చేయనున్నారు. కాగా, ప్రస్తుతం భర్తీ చేస్తున్న పోస్టుల్లో ఎస్‌జీటీ 6,508, భాషా పండితులు 272, పీఈటీ 182, స్పెషల్ క్యాటగిరీ స్కూల్ అసిస్టెంట్ 220, స్పెషల్ క్యాటగిరీ ఎస్‌జీటీ పోస్టులు 796 ఉన్నాయి.

ఎప్‌సెట్ కౌన్సెలింగ్‌కు సగం మంది దూరం!

- అర్హులు 1,80,414 మంది.. వెబ్ ఆప్షన్లు ఇచ్చింది 95 వేల మందే

హైదరాబాద్ సిటీ, జూలై 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించిన ఎప్‌సెట్-2024లో అర్హత సాధించిన వారిలో సగం మంది కౌన్సెలింగ్‌కు దూరంగా ఉన్నారు. మే నెలలో జరిగిన ఎప్‌సెట్ పరీక్షకు 2,44,818 మంది హాజరవ్వగా 1,80,414 మంది ఉత్తీర్ణత సాధించారు. జూలై 6 నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమవ్వగా 15వ తేదీతో వెబ్ ఆప్షన్ల నమోదుకు గడువు ముగిసింది. అయితే, అధికారిక లెక్కల ప్రకారం కేవలం 95,383 మంది మాత్రమే వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకున్నారు. దాదాపు సగం మంది కౌన్సెలింగ్‌కు దూరంగా ఉన్నారు. దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మేనేజ్‌మెంట్ కోటాలో నచ్చిన కళాశాలలో చేరేవారు, ఇతర రాష్ట్రాల్లోని ప్రైవేటు డీమ్డ్ యూనివర్సిటీలు, పేరొందిన విశ్వవిద్యాలయాల్లో చేరుతున్న వారు కౌన్సెలింగ్‌కు దూరంగా ఉన్నారనే అభిప్రాయాలు ఉన్నాయి. విదేశీ విద్యకు మొగ్గు చూపిన వారు కొందరైతే, మొక్కుబడి ఎప్‌సెట్ రాసి డిగ్రీ కళాశాల్లో చేరినవారు కూడా కౌన్సెలింగ్‌కు దూరంగా ఉన్నారని చెబుతున్నారు. ఏదేమైనా సగం మంది పోటీ నుంచి తప్పుకోవడంతో తమకు కన్వీనర్ కోటా సీటు దక్కుతుందని వెబ్‌ఆప్షన్లు పెట్టుకున్న అభ్యర్థులు ఆశాభావం వ్యక్తం చేసుకున్నారు. కాగా, ఇప్పటిదాకా మొత్తం 62 లక్షల వెబ్ ఆప్షన్లు నమోదయ్యాయని, ఇందులో ఓ విద్యార్థి అత్యధికంగా 1,051 ఆప్షన్లు ఇచ్చుకున్నట్లు అధికారులు తెలిపారు.



తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం ఉత్తమ వార్త చిత్రం పోటీల పోస్టరును ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, ఫొటోగ్రాఫర్లు

పోటీల్లో పాల్గొంటే నైపుణ్యం పెరుగుతుంది

- ఉత్తమ వార్త చిత్రం పోటీల పోస్టరును ఆవిష్కరించిన డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్ సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : పత్రికల ఫొటోగ్రాఫర్ల నైపుణ్యం పెంపొందించుకొనేందుకు ఉత్తమ వార్త చిత్రం పోటీలవంటివి ఉపయోగపడతాయని తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం యేటా నిర్వహిస్తున్న రాష్ట్ర వ్యాప్త ఉత్తమ వార్త చిత్రం పోటీల గోడ పత్రికను బుధవారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం భట్టి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎన్.హరి మాట్లాడుతూ... ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని 30 ఏళ్లుగా ప్రతియేటా ఆగస్టులో ఫొటో జర్నలిస్టులకు రాష్ట్ర వ్యాప్త ఉత్తమ వార్త చిత్రం పోటీలు నిర్వహిస్తునట్లు తెలిపారు. ఈ పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతి రూ. 10 వేలు, ద్వితీయ బహుమతి రూ.8 వేలు, తృతీయ బహుమతి రూ. 5 వేలతో పాటు 25 మందికి రూ.2 వేల కన్సోలేషన్ బహుమతులతో పాటు సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ఆసక్తిగల ఫొటో జర్నలిస్టులు పోటీల్లో పాల్గొనేందుకు మూడు 8+8 సైజ్ కలర్, బ్లాక్ అండ్ వైట్ ఫొటోలను టీఎస్‌పీజేఏ కార్యాలయం, టీయూడబ్ల్యూజే బిల్డింగ్, దేశోద్ధారక భవన్, బషీర్‌బాగ్, హైదరాబాద్‌కు ఆగస్టు 10వ తేదీలోగా పంపించాలన్నారు.

జూరాలకు బిరబిరా కృష్ణమ్మ



ఉధృతంగా ప్రవహిస్తున్న బొగత జలపాతం

(మొదటి పేజీ తరువాయి)

ఇన్‌ఫ్లో నమోదవుతోంది. దీంతో ఏపీ తాగునీటి అవసరాల కోసం ప్రాజెక్టు నుంచి 9 రోజుల పాటు 5,000 క్యూసెక్కుల చొప్పున నీటి విడుదలను బుధవారం నుంచి ప్రారంభించారు. గోదావరి బేసిన్‌లోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు 4,468 క్యూసెక్కుల వరద వస్తోంది. ప్రాజెక్టు సామర్థ్యం 80.5 టీఎంసీలకు ప్రస్తుతం 13.833 టీఎంసీలున్నాయి. కడెం ప్రాజెక్టుకు 3,442 క్యూసెక్కులు, ఎల్లంపల్లి, సింగూరుకు 391 క్యూసెక్కుల వరద రికార్డయింది. సుందిళ్లకు 331 క్యూసెక్కులు, అన్నారం బ్యారేజీకి 9,500 క్యూసెక్కులు, మేడిగడ్డ బ్యారేజీకి 49,500 క్యూసెక్కులు, సమ్మక్కసాగర్(తుపాకులగూడెం)కు 78,450 క్యూసెక్కులు, సీతమ్మసాగర్(దుమ్ముగూడెం)కు 94 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా... వచ్చింది వచ్చినట్లే దిగువకు వదిలిపెట్టారు. ఇటు తాలిపేరు ప్రాజెక్టుకు భారీగా వరద వస్తుండటంతో గేట్లు ఎత్తి 68 వేల క్యూసెక్కులను దిగువకు విడుదల చేశారు. ఎగువన భారీ వర్షాలు.. సమక్క బ్యారేజీ, తాలిపేరు నుంచి నీటి విడుదలతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమేపీ భారీగా పెరుగుతోంది. స్నాన ఘట్టాల పైకి వరద నీరు చేరుకుంది. గురువారం నాటికి భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 25-30 అడుగులకు చేరే అవకాశముందని కేంద్ర జలసంఘం అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ సీజన్‌లో తొలిసారి భద్రాచలం వద్ద గోదావరి 25 అడుగులను దాటనుంది.

పలు జిల్లాల్లో భారీ వర్షాలు

రాష్ట్రవ్యాప్తంగా బుధవారం వర్షాలు కురిశాయి. నిజామాబాద్, ములుగు, ఆదిలాబాద్ జిల్లాల్లో భారీ వానలు పడగా.. నల్లగొండ, నిర్మల్, ఆసిఫాబాద్, మంచిర్యాల తదితర జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిశాయి. పలుచోట్ల చెరువులు, వాగులు వంకలు పొంగిపొర్లాయి. అక్కడక్కడ సోయా, పత్తి తదితర పంటలు నీటమునిగాయి. నిజామాబాద్ జిల్లా నవీపేట మండలంలో అత్యధికంగా 15.4 సెం.మీ., ములుగు జిల్లా వెంకటాపురం (నూగూరు)లో 10.7, అదే జిల్లా మంగపేటలో 9, ఏటూరునాగారంలో 9.8, ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లో 7.9 సెం.మీ. వర్షపాతం నమోదైంది. మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం ఉదయం వరకు ములుగు జిల్లాలో 6.4 సెం.మీ. సగటు వర్షపాతం నమోదైంది. తాడ్వాయి మండలం పడిగాపూర్‌కు చెందిన పొనక వినోద్ తన ఆటోతో జంపన్నవాగుపై ఉన్న లోలెవల్ కాజ్‌వేను దాటుతుండగా.. ప్రవాహానికి ఆటో కొట్టుకుపోయి కాజ్‌వే కింద బోల్తా పడింది. వినోద్ సురక్షితంగా బయటపడగా.. ఆటోను స్థానికులు బయటకు తీశారు. ఏటూరునాగారం మండలంలోని కొండాయి, మల్యాల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. జంపన్నవాగులో తాత్కాలిక వంతెన కొట్టుకుపోవడంతో ప్రజలు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. బొగత, కుంటాల, పొచ్చెర జలపాతాలు పరవళ్లు తొక్కుతున్నాయి. బొగత వద్ద వరద ప్రవాహం ఉధృతంగా ఉండటంతో.. పర్యాటకులపై పోలీసులు ఆంక్షలు విధించారు.

రెండ్రోజులు అతి భారీ వర్షాలు

రాష్ట్రంలో గురు, శుక్రవారాల్లో కొన్ని జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. గురువారం నాడు కొత్తగూడెం, ములుగు, భూపాలపల్లి, నిజామాబాద్, నిర్మల్, వికారాబాద్, మహబూబ్‌నగర్, గద్వాల, నారాయణపేట, ఆసిఫాబాద్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. ఈ 10 జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. మిగిలిన అన్ని జిల్లాలకు యెల్లో అలెర్ట్ జారీ చేసింది. ఆ జిల్లాల్లో కూడా భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. ఇక అల్పపీడన ప్రాంతం ఈ నెల 19వ తేదీన పశ్చిమ మధ్య దాని పరిసర వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడే అవకాశముందని వెల్లడించింది.

బీఆర్‌ఎస్‌కు ఇచ్చిన 11 ఎకరాలు మావే..

- కోకాపేట భూముల కేటాయింపుపై.. హైకోర్టులో ప్రైవేటు వ్యక్తుల పిటిషన్
- అదనపు పత్రాలు సమర్పించాలని పిటిషనర్లకు ఆదేశం.. నేడు పునర్విచారణ

హైదరాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రభుత్వం బీఆర్‌ఎస్ పార్టీకి కోకాపేటలో చేసిన 11 ఎకరాల భూకేటాయింపు చట్ట విరుద్ధమంటూ హైకోర్టులో ఇటీవల పిటిషన్ దాఖలైంది. ప్రైవేటు వ్యక్తులకు చెందిన సదరు భూమిపై ఎలాంటి టైటిల్ లేనప్పటికీ ప్రభుత్వం భూకేటాయింపు చేసిందని, ఆ కేటాయింపును రద్దు చేయాలని కోరుతూ పలువురు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. సికింద్రాబాద్ హైదర్‌బస్తీకి చెందిన జాకేటి అశోక్‌దత్ జయశ్రీ, కనుకాల జ్యోతిర్మయి దత్, జేఏ కీర్తిమయి, జేఏ అక్షయ్‌దత్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం కోకాపేటలోని సర్వే నెంబర్ 239, 240లలోని 11ఎకరాల (53,240 చదరపు గజాలు) భూమిని బీఆర్‌ఎస్ పార్టీకి కేటాయిస్తూ 2023 మే23న అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, ఈ భూమిపై యాజమాన్య హక్కులు తమకే ఉన్నాయని, వివాదస్పద భూమిపై ఎలాంటి టైటిల్ లేకున్నా, తనది కాని ఆస్తిని ప్రభుత్వం బీఆర్‌ఎస్‌కు కేటాయించడం రాజ్యాంగవిరుద్ధమని పిటిషనర్లు పేర్కొన్నారు. సదరు భూమి తమ కుటుంబ యజమాని జేఎం అశోక్‌దత్ నుంచి తమకు వారసత్వంగా సంక్రమించిందని తెలిపారు. రిజిస్టర్డ్ సేల్‌డీడ్ డాక్యుమెంట్ నెంబర్ 928 ఆఫ్ 1967 ద్వారా జేహెచ్ కృష్ణమూర్తి అనే వ్యక్తి నుంచి తమ కుటుంబ యజమాని కొనుగోలు చేశారని పేర్కొన్నారు. తమకు భూమి విక్రయించిన జేహెచ్ కృష్ణమూర్తి లేట్ నవాబ్ నుస్రత్ జంగ్ - 1 వారసులకు పవర్ ఆఫ్ అటార్నీ హోల్డర్‌గా ఉన్నారని తెలిపారు. నవాబ్ నుస్రత్ జంగ్ -1 మహ్మద్ అలీఖాన్ వారసుల నుంచి రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ 17 ఆఫ్ రబీ అవాల్ 1269 హిజ్రిలో కొనుగోలు చేసిన 1,635 ఎకరాల్లో ఈ భూమి ఓ భాగమని తెలిపారు. ఈ స్థలాలపై అనేక వివాదాలు ఇప్పటికీ సుప్రీం కోర్టులో ఉన్నాయని పేర్కొన్నారు. 1950లో అప్పటి హైదరాబాద్ డెక్కన్ (నిజాం) ప్రభుత్వం కోకాపేట గ్రామాన్ని నాన్ ఖల్సాగా గుర్తించిందని, ఈ నేపథ్యంలో సదరు భూములను ప్రభుత్వ భూములని చెప్పడానికి వీల్లేదని తెలిపారు. ఈ వివాదాలు ఇలా కొనసాగుతుండగా ఎలాంటి టైటిల్ దఖలు పడకుండానే ప్రభుత్వం ఈ భూమిని హెచ్‌ఎండీఏ నుంచి తీసుకుని బీఆర్‌ఎస్‌కు కేటాయించిందని తెలిపారు. చట్టవిరుద్ధంగా చేపట్టిన ఈ కేటాయింపులను రద్దు చేయాలని, ఆ స్థలంలో ఎలాంటి కార్యకలాపాలు చేపట్టకుండా, అనుమతులు మంజూరు చేయకుండా ప్రభుత్వానికి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషనర్లు కోరారు. అయితే, ఈ పిటిషన్‌పై ఇటీవల విచారణ చేపట్టిన జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం.. భూవివాదానికి సంబంధించిన కొన్ని రిజిస్ట్రేషన్ పత్రాలను సమర్పించాలని పిటిషనర్లను ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 18కి వాయిదా వేసింది.

కారు చవకగా కేటాయించారని ఇప్పటికే వ్యాజ్యాలు..

గత ప్రభుత్వం బీఆర్‌ఎస్ పార్టీకి చేసిన ఈ భూకేటాయింపుపై ఇప్పటికే హైకోర్టులో పలు వ్యాజ్యాలు పెండింగ్‌లో ఉన్నాయి. కోకాపేటలో ఎకరం భూమి ధర రూ.50 కోట్లకుపైగా ఉండగా కేవలం ఎకరానికి రూ.3.41 కోట్ల చొప్పున గత ప్రభుత్వం బీఆర్‌ఎస్ పార్టీకి కేటాయించడాన్ని సవాలు చేస్తూ ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ సహా పలువురు హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు. ఈ పిటిషన్లు హైకోర్టు డివిజన్ బెంచ్ వద్ద పెండింగ్‌లో ఉన్నాయి.



రారెత్తిస్తున్న టమాటా!

- బహిరంగ మార్కెట్‌లో సెంచరీ దాటిన ధర
- రైతు బజార్లలో 67-70, ఉల్లిగడ్డకూ రెక్కలు
- వర్షాలతో 60 శాతం తగ్గిన టమాటా రాక

హైదరాబాద్ సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కిలో టమాటా ధర సెంచరీ దాటింది. ధర దడపుటిస్తుండటంతో టమాటా కొనేందుకు సామాన్య ప్రజలు ఆలోచిస్తున్నారు. రైతు బజార్లలో కిలో టమాటా రూ.67-70 వరకు ఉండగా బహిరంగ మార్కెట్‌లో రూ.100-110 పలుకుతోంది. ఇక కిలో రూ.20-25 ఉండాల్సిన ఉల్లిగడ్డ ధర రెట్టింపు అయింది. వర్షాల కారణంగా టమాటా, ఉల్లిగడ్డ దిగుమతులు తగ్గడంతో ధరలు పెరిగినట్లు హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు. రెండు నెలల క్రితం రోడ్డు పక్కన ట్రాలీ ఆటోలపై రూ.100కు 4 కిలోలు, రైతు బజార్లలో 3 కిలోలు వచ్చిన టమాటా ధర సామాన్యుల రారెత్తిస్తోంది. హైదరాబాద్ శివారులోని యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం రైతుల నుంచి కూడా మార్కెట్‌కు లోకల్ టమాటా పెద్దగా రావడం లేదు. ఏపీలోని మదనపల్లి, రాజస్థాన్ నుంచి నగరానికి వచ్చే టమాటా 60 శాతం తగ్గిపోవడంతో ధరలు పెరిగాయని మార్కెట్ అధికారులు చెబుతున్నారు. షోలాపూర్, నాసిక్, అహ్మద్‌నగర్, పుణె తదితర ప్రాంతాల నుంచి మలక్‌పేట మార్కెట్‌కు రోజు సుమారు 90-100 ఉల్లిగడ్డ లారీలు వస్తుండేవని, నెల రోజులుగా ఆ సంఖ్య 30-60 వరకు తగ్గిపోయిందన్నారు. వర్షాలతో పలు ప్రాంతాల్లో కోతకు వచ్చిన పంట దెబ్బతింటోంది. దీంతో రైతు బజార్ల నుంచి సూపర్ మార్కెట్ల వరకు ధరలు ఒక్కసారిగా పెరిగాయి. టమాటా, ఉల్లిగడ్డతో పాటు ములక్కాయ, క్యాప్సికమ్ రేట్లు కూడా గరిష్ఠంగా పెరిగాయి. మరో 20 రోజులైతే ధరలు కొంత తగ్గే అవకాశం ఉందని బోయిన్‌పల్లి హోల్‌సేల్, రిటైల్ మార్కెట్ ప్రతినిధి గిరిధర్ తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి ఆశించిన స్థాయిలో సరుకు దిగుమతి కాకపోవడంతో ఉన్న వాటిపై రిటైల్ మార్కెట్‌లో వ్యాపారులు ఇష్టారాజ్యంగా రేట్లు పెంచేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

బుధవారం ధరలు ఇలా ఉన్నాయి (కిలోకి రూపాయల్లో)

	సరూర్‌నగర్ రైతు బజార్‌లో	బయటి మార్కెట్‌లో
టమాటా	67	100-110
పచ్చిమిర్చి	60	90-100
క్యాప్సికమ్	65	80-90
వంకాయ	28	35-40
ఉల్లిగడ్డ	39	50-60
ఆలుగడ్డ	38	50-60

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● గురువారం 18 జూలై 2024
diksuchi@andhrajyothy.com

లా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి క్లాట్



దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ లా యూనివర్సిటీలలో ప్రవేశానికి ఉద్దేశించిన 'కామన్ లా అడ్మిషన్ టెస్ట్(క్లాట్) 2025' దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. దీని ద్వారా అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ లా ప్రోగ్రామ్‌లలో అడ్మిషన్స్ ఇస్తారు. ఈ టెస్ట్‌ను 'కన్సార్షియం ఆఫ్ నేషనల్ లా యూనివర్సిటీస్' నిర్వహిస్తుంది. హైదరాబాద్ నల్సార్, విశాఖపట్నం డీఎస్ఎన్ఎల్‌యూ సహా బెంగళూరు ఎన్ఎల్ఎస్ఐయూ, భోపాల్ ఎన్ఎల్ఐయూ, కొచ్చి ఎన్‌యూఏఎల్ఎస్, జోధ్‌పూర్ ఎన్ఎల్‌యూ, ఒడిశా ఎన్ఎల్‌యూఓ తదితర లా కళాశాలలు ఇందులో పార్టిసిపేట్ చేస్తున్నాయి. క్లాట్ 2025లో సాధించిన స్కోర్ ఆధారంగా అభ్యర్థుల ఛాయిస్‌ను అనుసరించి సీట్లను అలాట్ చేస్తారు. ఈ ఎగ్జామ్‌ను ఆఫ్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు.

అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్: ఇది అయిదేళ్ల వ్యవధి గల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ ప్రోగ్రామ్. గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు. 2025 మార్చి/ఏప్రిల్‌లో చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా అర్హులే.


యూజీ క్లాట్ 2025 వివరాలు: ఇందులో మొత్తం 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఇంగ్లీష్‌లో 22 నుంచి 26 ప్రశ్నలు; కరెంట్ అఫైర్స్-జనరల్ నాలెడ్జ్‌లో 28 నుంచి 32 ప్రశ్నలు; లీగల్ రీజనింగ్‌లో 28 నుంచి 32 ప్రశ్నలు; లాజికల్ రీజనింగ్‌లో 22 నుంచి 26 ప్రశ్నలు; క్వాంటిటేటివ్ టెక్నిక్స్‌లో 10 నుంచి 14 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 120. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే పావు మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు.

పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్: ఇది ఏడాది వ్యవధి గల ఎల్ఎల్ఎం ప్రోగ్రామ్. ద్వితీయ శ్రేణి మార్కులతో ఎల్ఎల్‌బీ/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. 2025 ఏప్రిల్/మేలో చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

పీజీ క్లాట్ 2025 వివరాలు: ఇందులో మొత్తం 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. కాన్‌స్టిట్యూషనల్ లా, జ్యూరిస్ప్రుడెన్స్, అడ్మినిస్ట్రేటివ్ లా, లా ఆఫ్ కాంట్రాక్ట్, టార్ట్స్, ఫ్యామిలీ లా, క్రిమినల్ లా, ప్రాపర్టీ లా, కంపెనీ లా, పబ్లిక్ ఇంటర్నేషనల్ లా, ట్యాక్స్ లా, ఎన్విరాన్‌మెంటల్ లా, లేబర్ అండ్ ఇండస్ట్రియల్ లా అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 120. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే పావు మార్కు. కోత విధిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.4,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ అభ్యర్థులకు రూ.3,500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 15
- **క్లాట్ 2025 తేదీ:** డిసెంబరు 1
- **వెబ్‌సైట్:** www.consortiumofnlus.ac.in

ఓయూలో పార్ట్ టైమ్ పీజీ



హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహిస్తున్న యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ (యూసీఈ)-పార్ట్ టైమ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. కంటిన్యూయింగ్ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్(సీఈఈపీ) కింద ఎంఈ/ఎంటెక్ అడ్మిషన్స్ నిర్వహిస్తున్నారు. వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ఉద్దేశించిన ఈ ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇందులో ఆరు సెమిస్టర్లు ఉంటాయి. ఎంట్రెన్స్ టెస్ట్, కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. సివిల్, కంప్యూటర్ సైన్స్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, బయో మెడికల్, మైనింగ్ విభాగాలు అందుబాటులో ఉన్నాయి. ప్రతి ఇంజనీరింగ్ విభాగంలో 85 శాతం సీట్లను స్థానికులకు ప్రత్యేకించారు. మిగిలిన సీట్లకు ఆసక్తిగలవారందరూ (లోకల్, నాన్ లోకల్ అభ్యర్థులు) పోటీ పడవచ్చు.

విభాగాలు-స్పెషలైజేషన్‌లు-సీట్లు

- **సివిల్ ఇంజనీరింగ్:** స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ 20, జియో టెక్నికల్ ఇంజనీరింగ్ 15, వాటర్ రిసోర్స్ ఇంజనీరింగ్ 15, ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్ 15 సీట్లు ఉన్నాయి.
- **కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్:** కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ 30, సైబర్ సెక్యూరిటీ 15, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ 15 సీట్లు ఉన్నాయి.
- **మెకానికల్ ఇంజనీరింగ్:** ప్రొడక్షన్ ఇంజనీరింగ్, ఆటోమేషన్ అండ్ రోబోటిక్స్, టర్బో మెషినరీ స్పెషలైజేషన్‌లలో ఒక్కోదానిలో 15 సీట్లు ఉన్నాయి.
- **ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్:** ఇండస్ట్రియల్ డ్రైవ్స్ అండ్ కంట్రోల్, పవర్ సిస్టమ్స్, పవర్ ఎలక్ట్రానిక్స్ సిస్టమ్స్ స్పెషలైజేషన్‌లలో ఒక్కోదానిలో 15 సీట్లు ఉన్నాయి.
- **ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్:** డిజిటల్ సిస్టమ్స్ ఇంజనీరింగ్, సిస్టమ్స్ అండ్ సిగ్నల్ ప్రాసెసింగ్, మైక్రోవేవ్ అండ్ రాడార్ ఇంజనీరింగ్, వీఎల్ఎస్ఐ అండ్ ఎంబెడెడ్ సిస్టమ్స్ స్పెషలైజేషన్‌లలో ఒక్కోదానిలో 15 సీట్లు ఉన్నాయి.
- బయో మెడికల్ ఎలక్ట్రానిక్స్, మైనింగ్ ఇంజనీరింగ్ స్పెషలైజేషన్‌లలో ఒక్కోదానిలో 15 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు

- స్పెషలైజేషన్‌ను అనుసరించి సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో బీఈ/బీటెక్/ఏఎంఐఈ/ఏఎంఐఈటీఈ ఉత్తీర్ణులై ఉండాలి. జూన్ 30 నాటికి కనీసం ఏడాది అనుభవం ఉండాలి.
- కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగానికి ఏదేని ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణులు; మాస్టర్స్ డిగ్రీ(ఫిజిక్స్/స్టాటిస్టిక్స్/మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్/అప్లయిడ్ స్టాటిస్టిక్స్/అప్లయిడ్ ఫిజిక్స్/జియో ఫిజిక్స్) పూర్తిచేసినవారు; ఎమ్మెస్సీ(కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్/కంప్యూటర్ అప్లికేషన్స్ అండ్ ఎలక్ట్రానిక్స్) ఉత్తీర్ణులు; ఎంసీఏ పూర్తిచేసిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- బయో మెడికల్ ఇంజనీరింగ్ విభాగానికి(బీఈ/బీటెక్)(బయో మెడికల్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్/ ఈఐఈ/ ఈసీఈ/ బయోటెక్నాలజీ/మెడికల్ ఎలక్ట్రానిక్స్) ఉత్తీర్ణులు; ఎమ్మెస్సీ(ఎలక్ట్రానిక్స్/మెడికల్ ఎలక్ట్రానిక్స్/అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్/ ఫిజిక్స్/మెడికల్ ఫిజిక్స్/ బయో ఫిజిక్స్/బయో ఇన్ఫర్మాటిక్స్/బయో మెడికల్ ఇన్ఫర్మాటిక్స్/ బయోటెక్నాలజీ) పూర్తిచేసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.
- మైనింగ్ ఇంజనీరింగ్ విభాగానికి మైనింగ్ అండ్ మెషినరీ ఇంజనీరింగ్/ మైనింగ్ ఇంజనీరింగ్ విభాగాల్లో డిగ్రీ పూర్తిచేసినవారు అర్హులు.

ఎంట్రెన్స్ టెస్ట్ వివరాలు: ప్రవేశ పరీక్షలో మొత్తం 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. సంబంధిత విభాగానికి నిర్దేశించిన సిలబస్ ప్రకారం ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. పరీక్ష సమయం రెండు గంటలు. ఈ టెస్ట్‌లో అర్హత పొందాలంటే జనరల్, బీసీ అభ్యర్థులకు కనీసం 36 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీసం 15 శాతం మార్కులు రావాలి. ఇంజనీరింగ్ విభాగాలకు ప్రత్యేకించిన సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 14
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** ఆగస్టు 22 నుంచి
- **ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** ఆగస్టు 25
- **ఎంట్రెన్స్ టెస్ట్ ఫలితాలు విడుదల:** ఆగస్టు 31
- **కౌన్సెలింగ్ తేదీలు:** సెప్టెంబరు 6న ఫేజ్-1, సెప్టెంబరు 13న ఫేజ్-2
- **వెబ్‌సైట్:** www.uceou.edu

డిప్లొమా ఇన్ రైల్వే ఇంజనీరింగ్

న్యూఢిల్లీలో కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ పర్మనెంట్ వే ఇంజనీర్స్(ఇండియా)- డిప్లొమా ఇన్ రైల్వే ఇంజనీరింగ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. ఇది కరస్పాండెన్స్ కోర్సు. ఇందులో ఇండియన్ రైల్వేస్‌కు సంబంధించిన స్ట్రక్చర్, ఫంక్షనింగ్ అంశాలు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌నకు కోల్‌కతాలోని ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్(ఇండియా) గుర్తింపు ఉంది. ఈ ప్రోగ్రామ్ పూర్తి చేసినవారికి ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్(ఇండియా)లో సీనియర్ టెక్నీషియన్ మెంబర్ అర్హతతోపాటు హయ్యర్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కోర్సులు చేసే అవకాశం లభిస్తుంది. ఆసక్తిగల అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకుని పూర్తిగానింపి కింది చిరునామాకు పంపాలి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి సైన్స్/కామర్స్/ఇంజనీరింగ్ విభాగాల్లో బీఎస్సీ/బీకామ్/బీఈ ఉత్తీర్ణులు; ఏదేని ఇంజనీరింగ్ విభాగంలో మూడేళ్ల డిప్లొమా ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్/సైన్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి బీఏ డిగ్రీ పూర్తిచేసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

- **ప్రోగ్రామ్ ఫీజు:** మొదటి సెమిస్టర్‌కు రూ.3500+జీఎస్‌టీ రూ.630; రెండో సెమిస్టర్‌కు రూ.4,000+జీఎస్‌టీ రూ.720
- **దరఖాస్తు ఫీజు:** రూ.4330
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 31
- **చిరునామా:** ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ పర్మనెంట్ వే ఇంజనీర్స్(ఇండియా), రూమ్ నెం.109, ఎన్‌సీఆర్‌పీయూ బిల్డింగ్, శంకర్ మార్కెట్ పక్కన, న్యూఢిల్లీ-110001.
- **వెబ్‌సైట్:** ipweindia.org.in

శాట్ ప్రిపరేషన్ ఇలా

విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులు రాయాల్సిన ప్రామాణిక పరీక్ష శాట్(స్కాలాస్టిక్ అసెస్‌మెంట్ టెస్ట్). ఇది వరకు దీనిని స్కాలాస్టిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌గా వ్యవహరించేవారు. వెర్బల్, మేథమెటికల్, రిటెన్ స్కిల్స్‌లో అభ్యర్థుల పరిజ్ఞానాన్ని పరీక్షించేందుకు ఈ పరీక్షను నిర్వహిస్తారు. ఒక రకంగా ఈ పరీక్ష విదేశాల్లో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో చేరాలనుకునే అభ్యర్థులకు పునాది రాయి వంటిదని చెప్పవచ్చు. ఇందులో అర్హత సాధించిన వారికి ప్రఖ్యాత యూనివర్సిటీల్లో కోరుకున్న కోర్సులో చేరే అవకాశం కలుగుతుంది. మెరిట్ స్కాలర్‌షిప్‌లతో ప్రపంచస్థాయి ఉన్నత విద్యను అభ్యసించవచ్చు.

శాట్ రిజిస్ట్రేషన్లు ఏడాది పొడుగునా కొనసాగుతాయి. **2024 ఆగస్టు 24న** శాట్‌ను నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షకు హాజరు కావాలనుకునే వారు ఆగస్టు 9వ తేదీలోపు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

వెబ్‌సైట్: *https://satsuite.collegeboard.org/sat*

శాట్ పరీక్షకు ఏటా వేలాది మంది అభ్యర్థులు హాజరవుతున్నారు. దాంతో పోటీ ఎక్కువగా ఉంటోంది. కాబట్టి అభ్యర్థులు సరైన ప్రణాళికతో చదివితే మెరుగైన స్కోరు సాధించడం ఏమంత కష్టమేమీ కాదు. అందుకోసం నిపుణులు ఏమి చెబుతున్నారో చూద్దాం..!



ఎవరు అర్హులు?

- ఉన్నత విద్యను పూర్తి చేసి యూఎస్ఏ, కెనడా, యూకే, సింగపూర్, నెదర్లాండ్స్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి దేశాల్లో అండ్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో చేరాలనుకునే వారు దరఖాస్తు చేసుకోవచ్చు.
- ఎలాంటి గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేనప్పటికీ ఎక్కువ సంఖ్యలో 17 నుంచి 19 సంవత్సరాల మధ్య ఉన్నవారే పరీక్షకు హాజరవుతున్నారు.
- పరీక్షకు ఎన్ని సార్లయినా హాజరు కావచ్చు. ప్రస్తుతం ఇండియాలో ఈ పరీక్షను ఏటా ఐదు సార్లు నిర్వహిస్తున్నారు.

శాట్‌ని ఎవరు నిర్వహిస్తారు?

- కాలేజీ బోర్డ్ శాట్ పరీక్షను ఇండియాలో నిర్వహిస్తుంది. ఈ ఏడాది 44 పట్టణాల్లో 73 కేంద్రాల్లో నిర్వహిస్తున్నారు.

స్కోరు ఎంత ఉండాలి?

ప్రధానంగా శాట్ స్కేల్‌పై ప్రతి విభాగపు(రీడింగ్ అండ్ రైటింగ్, మేథ్స్) స్కోరు 200 నుంచి 800 వరకు ఉంటుంది. మొత్తం స్కోరు 1600. మినిమమ్ స్కోరు 400 ఉండాలి. 2023లో యావరేజ్ స్కోరు 1010. కాబట్టి అభ్యరులు 400కి మించి స్కోరు సాధిస్తేనే ఏదైనా వర్సిటీకి దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. పెనాల్టీ విధానం లేదు. కాబట్టి మెరుగైన స్కోరు రావాలంటే అభ్యర్థులు ప్రతీ ప్రశ్నను అటెంప్ట్ చేయాలి. ప్రతి యూనివర్సిటీ తమ సొంత స్కోరును నిర్దేశించుకుంటాయి. అందువల్ల అభ్యర్థులు ముందుగానే ఆయా వర్సిటీల టార్గెట్ స్కోరును తెలుసుకోవడం ముఖ్యం.



రెఫరెన్స్ బుక్స్

1. ప్రిన్స్‌టన్ రివ్యూ: రీడింగ్ అండ్ రైటింగ్ వర్క్అవుట్ ఫర్ ద శాట్
2. ద అల్టిమేట్ గైడ్ టు శాట్ గ్రామర్, ఫిఫ్త్ ఎడిషన్
3. బారన్స్ శాట్ రీడింగ్ బుక్
4. కప్లాన్స్ శాట్ టోటల్ ప్రిపరేషన్

శాట్ పరీక్ష ఎలా ఉంటుంది?

శాట్‌లో ప్రధానంగా రెండు విభాగాలుంటాయి. అవి.. రీడింగ్ అండ్ రైటింగ్, మేథ్స్. ఈ రెండింటికి కలిపి 2 గంటల 14నిమిషాల సమయాన్ని నిర్దేశించారు. 64 నిమిషాల్లో రీడింగ్ అండ్ రైటింగ్, 70 నిమిషాల్లో మేథ్స్ విభాగాన్ని పూర్తి చేయాలి. అయితే రెండు విభాగాల మధ్య 10 నిమిషాల బ్రేక్ సమయం ఉంటుంది. ఈ సమయాన్ని అభ్యర్థులు తాము ప్రారంభించబోయే తదుపరి విభాగం సన్నద్ధతకు ఉపయోగించుకోవచ్చు. ప్రశ్నపత్రాన్ని పరిశీలించినట్లయితే ప్రతి విభాగంలో ప్రశ్నల సరళి సులభం, ఓ మోస్తరు, కఠినంతో కూడి ఉంటాయి.

సెక్షన్	ప్రశ్నల సంఖ్య	సమయం
రీడింగ్ రైటింగ్ అండ్ లాంగ్వేజ్	54	32 నిమిషాలు 32 నిమిషాలు
మేథ్స్ ప్రాబ్లమ్ సాల్వింగ్ అండ్ డేటా అనాలసిస్	44	35 నిమిషాలు 35 నిమిషాలు

- అభ్యర్థుల్లో విమర్శనాత్మక విశ్లేషణ సామర్థ్యం, విభిన్న రచనా శైలి, తార్కికత, ఆలోచన ధోరణులను పరీక్షించేలా రీడింగ్ అండ్ రైటింగ్ విభాగం ఉంటుంది. అదేవిధంగా గ్రామర్, వొకాబులరీ, రైటింగ్ ఎబిలిటీస్‌పై అభ్యర్థుల సామర్థ్యాన్ని అంచనా వేసే మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు కూడా ఉంటాయి.
- ఇక మేథ్స్ విభాగం పూర్తిగా అభ్యర్థుల మేథమెటికల్ స్కిల్స్‌కి సంబంధించినది. ఆల్జీబ్రా, అడ్వాన్స్‌డ్ మేథ్స్, ప్రాబ్లమ్ సాల్వింగ్ అండ్ డేటా అనాలిసిస్, జామెట్రి అండ్ ట్రిగొనామెట్రీ నుంచి ప్రశ్నలు ఉంటాయి. అన్ని మాడ్యుల్స్‌లో ప్రశ్నలు మల్టిపుల్ చాయిస్ విధానంలోనూ, ఓపెన్ రెస్పాన్స్ ఫార్మెట్స్ విధానంలోనూ ఉంటాయి.

వీటిపై దృష్టి సారించండి

- అభ్యర్థులు తొలుత శాట్ స్ట్రక్చర్‌ని పూర్తిగా అవగాహన చేసుకోవాలి. సిలబస్‌ని పరిశీలించాలి. ప్రశ్నల సరళిని తెలుసుకోవాలి. ఆ తర్వాత పూర్తి స్థాయి అధ్యయనాన్ని ప్రారంభించాలి.
- ఏదైనా ప్రిపరేషన్ ప్లాన్‌ని అమలు చేసే ముందు అభ్యర్థులు ముందుగా బేసిక్ సెక్షన్‌లో తమకున్న నైపుణ్యాలను పరీక్షించుకోవాలి. ఎందుకంటే రీడింగ్ కాంప్రహెన్షన్‌లో సవాళ్లతో కూడిన ప్యాసేజీలు ఉంటాయి. రచయిత ఏం చెప్పడానికి ప్రయత్నిస్తున్నాడు, ఆయన ఆలోచన ధోరణి ఏమిటి, ముగింపు విధానం తదితరాలను ప్యాసేజీ చదివి అభ్యర్థులు గ్రహించగలగాలి. కాబట్టి అభ్యర్థులు ప్యాసేజీ చదవి ముఖ్యమైన పాయింట్లను సంగ్రహించగలిగితేనే రచయిత ఉద్దేశాన్ని అర్థం చేసుకున్నవారు అవుతారు. కఠినమైన ప్యాసేజీలకు చెందిన ప్రశ్నలను సాధించాలంటే వొకాబులరీపై మంచి పట్టు ఉండాలి. కాబట్టి అభ్యర్థులు ప్రతి రోజూ కొత్త పదాలను నేర్చుకోవడానికి ప్రత్యేకంగా కొంత సమయం కేటాయించుకోవాలి. ఆ పదాలు గుర్తుండాలంటే మాట్లాడేటప్పుడు, రాసేటప్పుడు నేర్చుకున్న వాటిని విరివిగా ఉపయోగించాలి. వాక్యనిర్మాణాలు, గ్రామర్‌పై అవగాహన పెరిగితే కేవలం రైటింగ్ స్కిల్స్ మెరుగుపడటమే కాదు, రీడింగ్ అండ్ రైటింగ్ విభాగంలో తప్పులను సులభంగా గుర్తించగలుగుతారు.
- అభ్యర్థులకున్న మేథమెటికల్ ఎబిలిటీస్‌లో పరిజ్ఞానాన్ని రెండు విభాగాల ద్వారా పరీక్షిస్తారు. అవి.. అల్జీబ్రా, జామెట్రీ. కాబట్టి అభ్యర్థులు ఎక్స్‌ప్రెషన్స్, ఈక్వేషన్స్, ఇనిక్వాలిటీస్(లైనీర్, క్వాడ్రాటిక్ సహా)పై దృష్టి కేంద్రీకరించాలి. జామెట్రీకి సంబంధించి లైన్స్, యాంగిల్స్, షేప్స్, పైథాగరస్ సిద్ధాంతం వంటి వాటిని ప్రాక్టీస్ చేయాలి. అదేవిధంగా ఇంటర్‌ప్రెటింగ్ గ్రాఫ్స్, టేబుల్స్, స్టాటిస్టికల్ ఇన్ఫర్మేషన్, పర్సంటైల్స్ వంటి వాటిని వీలైనంత సులభంగా సాధించేలా అవగాహన పెంచుకోవాలి. ముఖ్యంగా బేసిక్ మేథ్స్ అయిన రేషియోస్, పర్సంటైల్స్‌పై పట్టుసాధిస్తే ఈ విభాగానికి చెందిన ప్రశ్నలను సులువుగా సాధించవచ్చు.
- పైన పేర్కొన్న విధంగా అధ్యయనం చేయడంతో టైం మేనేజ్‌మెంట్, విమర్శనాత్మక విశ్లేషణ, ఒత్తిడిని జయించడం వంటి అంశాలు కూడా శాట్ విజయానికి సోపానాలు అవుతాయి.


లిటిల్స్

అంతరిక్షంలో ప్రతిధ్వనించే భారతీయ స్వరం



1977లో అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా సౌర వ్యవస్థ మరియు అంతరిక్షం గురించి పరిశోధనలు చేయడానికి పంపిన వ్యోమనౌక వోయేజర్-1 లో ప్రపంచ ప్రఖ్యాత కళాకారులైన బీథోవెన్, మొజార్ట్‌ల స్వరాలతో పాటు మన దేశంనుండి పంపబడిన స్వరం కేసర్ బాయి కేర్కర్ ది. కేసర్‌బాయి కేర్కర్ భైరవి రాగంలో ఆలపించిన 'జాత్ కహా హో అనే గీతం బంగారు పూతతో ఉన్న 12 అంగుళాల డిస్క్‌లో రికార్డ్ చేయబడి అంతరిక్షానికి పంపబడింది. 1977లో ఆవిడ మరణించిన సంవత్సరం లోనే ఆమె ఆలపించిన గీతం వోయేజర్ చేత పంపబడింది. అది నలభై సంవత్సరాలుగా అంతరిక్షంలో భారతీయ హిందుస్తానీ సంగీతాన్ని వినిపిస్తూనే ఉంది. పద్మ భూషణ్ కేసర్‌బాయి కేర్కర్ గీతం అంతరిక్షంలోకి ఎలా పంపబడిందనే కథను నేహా సింగ్ 'ఏ సాంగ్ ఇన్ స్పేస్' అనే పుస్తకంగా రాశారు.


దాగివున్న 10 వస్తువులు గుర్తించండి?



కుక్కలు ఎన్ని



ఏ వాహనం ముందుగా చేరుతుంది





డైలీ సుడోకు - 361

		4		5	
5				6	4
				3	
	5				
6	4				3
	3		1		

సుడోకు - 360 సమాధానం

9	2	3	7	1	8	4	6	5
1	6	5	4	9	2	8	7	3
7	8	4	3	6	5	9	2	1
8	9	6	1	7	3	5	4	2
4	7	1	2	5	6	3	9	8
3	5	2	9	8	4	7	1	6
2	3	9	8	4	1	6	5	7
5	1	7	6	3	9	2	8	4
6	4	8	5	2	7	1	3	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.